తిరుమల తిరుపతి దేవస్థానములు

# సప్తగిరి

సచిత్రమాసపత్రిక

ఫిబ్రవరి 2021

వెల రూ. 5/-



తిరుమలలో
రథసప్తమి
19-02-2021





01-01-2021 తేదీన నూతన సంవత్సరం సందర్భంగా తి.తి.దే. తరపున
ఆంధ్రప్రదేశ్ గవర్నరు గౌరవనీయులు మాన్యశ్రీ బిశ్వభూషణ్ హరిచందన్ గారికి మరియు
ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రివర్యులు మాన్యశ్రీ వై.యస్.జగన్మోహన్ రెడ్డి గారికి నూతన సంవత్సర శుభాకాంక్షలు
తెలియజేసి శ్రీవారి ప్రసాదాన్ని అందజేస్తున్న తి.తి.దే. పాలకమండలి అధ్యక్షులు శ్రీ వై.వి.సుబ్బారెడ్డి గారు.









15-01-2021 నాడు గుంటూరు జిల్లా నరసారావుపేటలో తి.తి.దే. నిర్వహించిన కామధేను పూజామహోత్సవం.
ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రివర్యులు మాన్యశ్రీ వై.యస్.జగన్మోహన్‌రెడ్డిగారు,
తి.తి.దే. పాలకమండలి అధ్యక్షులు శ్రీ వై.వి.సుబ్బారెడ్డి,
తి.తి.దే. కార్యనిర్వహణాధికారి డా॥ కే.ఎస్.జవహర్ రెడ్డి, ఐ.ఏ.ఎస్. గారలు మరియు ఇతర అధికార్లు పాల్గొన దృశ్యం



# గీతాశ్లోకార్థసారం

**శ్లో :** స ఘోషో ధార్తరాష్ట్రాణాం హృదయాని వ్యదారయత్।
నభశ్చ పృథివీం చైవ తుములో వ్యనునాదయన్ ॥

(శ్రీమద్భగవద్గీత 01వ అధ్యాయం-19వ శ్లోకం)

**ప్రతిపదార్థం:** సః=ఆ (అట్టి); తుములః= భయంకరమైన; ఘోషః= నాదము; నభః చ= ఆకాశమును; పృథివీమ్ చ ఏవ= భూమిని గూడ; వ్యనునాదయన్= ప్రతి ధ్వనింపజేయుచు; ధార్తరాష్ట్రాణామ్= ధార్తరాష్ట్రులయొక్క అనగా మీ వారి; హృదయాని= హృదయములను; వ్యదారయత్= కకావికలములుగాజేసెను.

**భావం:** పాండవపక్షమహాయోధుల శంఖనినాదములకు భూమ్యాకాశములు దద్దరిల్లినవి. ఆ శంఖారావములకు ధార్తరాష్ట్రుల హృదయములు కకావికలములయ్యెను.

## పరమశాంతునకుఁ బాపము రాదు


దేవ నీవు గల్పించిన - తెరువు లివి
నీవారైన వారి - నేరుపు లివి.

పరమశాంతునకుఁ - బాపము రాదు
విరతి గలవానికి - వెరవు లేదు,
గురుసేవారతునకుఁ - గోపము రాదు
ధర సత్యవిదునకుఁ - దప్పు లేదు.

పుట్టు బ్రహ్మచారికి - బుద్ధి చెడదు
ఆట్టె ఆసలేనివారికి - అలపు లేదు,
తొట్టిన సుజ్ఞానికి - దుఃఖము లేదు
గట్టియైన మౌనికి - కలహమే లేదు.

సమచిత్తునకును - చంచలము గాదు
విమలాచారునకు - వెలితి లేదు,
నెమకి శ్రీవేంకటేశ - నీదాసులై కొల్చి
భ్రమయనివారికి - భారము లేదు.

(అన్నమాచార్య సంకీర్తన - 2-307)





*శాంతి, వైరాగ్యము, గురుసేవ, సత్యము, బ్రహ్మచర్యము, ఆశలేమి, సుజ్ఞానము, మౌనము, సమచిత్తత్వము, నిర్మలాచారము అనునవి భాగవతుల కొఱకై భగవంతుడు దిద్ది తీర్చిన బాటలుగా ఇట పేర్కొనబడినవి. భగవంతుడు ఎవరి ననుగ్రహింప దలచునో వారికీ పై జెప్పిన సుగుణములను కల్గించును. కాన భాగవతులు నిత్యము అనుష్ఠానములో నుంచు పరమధర్మములుగ వీటిని గుర్తింప వలయును.*



# వేదమాత

- డా॥ ఎన్.వి.జె.లక్ష్మి

*విద్యయొసగును వినయమ్ము వినయమునను*
*పడయు పాత్రత, పాత్రత వలన ధనము*
*ధనమువలనను ధర్మము, దానివలన*
*ఐహికాముష్మికసుఖంబు లందు నరుడు.*

ఋగ్వేదం–సరస్వతీ సూక్తంలోని ॥ధీనామవిత్ర్యవతు॥ మంత్రసారాంశం– బుద్ధులను రక్షించుదేవి(మనలను) రక్షించు గాక!

వాక్ బుద్ధి జ్ఞానాలకు అధిష్ఠాత్రి అయిన శక్తి సరస్వతీ దేవి. ఈ తల్లి వలననే బుద్ధిశక్తులు పనిచేస్తాయి. ప్రేరణ, ఆలోచన, స్ఫురణ, నిర్ణయం... ఇవన్నీ బుద్ధిపనులు. వీటి వలననే జీవితగమనం నిర్దేశింపబడుతుంది. అందుకే బుద్ధి తిన్నగా ఉంటే అన్నీ తిన్నగా ఉంటాయంటారు.

ధారణ, ప్రతిభ, మేధ, ప్రజ్ఞ, స్మృతి, కల్పన, విద్య... మొదలైన శక్తుల విశిష్టత మనకు తెలిసినదే.

ఈ బుద్ధిని రక్షించే ఈశ్వర చైతన్యాన్ని మనం సరస్వతీ దేవిగా ఆరాధిస్తున్నాం. విద్యల తల్లి కృప సర్వజీవులకు అవసరం. బుద్ధులను పాలించే ఆ తల్లినే 'ధియో యో నః ప్రచోదయాత్' అని వేదమాతగా అభివర్ణించి ప్రస్తుతించారు ఋషులు.

మంచి ఆలోచన, విషయాన్ని చక్కగా అవగాహన చేసుకోగలగడం, సత్కర్మలకు తగిన ప్రేరణ, సంకల్పం, ఆచరణకనువైన విజ్ఞానం ఇవన్నీ బుద్ధికి ఉండవలసిన సులక్షణాలు. వీటిని కలిగించేది భారతీదేవి అనుగ్రహమే.

ఈ జగదంబిక కృపవల్లనే మహర్షులు, వ్యాసవాల్మీకి కాళిదాసాదులు, త్యాగరాజాది వాగ్గేయకారులు వారు తరించి, మనలను తరింపజేశారు.

విశ్వమంతా శబ్దబ్రహ్మగా వ్యాపించిన ఈ జగదంబిక అన్నప్రదాయినిగా, అన్న శక్తి సంభరితురాలుగా వేదసూక్తాలలో సాక్షాత్కరిస్తోంది. 'అన్నములు కల తల్లి'– 'వాజేభిః'– ఆ అన్నములతో– (ఐశ్వర్యములతో) మనలను రక్షించాలని కీర్తిస్తూ.. ఐశ్వర్యార్జనకు, వినియోగానికి కావలసిన జ్ఞానం బుద్ధ్యాధారం కనుక ఆ బుద్ధిని జగదంబ రక్షించాలని వేదం సంభావించింది.

శబ్దబ్రహ్మ స్వరూపిణి అయిన ఈ తల్లి కృప లేకుంటే జగతి స్తబ్ధమై, జడీభూతమై ఉంటుంది.

విశ్వరచన చేసే విశ్వేశ్వరుని విజ్ఞానమంతా ఒక రూపు కడితే ఆమెయే సరస్వతి.

ప్రకాశమయమైన జ్ఞానాకృతి కనుక 'భారతి'. అక్షర రూపిణిగా స్వరస్వరూపిణిగా ఆరాధింపబడే నాదమయి ఈ తల్లి. ప్రసరించే, ప్రవహించే లక్షణం గలది కనుక 'సరస్వతి'. చైతన్య లక్షణమే ప్రసరణ. ఇదే చైతన్యలహరి.

వేదవిజ్ఞానం ప్రకారం ఒకే పరాశక్తి (జగదంబిక) తన పలుశక్తులను ప్రకటించేటప్పుడు పలువిధాల ఆకృతులను ధరించింది. సరస్వతిగా, లక్ష్మిగా, దుర్గగా, అన్నపూర్ణగా, శాకంభరిగా ఈ చైతన్యరూపిణిని ఋషులు ప్రస్తుతించారు.

మనలోని ప్రాణశక్తియే సరస్వతి అని శ్రుతివాక్యం.

'ప్రాణశక్తిః సరస్వతీ'. మనలోని అంతః స్రవంతిగా ఉన్న చైతన్యమే ఈ తల్లి స్వరూపం. సరస్వతీ ఆరాధనకు ప్రాధాన్యమిచ్చిన దేశం మనది.

భారతి– భారత– భారతీయత... ఇవన్నీ జ్ఞానప్రాముఖ్యాన్ని చెప్పే శబ్దాలు. శారదాదేవి కృప వలన ఆసురీశక్తుల బుద్ధులు స్తంభించబడి, లోకక్షేమాన్ని ఆశించే ధార్మికుల బుద్ధులు వికసించి, లోకహితాలోచనలు ప్రేరేపింపబడాలని ప్రార్థిద్దాం.

50 వసంతాల
1970-2020
తిరుమల తిరుపతి దేవస్థానముల సచిత్ర మాసపత్రిక

# సప్తగిరి

సంపుటి : 51 ఫిబ్రవరి, 2021 సంచిక : 09



వేంకటాద్రి సమం స్థానం
బ్రహ్మాండే నాస్తి కించన ।
వేంకటేశ సమో దేవో
న భూతో న భవిష్యతి ॥

**గౌరవ సంపాదకులు**
డా॥ కే.ఎస్.జవహర్ రెడ్డి, ఐ.ఏ.ఎస్.,
కార్యనిర్వహణాధికారి, తి.తి.దేవస్థానములు.

**ప్రచురణకర్త-ప్రధాన సంపాదకులు**
ఆచార్య కె.రాజగోపాలన్, పిహెచ్.డి.,

**సంపాదకులు**
డా॥ వి.జి.చొక్కలింగం, ఎం.ఏ., పిహెచ్.డి.,

**ఉపసంపాదకురాలు**
డా॥ అల్లాడి సంధ్య
ఎం.ఏ., ఎం.ఫిల్., పిహెచ్.డి., పి.జి.డిప్లొమా ఇన్ జర్నలిజం

**ముద్రాపకులు**
శ్రీ పి.రామరాజు, ఎం.ఏ.,
ప్రత్యేకాధికారి (ప్రచురణలు & ముద్రణాలయం),
తి.తి.దే., తిరుపతి.

**ఫోటోలు**
శ్రీ పి.ఎన్.శేఖర్, ఫోటోగ్రాఫర్, తి.తి.దే.
శ్రీ బి.వెంకట్రమణ, సహాయఫోటోగ్రాఫర్, తి.తి.దే.,

సప్తగిరి మాస పత్రిక
ఇతర వివరాలకు
ఫోన్ నెంబర్లు
0877-2264543
0877-2264359
0877-2264360

విడి ప్రతి : రూ. 5/-
సం॥ చందా : రూ. 60/-
జీవిత చందా : రూ. 500/-
విదేశాలకు సం॥చందా : రూ. 850/-

## ఈ నెలలో....

| | | |
|---|---|---|
| వేదమాత | డా॥ఎన్.వి.జె.లక్ష్మి | 04 |
| ఓంకార వివరణ | ఆచార్య ఎమ్.ఎస్.ఆర్.ఎస్.శర్మ | 07 |
| శ్రీవత్సచిహ్నమిశ్రవైభవమ్ | డా॥ పి.టి.జి.రంగరామానుజాచార్యులు | 09 |
| భాస్కరమ్ భువనేశ్వరమ్ | శ్రీ వేదార్థం మధుసూదనశర్మ | 12 |
| భాగవతంలో వివిధ స్తోత్రాలు | శ్రీ కె.వి.సుందరాచార్యులు | 15 |
| తిరుమలేశుని 'భక్తుల' వృత్తాంతాలు | ప్రొ॥ సి.లలితారాణి | 17 |
| తిరుమల శ్రీనివాసుని సప్తవాహన వైభవం | డా॥ జి.లక్ష్మీనారాయణ | 21 |
| అన్నమయ్య జీవితచరిత్ర | డా॥ మన్నూరు శివప్రవీణ్ | 23 |
| అష్టాక్షర మహామంత్రమాహాత్మ్యము | డా॥ పెన్మెత్స వెంకటరాజు | 25 |
| శ్రీమద్భగవద్గీత | విద్వాన్, డా॥ ఈ.జి.హేమంత కుమార్ | 31 |
| శ్రీలక్ష్మీనారసింహస్వామిక్షేత్రం, అంతర్వేది | డా॥ చల్లా సత్యవాణి | 33 |
| అష్టలక్ష్ములు మిమ్మల్ని ఆశీర్వదిస్తారు | శ్రీమతి ఎ.లక్ష్మి | 36 |
| త్రిపురాసుర సంహారము | డా॥ వైష్ణవాంఘ్రిసేవకదాస్ | 38 |
| అద్భుతమైన తృప్తి | శ్రీమతి సి.వి.సులోచనాకృష్ణ | 40 |
| శ్రీవేంకటేశ్వరవైభవం-పురందరదాసులు | కీ॥శే॥ జానమద్ది హనుమచ్ఛాస్త్రి | 41 |
| భీష్మైకాదశి | శ్రీ ఎమ్.రామ్‌ప్రసాద్ | 44 |
| సంస్కృతం నేర్చుకుందాం..!! | రచన- మహామహోపాధ్యాయ కె.కృష్ణాచార్య<br>నిర్వహణ- మహామహోపాధ్యాయ ఎస్.లక్ష్మణయ్య | 46 |
| 'అహంకారం' ప్రమాదకరమైన అవలక్షణం | శ్రీ కె.మల్లికార్జున | 47 |
| 'దానిమ్మ'లో మెండైన ఔషధగుణాలు | డా॥ చిట్టిభొట్ల మధుసూదనశర్మ | 49 |
| వైకుంఠపాళి | శ్రీ కోగంటి వేంకటఅప్పలాచార్యులు | 50 |
| తొందరపడకు- ముందర చెడకు! | డా॥ కె.వి.జి.కె.ఆచార్యులు | 51 |
| ఉత్తమపుత్రుడు (చిత్రకథ) | కథ : డా॥ కంపల్లె రవిచంద్రన్<br>చిత్రాలు : శ్రీ కె.తులసీప్రసాద్ | 52 |
| క్విజ్ | నిర్వహణ: శ్రీమతి పద్మజ | 54 |

**ముఖచిత్రం** : సూర్యప్రభవాహనంలో శ్రీమలయప్పస్వామి ఉత్సవమూర్తి, తిరుమల
**వెనుక చిత్రం** : శ్రీదేవి భూదేవి సమేత శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి ఉత్సవమూర్తి, దేవుని కడప

ఇందులోని వ్యాసాలు, అభిప్రాయాలు రచయితల వ్యక్తిగతమైనవి. వాటికి తిరుమల తిరుపతి దేవస్థాన యాజమాన్యం బాధ్యత వహించదు.

24 గంటలూ పనిచేసే
తి.తి.దే. కాల్‌సెంటర్ ఫోన్ నెం.
0877 2277777 / 2233333



వెబ్‌సైట్- www.tirumala.org;
'సప్తగిరి' మాసపత్రికకు సంబంధించిన సలహాలు / సూచనలు / ఫిర్యాదులు-
sapthagiri_helpdesk@tirumala.org; ద్వారా తెలియజేయవచ్చు.

సంపాదకీయం..

# 'ప్రణతోஉస్మి దివాకరమ్'

***'జపాకుసుమ సంకాశం కాశ్యపేయం మహాద్యుతిమ్। తమోஉరిం సర్వపాపఘ్నం ప్రణతోஉస్మి దివాకరమ్॥'***

భారతీయ సంస్కృతిలో సంప్రదాయాలకు ఆచారాలకు విశిష్టస్థానముంది. ఇందులో భాగంగా మాఘమాసంలో వచ్చే శుక్లసప్తమిని **'రథసప్తమి'** అని వ్యవహరిస్తారు. సూర్యోపాసకులకు ఈ రోజు పరమపవిత్రమైనది. రథసప్తమినాడు బ్రాహ్మీముహూర్తంలోనే స్నానాదులు పూర్తి చేసుకొని జప దాన అర్ఘ్యప్రదానం మొదలైనవి చేసినట్లయితే విశేషఫలితాలు కలుగుతాయి. ఆయురారోగ్యాలతో పాటు సంపదలు కూడా సిద్ధిస్తాయి. రోజూ చేసే పూజాదులకంటే రథసప్తమినాడు జరిపే పూజకు ప్రత్యేకత ఉంది.

సూర్యోదయానికి ముందరే లేచి స్నానమాచరిస్తారు. జిల్లేడు ఆకులను స్నానంలో ఉపయోగిస్తారు. ఏడు జిల్లేడు ఆకులను తలపైన హృదయంపైన భుజాలపైన ఉంచుకొని స్నానమాచరించడం శ్రేష్ఠం. ఈ విధంగా స్నానం చేసేటప్పుడు ***'సప్తసప్తమహాసప్త సప్తద్వీపావసుంధరా, సప్తార్కపర్ణమాదాయ సప్తమీ రథసప్తమీ'*** అనే శ్లోకం చెప్పుకోవాలి.

ఆనాడు సూర్యుని ఎదురుగా ఆవుపాలతో తయారుచేసిన క్షీరాన్నాన్ని వండి నైవేద్యంగా సమర్పిస్తారు. సూర్యుడు క్షీరాన్నప్రియుడు. దీనిని వండడంలో కూడా ఆవుపేడతో చేసిన పిడకలను ఉపయోగిస్తారు. ధనుర్మాసంలోని గొబ్బెమ్మలను పిడకలుగా చేసి వాటిని రథసప్తమినాడు కొందరు వినియోగిస్తారు. సౌరశక్తికి, ఆవుపాలకు, ఆవు పేడకు కూడా సంబంధముందని వైజ్ఞానికంగా నిరూపించబడింది.

వాటిపై తయారు చేసిన క్షీరాన్నాన్ని చిక్కుడాకులలో వడ్డించి నివేదిస్తారు. నివేదన కూడా సూర్యభగవానునికి చేస్తారు. చిక్కుడుకాయలను అందమైన రథంలా అమర్చి గంధాన్ని ఉంచి, సూర్యుని ఆవాహన చేసి, షోడశోపచారాలతో పూజిస్తారు.

సూర్యోపాసన శక్తివంతమైనదని మనకు ఆయా పురాణాల ద్వారా తెలుస్తున్నది. శ్రీరాముడు 'ఆదిత్యహృదయ' పఠనం చేసిన తర్వాత రావణునితో యుద్ధం చేశాడు. అంతేకాదు సూర్యుడు వేదవేత్త. హనుమంతుడికి సకలవిద్యలు నేర్పిన గురువు. అందుకే మన ఋషులు సూర్యోపాసనకు ఎంత ప్రాధాన్యమిచ్చారు. సూర్యుని ప్రత్యక్షదైవంగా భావించి తరతరాలుగా కొలుస్తున్నారు. ***'ఆరోగ్యం భాస్కరాదిచ్ఛేత్'*** అన్నారు పెద్దలు. అంటే సూర్యుడు ఆరోగ్యాన్నిచ్చేవాడని అర్థం. సూర్యారాధన ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. అందుకే మన దేశంలో పామరులు సైతం ఉదయాన్నే సూర్యుడికి నమస్కరిస్తారు. కొందరు నిత్యం సూర్యనమస్కారాలతో ఆరోగ్యాన్ని కాపాడుకుంటారు. సూర్యుడు లేకుంటే ఈ జగత్తు లేదు. ఈ జగత్తును దర్శిస్తూ అందులో జీవిస్తున్న మనమూ ఉండము.

రథసప్తమి అందించే సందేశాన్ని కూడా మనం గ్రహించాలి. శరీరమే ఒక రథం. మనస్సును కూడా రథంతో పోలుస్తారు. ఇంద్రియాలనే గుఱ్ఱాలు వశం తప్పిపోయి అదుపులో లేకపోతే ప్రమాదకరం. బుద్ధి సహాయంతో ఇంద్రియాలను అదుపులో ఉంచుకుంటూ సన్మార్గంవైపు గతిని మార్చుకుంటే మంచి పథంవైపు ముందుకు వెళ్లగలం.

కలియుగ వైకుంఠమైన తిరుమల పుణ్యక్షేత్రంలో కూడా 'రథసప్తమి' పండుగ అత్యంత వైభవంగా జరుపబడుతుంది. ఈ రథసప్తమి పండుగరోజున సూర్యోదయం నుండి చంద్రోదయం వరకూ, తిరుమలేశుడు ఏడు వాహనాల్లో నాలుగు మాఢవీథులలో ఊరేగుతూ భక్తజనావళిని అనుగ్రహిస్తాడు. సప్తగిరీశుని బ్రహ్మోత్సవం పదిరోజుల పాటు జరుగగా, రథసప్తమినాడు ఒకే రోజున అన్ని వాహనసేవలు జరుగుతున్నందు వల్ల దీనిని 'ఒకరోజు' బ్రహ్మోత్సవమని అంటారు.

***రండి. బ్రహ్మాండనాయకుని రథసప్తమిని కనులారా దర్శించి తరించండి. గోవిందుని సదా స్మరించండి.***

# ఓంకార వివరణ

- ఆచార్య ఎమ్.ఎస్.ఆర్.ఎస్.శర్మ

ఆదిమధ్యాంత రహితుడు, వర్ణవర్గ విభేదరహితుడు, అజ రామరణుడు, విశ్వసృష్టికి అతీతుడు, యోగమాయాకారకుడు, వర్ణింపనలవి కానివాడు, అక్షరకారకుడు, లోకకల్యాణకారకుడు, సదాతపోనిష్ఠలో ఉండెడివాడు, సత్యధర్మస్వరూపి, సర్వాంతర్యామి, సృష్టిస్థితిలయకారకుడు, తన సృష్టిలోని మార్పులతో ఏ సంబంధం లేనివాడు, చిద్విలాసమూర్తి, చిదానందరూపి, పాప పుణ్యరాహిత్యుడు అయిన కాలరుద్రుడు, పరమేశ్వరుని (పరమే శ్వరుడంటే శివుడుగా అనుకోకూడదు. పరమేశ్వరుడు అంటే ఏ వర్ణనకు సరిపోని సరికాని సర్వలోక దీనజన సంరక్షకుడనే అసలు అర్థం. కాలంతో జరిగే మార్పులలో పరమేశ్వరుడంటే శివయ్యగా రూపాంతరం చెందింది. ఈ సంపూర్ణ వివరణ మనకు గజేంద్రమోక్షంలో ఉంది. "కావవే ఈశ్వరా! వరదా! పరమేశ్వరా" అంటూ గజరాజు ఆపద్బాంధవుడిని శరణు కోరు తుంది.) అధోరేతస్సు నుండి సృష్టి, బ్రహ్మరేతస్సు నుండి దేవాది దేవులు, దేవతల రేతస్సున వర్ణము, వర్ణరేతస్సున ఓషధులు, ఓషధుల రేతస్సున ధాన్యాదులు, ధాన్యాదుల రేతస్సున ప్రజలు, ప్రజల రేతస్సు వలన హృదయము, హృదయ రేతస్సు వలన మనస్సు, మనోరేతస్సు వలన మాటలు, మాటల రేతస్సు వలన కర్మపురుషుడు ఉద్భవించాయి. ఆ కర్మపురుషుని పరమాత్మలోని అంతర్భాగాన గల అంతరాత్మ మధ్యభాగం నుండి ఒక జ్యోతి వెలుగసాగింది. అది "ఓం" గా వెలిగింది. ఈ "ఓం" అనే జ్యోతికి ఆకృతి లేదు. ఎందుకంటే "ఓం" ఒక్కొక్క భాషలో ఒక్కొక్క అక్షరరూపంగా(ॐ) ఉంటుంది. ఆ వెలిగే జ్యోతి ఆకృతి రాహిత్యమై, మహోజ్జ్వల శబ్దాకృతిని మాత్రమే కలిగి ఉంటుంది. అందుకే, అది ప్రణవంగా, ఒక జ్యోతిగా నిర్ణయింపబడింది. ఓం అనే జ్యోతిని ఆకృతి అనుకుంటే ఇందు నుండి బింద్వాకృతి, అర్ధచంద్రాకృతి, కుండలాకృతి, వీణదండాకృతి, తారాకాకృతి ఉద్భవించాయి.

ఆ జ్యోతి ప్రతిమానవుని హృదయాంతరాళాల్లో, ప్రతి అంతరాత్మ అంతర్భాగంలో ఉంటుంది. దానిని స్వచ్ఛంగా, స్పష్టంగా, నాభి నుండి మెల్లమెల్లగా, శబ్దాన్ని ప్రారంభించి, ఆ శబ్దం పరిపూర్ణమయ్యేసరికి ఒక రూపం దాల్చి, గంభీరంగా, గట్టిగా వినబడేలా నిర్మల హృదయంతో పలుక గలిగినవాడు చతుర్వేదాలనుచ్చరింపదగ్గవాడే గాక, చతుర్వేదసారం తెలుసుకో గలిగిన సూక్ష్మగ్రాహిగానే చెప్పుకోవాలి. అదే మానవుని తొలి శబ్దం. అందుకే దానిని మూలమంత్రం అంటారు. తక్కిన



మంత్రాలు, స్తోత్రాలు మహాత్ముల, మహర్షుల ద్వారా విరచింప బడినవి. కానీ, ఈ శబ్దం సహజంగా అనునిత్యం మానవుని అంతరాత్మలో అంతర్లీనమై ఉంటుంది. అందుకే ఈ సహజ శబ్దాన్ని ప్రతీ విరచిత మంత్రస్తోత్రాలకు ముందు ఉచ్చరింపదగ్గ మూలమంత్రంగా నిర్ణయించారు. అంటే భగవదారాధనకు సహజత్వమే శ్రేష్ఠమైనదని మనం తెలుసుకోవాలి. మహాయోగి పుంగవులు, మహర్షులు, నారాయణ, నమశ్శివాయ తక్కిన మంత్రాల కంటే, ఎక్కువగా తపస్సు చేసేది "ఓం"కార మంత్రం తోటే. "ఓం" కారం ద్వైతాద్వైతాలకు, వివిధధర్మాలకు అతీతం. హిందువులు "ఓం" తోటే వారివారి పూజ, ధ్యానం, తపస్సు ప్రారంభిస్తారు. "ఓం" లేకుండా చేసే మంత్రోచ్చారణ, ధ్యానం తపస్సు పండు లేని చెట్టువలె; విద్యాధికులు, గురువులు అగ్రజులు లేని ఊరివలె; స్త్రీ గౌరవింపబడని ప్రాంతం వలె; ప్రభువు లేని పురము వలె; ఋతుక్రమం లేని కాలం వలె; భర్తను సేవించని భార్యవలె; తల్లిదండ్రుల పూజింపని బిడ్డవలె; అతిథులను ఆదరించని ఇల్లాలి వలె; దైవకాలక్షేపమో, పురాణ కాలక్షేపమో చేయని గృహస్థువలే నిర్జీవమై, శూన్యమై, సత్ఫల రాహిత్యమవుతుంది.

## త్రిమూర్తులనూ తలపించే ఏకాక్షర మంత్రం

అ+ఉ+మ=ఓం. అంటే ఇది త్రిమూర్తి స్వరూపం, 'అ' కారం-బ్రహ్మకు దాసోహం, 'ఉ' కారం-శ్రీమహావిష్ణువుకు

నివాసం, 'మ' కారం– ఈశ్వరుని స్వరూపం. త్రిమూర్తుల స్వరూపమైన ఓం కారం మన అంతర అంతరాత్మలో అంతర్లీనమై శబ్దజ్యోతిగా నిలిచి ఉన్నదంటే, అటువంటి పరమాత్మ సమ్మిళితమైన జీవాత్మ ఎంత పావనమో! అందుకే, అమోఘమైన పరమాత్మ జీవాత్మల మానవదేహం, ప్రకృతిలోని సకల అద్వితీయ నిర్ణీత నిర్ణయశక్తులకు ఆలవాలమని, మానవజన్మ సర్వశ్రేష్ఠమని అంటారు.

## ఓంకారం పలికితే నిరాకారుడైన ఏ దేవుడినైనా స్మరించినట్లే...

నారాయణ మంత్రమో, పంచాక్షరీ మంత్రంతోనో ధ్యానం చేస్తే ఒక్క దైవాన్నే పూజించినట్లవుతుంది. కానీ "ఓం"కార జపధ్యానంతో నిర్ణీత స్వరూపాన్ని గాక, అచంచల జ్ఞానరూపాన్ని ధ్యానించినట్లవడమే గాక త్రిమూర్తులను ఆరాధించిన ఫలితంతో బాటు, వారి వరప్రసాదంగా సకల కళాజ్ఞానసిద్ధులు కలగడం తథ్యం.

వేదాలకు మూలం కూడా ఈ "ఓం"కారమే. సకలశాస్త్ర వేదవేదాంగస్మృతి సారమంతా ఒక్క "ఓం"ని నిష్ఠగా, భక్తిగా ధ్యానించడంలో కలుగుతుంది. ఏ అలజడులు లేని ఒక నిర్మల ప్రాంతంలో, సంపూర్ణ భక్తి విశ్వాసాలతో, ఏ చీకూచింతాకోరిక లేని ఏకాగ్రచిత్తంతో, పద్మాసీనుడై, చిద్విలాసుడై, కనులు మూసుకుని "ఓం" కారం జపిస్తే ఏ మనిషికైనా అలౌకిక అనుభవైక ఆనందం కలుగుతుంది.

అలా ఉండగలిగినప్పుడు ఆ వ్యక్తికి అంతర్లీనమైపోయి ఉన్న శబ్దజ్యోతి జ్ఞాననేత్రానికి దర్శనమియ్యడమే గాక, సృష్టి రహస్య సూక్ష్మ సంపూర్ణ జ్ఞానం కలిగి, అసలు సిసలైన ఆనందం పొందగలుగుతాడు. ఆ స్థితికి చేరుకున్న వ్యక్తికి ఐహికసుఖాలు, ఐహిక ప్రపంచం గురించిన ఆసక్తి ఉండదు.

ఎందుకంటే ఏ ప్రాపంచిక విషయం అయినా "అందులో ఏముందో, అది ఏమిటో, ఎలాగుంటుందో" అని సరిగ్గా అవగాహన లేకపోతేనే, ఆసక్తి, అందుకోవాలన్న ఆత్రుత, సరదా ఉంటాయి. ఆ అవగాహన తెలిసిపోయి, ఆ రహస్యం ఛేదింపబడగానే, "ఓస్ ఇంతే కదా"అని ఆసక్తి తగ్గిపోతుంది. ఒక్క దైవిక శాస్త్ర సమ్మత విషయాలలోనే రహస్యాలు, నిజాలు తెలియగా తెలియగా "ఇంకా ఏముందో ఇంకా ఎంత ఉందో" అనే ఆసక్తి పెరుగుతుంది.

అట్లే, "ఓం"కార జ్ఞానమూర్తికి ఐహిక సుఖాపేక్షపోయి, అలౌకిక అద్వితీయ శక్తి సృష్టిమాయలను, శక్తిలీలలను తెలుసుకోవాలనే తపన పెరిగి, పెద్దదై రూపాంతరం చెందుతుంది. మనకున్న అనేకస్తోత్రాలు ఆదిశంకరాచార్యుల విరచితమే. అంటే ఆయన తర్వాతనే మనకు సంక్రమించాయి.

మరి ఆయన అసలు జపించి ధ్యానించినది ఏమిటి? అని ఆలోచిస్తే అదే ప్రణవనాదం, నాదబ్రహ్మం, తేజోమయం, నిర్గుణ నిరాకారం, జ్ఞానసాక్షాత్కారం, సర్వశక్తి స్వరూపం, సముచిత శబ్దవిన్యాసం, మహిమాన్వితం, మహోత్తమం అయిన "ఓం" కారాన్ని, అని అర్థమవుతుంది.

## వీచేగాలిలోనూ...
## తల్లిగర్భంలోనూ...
## ప్రతిధ్వనించే శబ్దం "ఓం"

గాలి వేగంగా వీచినప్పుడు ఒక శబ్దం వినిపిస్తుంది. అందులో ఓంకారనాదం ఉంది. తల్లి గర్భంలో బిడ్డ పడుకుని ఉండే ఆకారం కూడా ఓంకార రూపంలోనే.

అలాగే మన చెవి కూడా ఓంకారాకారంలోనే ఉంది. తెలిసో తెలియకో దేవుణ్ణి పూజించనివారు సైతం చేసేది చెవులు పొడిపించి, అందులో బంగారు పోగులు పెట్టడం అంటే ఓంకారానికి పవిత్ర లోహమైన బంగారాన్ని సమర్పించి ఎంతో విలువ నిస్తున్నట్లేగదా! ప్రశాంతమైన నిశ్చలవాతావరణంలో మనసుకు ఓంకారం ఆహ్లాదం కలిగిస్తుంది. శాంతిని ప్రసాదిస్తుంది.

'ఓం' అర్థాన్ని సాక్షాత్తు సర్వేశ్వరుడికి స్కందుడు ఉపదేశించాడని పురాణాలు వెల్లడిస్తున్నాయి. ఈ 'ఓం' అర్థాన్ని బ్రహ్మదేవుడికి శ్రీమన్నారాయణుడు ఉపదేశించాడు. 'ఓం'లో ఎంతో తత్త్వం, వేదవేదాంత జ్ఞానం అన్నీ ఇమిడి ఉన్నాయి. 'ఓం' పరమార్థం గ్రహించగలిగినవాడు సర్వజ్ఞాని, బ్రహ్మజ్ఞాని కాగలడు. అది యుగానికి ఒకరికే సాధ్యం. పెరిగిన వైజ్ఞానిక సాంకేతిక పరిజ్ఞానం ద్వారా నేటి దేవాలయాలలో వినవస్తున్న "ఓం" కారనాదం వింటుంటే కలిగే ఆనందం అనిర్వచనీయం కాదా!

*ఓం నమో నారాయణాయ, ఓం నమశ్శివాయ*


సేవాభావం వలననే మనసు నిర్మలమవుతుంది



# శ్రీవత్సచిహ్నమిశ్రవైభవమ్

– డా॥ పి.టి.జి.రంగరామానుజాచార్యులు

శ్రీకూరేశులు తమిళనాడు రాష్ట్రంలో దక్షిణదేవ భూమిగా కీర్తిగాంచిన కాంచీపురానికి పశ్చిమంగా ఉన్న శ్రీకూరమనే అగ్రహారంలో కీ.శ.1009 సం॥లో (కలియుగాది 4109 సం॥) సౌమ్యనామవత్సరంలో ఉత్తరాయణంలో పుష్య (తై-మకర)మాసంలో హస్తనక్షత్రంలో పంచమీ గురువారంనాడు హారీతగోత్రీకులైన శ్రీఅనంత భట్టాచార్యులు, పెరుందేవితాయార్ దంపతులకు శ్రీమన్నారాయణుని (శ్రీరామాంశ) అంశతో జన్మించినారు.

వీరి తండ్రిగారికి కూడా కూరత్తాళ్వాన్ అను పేరు కలదు. వీరికి వీరి తండ్రిగారు శ్రీవత్సాంకులని పేరుపెట్టిరి. వీరు ఆపస్తంబసూత్రీకులు, యజుశ్శాఖీయులు. శ్రీకూరేశులకు కూరత్తాళ్వాన్, కూరేశం, కూరనాథులు, శ్రీకూరభట్టర్, కూరాధిపర్, శ్రీవత్సచిహ్నర్, శ్రీవత్సాంకర్ అని పేర్లుకలవు.

అంతేగాక వీరు మహావైయాకరణులని కూడా ప్రసిద్ధి. ఈ విషయం వారియొక్క రచనల్లో తేటతెల్లమగును. కనుకనే వీరికి **'నడమాడుమ్ పతంజలిరవర్'** అని కూడా ప్రసిద్ధి కలదు. వీరు తండ్రిగారివద్దే ఉపనీతులై, సమాశ్రితులై సకలవేదశాస్త్రములను, ప్రబంధాలను సమగ్రాధ్యయనం చేసిరి.

అంతేగాక భగవద్రామానుజాచార్యులయొక్క దివ్య సన్నిధిలో శ్రీభాష్యరచనలోనూ వారితోపాటు కాశ్మీరంలోని శారదాపీఠంలో గల భగవద్బోధాయన వృత్తినంతటినీ ఏక రాత్రిలో కంఠాపాఠం చేసిన మహైకసంథాగ్రాహులు. వీరియొక్క సహాయంచేతనే భగవద్రామానుజులు శ్రీభాష్య రచన అనితరసాధ్యంగా నిర్వహించి విశిష్టాద్వైత సిద్ధాంతాన్ని దశదిశల సుస్థిరంచేయగల్గినారు.

'బాల్యాత్ప్రభృతిసుస్నిగ్ధః' అని వాల్మీకి మహర్షిచే చెప్పబడినట్లు వీరు సమస్తశాస్త్రాదులనభ్యసించి అఖండ పండితులైనా, విద్యామద- అభిజనమద- ధన మదములనే మూడు పాడుగుంటల్లో పడని, ఆర్జణ సంపన్నులుగా కీర్తిగాంచిరి. అంతేగాక వీరికి వీరి పూర్వీకులనుంచీ అపార సంపద వారసత్వంగా లభించినా ఆ మొత్తాన్ని తృణీకరించి సమస్తమును దానంచేసిన మహావైరాగ్యసంపన్నులు. కనుకనే పూర్వాచార్యులొకరు –

**తృణీకృతవిరించాదినిరంకుశవిభూతయః**
**రామానుజపదాంభోజసమాశ్రయణశాలినః**

అని కీర్తించిన శ్లోకం శ్రీకూరత్తాళ్వాన్లుకు సరిగ్గా సరిపోవును. శ్రీకూరేశులవారి యొక్క వైభవప్రకాశకములగు అనేక ఘట్టములు వారిజీవితంలో కలవు.

శ్రీకూరత్తాళ్వాన్లు కాంచీపురంలో తమద్రవ్యంతో ప్రతిరోజు రాత్రి పన్నెండుగంటలవరకూ అన్నదానం చేసి మఠద్వారాలు మూసేవారు. ఆ ద్వారశబ్దం విన్న అమ్మవారు

పెరుందేవితాయార్ పెరుమాళ్ళును అదేమని అడుగగా స్వామి విషయం తెల్పెను. ఆ అన్నదాతను చూడాలని అమ్మవారు వరదరాజస్వామిని కోరగా స్వామి తిరుక్కచ్చి నంబిని పిలిచి కూరత్తాళ్వాన్‌లను సన్నిధికి తీసుకురమ్మనెను. తాను అధముడనని భావించి స్వామివద్దకు రాలేనని దూరం నుంచియే సేవించుకొనెదనని నంబికి చెప్పి పంపెను.

శ్రీనంబి ఈ విషయాన్ని అమ్మవారికి తెల్పగా సంతోషించి ఆతనిని కటాక్షించినది. పరమవైరాగ్య సంపన్నులైన శ్రీకూరత్తాళ్వాన్లు ఆస్తిపాస్తులను భోగభాగ్యములను విడిచి భార్యయగు శ్రీఆండాళ్‌తో కలిసి శ్రీరంగనాథునిసేవకై శ్రీరంగమునకు ప్రయాణమయ్యిరి.

పతివ్రతాశిరోమణియగు ఆండాళ్ దేవి భర్తకు దారిలో దాహార్తికై ఒక రత్న ఖచితమైన బంగారు పాత్రను మాత్రం తీసుకొచ్చెను. దారిలో ఆమె భయం భయంగా అటునిటు చూచుచు నడచుటను గమనించిన కూరత్తాళ్వాన్లు 'నావద్ద ఏమీ లేదు, నాకు భయంలేదు మరి నీవు భయపడుచుంటివన్న ఏమైనా వెంట తీసుకొస్తున్నావా?' అని అడుగగా, 'మీకు దారిలో దాహంవేసిన త్రాగుటకుగాను ఒక బంగారు పాత్రను మాత్రం తెస్తున్నానని' తెల్పగా, అప్పుడు శ్రీకూరేశులు 'అయ్యో ఎంతపని చేసితివి' అని, ఆ పాత్రను తీసుకొని దూరంగా పొదలలోకి విసిరివేసి, 'ఇక నిర్భయంగా ప్రయాణం చేద్దాం పద' అన్నారట. అది అల్పమైన సంపదల విషయంలో వారి యొక్క త్యాగనిరతి. శ్రీరంగం చేరిన తర్వాత తినుటకు ఆహారమైన లేకపోవుటచే అట్లే నిదురించిరి. ఆ రోజు శ్రీరంగనాథుని సన్నిధిలో 'అక్కారవడిసె' అనగా కమ్మనైన చక్కెర పొంగలిని స్వామికి ఆరగింపు చేయుచున్నారు అర్చకులు.

ఇది తెలిసిన కూరత్తాళ్వాన్‌ల భార్య 'స్వామీ నీ భక్తుడు ఆకలితో బాధపడుచుండగా నీవు అక్కారవడిసెను హాయిగా ఆరగిస్తున్నావా?' అని ప్రార్థించగా, భగవానుడగు శ్రీరంగ నాథుడు ఉత్తమనంబి అను అర్చకునికి స్వప్నములో సాక్షాత్కరించి, అక్కారవడిసె ప్రసాదాన్ని ముందుగా కూరత్తాళ్వాన్‌లకు ఇవ్వమని ఆజ్ఞాపించగా, వారు అట్లే చేసిరి. ఇదంతయూ ఆ భగవానునిలీల గావున దీనిని స్వీకరింతు నని భక్తిగా భుజించిరట. ఆనాడు దశరథమహారాజు యాగంచేత లభించిన పాయసాన్ని తన ముగ్గురుభార్యలకు ఇవ్వగా, వారు సాక్షాత్తుగా భగవానునికీ, వాని ఆయుధము లకు జన్మనిచ్చినట్లు, వీరు కూడా ఈనాడు ఆ అక్కారవడిసె పాయసస్వీకారంచేత వారిభార్యకు ఇవ్వగా, ఆమె గర్భం దాల్చినది. క్రీ.శ.4163 సం॥లో వీరిరువురుకీ ఇద్దరు కుమారులు జన్మించిరి. శ్రీకూరత్తాళ్వాన్లు తమయాచార్యులగు శ్రీరామానుజులయొక్క ఆజ్ఞానుసారం వారి ఆచార్యులగు శ్రీయామునాచార్యులవారి కోరికగా వ్యాసభట్టర్, పరాశర భట్టర్ అనే పేర్లను వీరిరువురికి పెట్టిరి. అదియే శ్రీకూరేశుల యొక్క ఆచార్య నిష్ఠ.

శ్రీకూరత్తాళ్వాన్ల యొక్క వైభవాన్ని వివరించే అద్భుత సంఘటన వారి జీవితంలో ఒకటి కలదు. అదేమన– శ్రీకూరత్తాళ్వాన్లు భగవద్రామానుజులవారికి శిష్యులుగనుండి శ్రీవైష్ణవసిద్ధాంతాన్ని లోకంలో ప్రచారం చేయుకాలంలో రాజేంద్రచోళపురమనే నగరానికి కుళోత్తుంగచోళుడను రాజు ఉండేవాడు. అతడు శైవమతాభిమాని యగుటచేత తనకు తగిన ఒక దుష్టశైవపండితుని సహాయకునిగా చేసుకొని శైవా ద్యాగమములే ప్రధానములని, శివునికంటే పరదైవం లేదని, అందరూ శివుడినే ఆరాధించాలని రాజశాసనం గావించి దాన్ని అమలు జరుపుచుండేవాడు.

అందుకోసం ఒక పెద్దసభనేర్పరచి 'శివాత్పరతరం నాస్తి'– శివునికంటే వేరే పరదైవంలేదు అని శిలాశాసనం చేయించి ఒక పెద్ద ఫలకమును ఏర్పరచి దానిక్రింద అందరుపండితులచే అంగీకారరూపంగా సంతకములు చేయించుచుండెను. తద్వారా సంతకం చేసినవారికి ధన ధాన్యాదులను, అగ్రహారాది ఆస్తులనిచ్చుటచేత వాటికి ఆశ పడినవారు సంతకాలు చేసారు.


ఆ సమయంలో దురాశాపరుడైన ఒక అహంకారి రాజువద్ద చేరి, అతడిచ్చు సంపదయందు ఆశతో "రాజా! నువ్వు అల్పులైనపండితు లెందరిచేత సంతకం చేయించినా ఏమీ లాభం లేదు. శ్రీరంగంలో శ్రీరామానుజులను మహాశ్రీవైష్ణవాచార్యుడు కలరు. అతనిచేత నీవు

సంతకం తీసుకొన్నచో లక్షలాది వైష్ణవులందరూ శైవులుగా మారగలరు" అని దుర్బోధ చేసెను.

అంతకు మునుపే భగవద్రామానుజులు కుళోత్తుం గునియొక్క దుష్టపరిపాలనకు, అతని యొక్క మత విద్వేషమును సహింపక ఈతడు రాజుగా ఉన్నంతరవకూ శ్రీరంగంలో ఉండరాదని నిశ్చయించుకొని కొంతమంది శ్రీవైష్ణవులతో కలిసి దక్షిణ కర్ణాటకలోగల మేల్కోట ప్రాంతమునకు వలస పోయిరి. రాజభటులు రామానుజుల మఠమునకు వచ్చి, 'మీ మఠాధిపతియగు రామానుజు లెక్కడ?' అని అడుగగా అచ్చటగల శ్రీకూరత్తాళ్వన్లు, అయ్యో ఆచార్యులకు ఏమి ఆపదవాటిల్లునోయని శంకించి, వారిని కాపాడుకొనుటకై ఏమైననూ చేయవలెనని భావించి, 'నేనే రామానుజులను. విషయమేమిటో చెప్పండన'గా, ఆ రాజభటులు వారిని, వారిప్రక్కనే ఉన్న మహాపూర్ణులను పెరయనంబిగారినీ రాజసభకు తీసుకు వెళ్ళిరి.

ఆ సభలో రాజు వారిద్దరినీ చూచి, అద్భుతముఖ వర్చస్సుతో వెలుగుచున్న కూరత్తాళ్వాన్లను చూచి, వీరే రామా నుజులని భ్రమించి, రాజపత్రం చదివి దానిపై సంతకం చేయమని రాజు అడిగెను. అందులో గల 'శివాత్పరతరం నాస్తి' అను వాక్యానికి సమాధానంగా శ్రీకూరత్తాళ్వాన్లు 'ద్రోణమస్తి తతః పరమ్' అని వ్రాసి ఇచ్చిరి. అంటే ఇక్కడ శివ శబ్దమునకు పార్వతి భర్తయగు శివుడనే అర్థమే కాకుండా ఒకచిన్న కొలతపాత్ర అనే అర్థం కూడా సంస్కృత భాషలో ఉన్నది. కాబట్టి వ్యాకరణశాస్త్ర పండితులైన శ్రీకూరత్తాళ్వాన్లు ద్రోణమనే పదాన్ని గ్రహించి దాన్ని వ్రాసిరి. ద్రోణ మనగా దానికన్న పెద్దదైన కొలతగల పాత్రని అర్థం. అంటే పరమాత్మ శ్రీమన్నారాయణుడని అర్థముగా వివరించిరి. దాంతో అహంకార గర్వితుడై కోపించిన ఆ రాజు 'కూరత్తాళ్వాన్ల కళ్ళను పీకివేయండని' భటులను ఆజ్ఞాపించగా, కూరత్తాళ్వాన్‌లు 'దుష్టుడవైన నిన్ను చూచిన ఈ కళ్ళు నాకవసరం లేదని' వారే స్వయంగా తమకళ్ళను ఒక్కక్షణం లోనే పీకి విసరివేసిరి. అంధత్వమునకు గురై బాధపడినా, లెక్కచేయని ఆచార్యనిష్ఠులు వారు. తరువాత కొంతమంది శ్రీవైష్ణవులసహాయంతో మఠానికి తిరిగివచ్చి చూడగా ఆచార్యులైన భగవద్రామానుజులు కన్పించకపోవుటచే వారు కూడా తమ ఆచార్యులు లేనిచోట ఉండరాదని భావించి, తిరుమాలిరుంజోలై అనే దివ్యదేశానికి ప్రయాణమైనారు. అచ్చటనే అంధత్వముతోనే బాధపడుచున్ననూ, లెక్క చేయక పంచస్తవములను స్తోత్రం చేశారు. వారి యొక్క శేషజీవితమంతా ఆ తిరుమాలిరుంజోలై దివ్యదేశంలోని అళకర్ కోయిల్‌లోనే గడుపుచూ, తమ ఆచార్యులగు భగ వద్రామానుజులను తలుచుకుంటూ దాదాపు 108 సంవత్స రములు జీవించి చివరకు క్రీ.శ.1117 సం॥లో భగవద్రా మానుజుల శ్రీచరణాలను ధ్యానిస్తూ పరమపదమునకు వేంచేసిరి.

శ్రియఃకాంతాయ కల్యాణ నిధయే నిధయేర్థినామ్।
శ్రీవేంకటనివాసాయ శ్రీనివాసాయ మంగళమ్॥



# భాస్కరమ్ భువనేశ్వరమ్

- శ్రీ వేదార్థం మధుసూదనశర్మ

ఓం సూర్యదేవ నమస్తుభ్యం। ప్రసీద మమ భాస్కర॥
కరుణాకర దేవేశ। ప్రభాకర నమోస్తుతే॥
ఓం సప్తాశ్వరథమారూఢం। ప్రచండం కశ్యపాత్మజం॥
శ్వేతపద్మధరం దేవం। తం సూర్యం ప్రణమామ్యహం॥

అనే శ్లోకాలతో నిత్యం మనం సూర్యుణ్ణి ప్రార్థించి, మన నిత్యకర్మలను ప్రారంభిస్తాం.

లోకంలోని అజ్ఞాన తిమిరాన్ని పారద్రోలి, అనంతజ్ఞాన దీప్తులను వెదజల్లుతూ, సృష్టిని జాగృతపరచే ప్రత్యక్షదైవం శ్రీసూర్యభగవానుడు. వీరినే మనం సూర్యనారాయణుడు అని కూడా పిలుస్తున్నాం. "శ్రీసూర్యనారాయణా! వేదపారాయణా! లోకరక్షామణీ! దివ్యచూడామణీ!" అంటూ వారిని కీర్తిస్తున్నాం.

నమస్కార ప్రియుడైన భాస్కరుడు ఐశ్వర్యప్రదాత. అంత మాత్రమే కాదు. ఆపదలను నివారించేవాడు. సమస్త జీవులకు ఆత్మ అతడే. అందుకే ఆయన ఆరోగ్యప్రదాతగా కూడా కీర్తించబడ్డాడు. చర్మ, నేత్ర, హృద్రోగాల నివారణకు సూర్యారాధన శ్రేష్ఠం. అలాగే, సంతానభాగ్యాన్ని ప్రసాదించేది కూడా ఆయనే!

మాఘశుద్ధ సప్తమి రోజున సూర్యజయంతి. ఆ రోజును 'రథసప్తమి' పర్వదినంగా జరుపుకోవడం సంప్రదాయంగా వస్తూ ఉంది. సకల జగత్తుకు వెలుగును ఇచ్చే సూర్యుడు తన దిశను ఉత్తరానికి మార్చుకునే తిథియే రథసప్తమి.

## సప్తమి విశేషం

దేవతలకు ఒక్కొక్కరికి ఒక్కొక్క తిథి ప్రాధాన్యత ఉన్నది. వినాయకుడికి చవితి, శివుడికి చతుర్దశి, సుబ్రహ్మణ్యస్వామికి షష్ఠి, శ్రీరామునికి నవమి, శ్రీకృష్ణునికి అష్టమి అలాగే సూర్యుడికి సప్తమి తిథులు ప్రీతికరమైనవి. సంవత్సరంలో వచ్చే ప్రతి సప్తమీ సూర్యదేవుని ఆరాధనకు ముఖ్యం. నెలకు రెండుసార్లు సప్తమితిథి వస్తుంది. ఇలా సంవత్సరంలో మొత్తం 24 సార్లు సప్తమి తిథి వస్తుంది. వీటికి వివిధరకాల పేర్లు ఉన్నాయి. హేమాద్రి కల్యాణసప్తమి, కమలసప్తమి, శర్కరసప్తమి, అచలా సప్తమి, రథాంకసప్తమి, మహాసప్తమి, జయాసప్తమి, విజయా సప్తమి, జయంతీసప్తమి, అపరాజితాసప్తమి, మహాజయసప్తమి, నందా సప్తమి, సిద్ధార్థ సప్తమి, సాక్షభార్యసప్తమి, సర్వసప్తమి, మార్తాండసప్తమి, సూర్యసప్తమి, సప్తసప్తమి, అర్కసంపుట సప్తమి, నింబసప్తమి, మరీచసప్తమి, ఫలసప్తమి, భద్రాసప్తమి, ఆనందసప్తమి.

ఇతర మాసాల్లో వచ్చే సప్తమి తిథుల కంటే మాఘ మాసంలో వచ్చే సప్తమి తిథి బాగా విశిష్టమైంది. ఇదే రథ సప్తమి. సూర్యుని ప్రాధాన్యతను గుర్తించి ఈ రోజున వారిని వివిధరకాలుగా ఆరాధిస్తే విశేషఫలితాలు కలుగుతాయని శాస్త్ర వచనం.

## రథసప్తమి విశిష్టత

మాఘశుద్ధ సప్తమినాడు జరుపుకునే రథసప్తమి పర్వదినం ఆదివారంతో కూడి వస్తే అపమృత్యుభయాన్ని పోగొడుతుంది. ఇంకా షష్ఠితిథితో కూడిన సప్తమి అయితే మహాయోగం కలిగిస్తుంది. రోహిణీనక్షత్ర యుక్తమైన రథసప్తమి అధిక మహత్తును ప్రసాదిస్తుంది.

సూర్యగ్రహణ తుల్యాసా శుక్లా మాఘస్య సప్తమీ
అరుణోదయ వేళాయాం స్నానం తత్ర మహాఫలం।



మాఘేమాసి సితే పక్షే సప్తమీ కోటి పుణ్యదా
కుర్యాత్ స్నానార్ఘ్య దానాభ్య మాయురారోగ్య సంపదా॥

రథసప్తమి అనేది సూర్యగ్రహణంతో సమానమైన పర్వ దినం. ఈ రోజున అరుణోదయవేళ స్నానం చేయడం మహాపుణ్య ప్రదం. అలాగే స్నానాంతరం అర్ఘ్యం, తర్పణం, జప, దానాలు చేయడం వల్ల ఆయురారోగ్యం, సంపదలు, పుణ్యం లభిస్తుందని 'వ్రతచూడామణి' మొదలైన శాస్త్రాలు చెబుతున్నాయి.

## రథసప్తమిరోజున స్నాన ఫలితం

రథసప్తమి రోజు ఉదయాన్నే ఒక ప్రమిదలో దీపాన్ని వెలిగించి చెరువుకు గాని, నదికి గాని వెళ్ళి, సూర్యధ్యానం చేసి, ఆ దీపాన్ని నీటిలో వదలిపెట్టాలి.



నమస్తే రుద్రరూపాయ రసానాం పతయేనమః।
వరుణాయ నమస్తేఽస్తు హరివాస నమోఽస్తుతే॥
జననీ త్వం హి లోకానాం సప్తమీ సప్తసప్తికే।
సప్తవ్యాహృతికే దేవి! నమస్తే సూర్యమాతృకే॥

అనే మంత్రాలను చదువుతూ ఏడు జిల్లేడు ఆకులు లేదా చిక్కుడు ఆకులు తల, భుజాలపై ఉంచుకుని స్నానం చేయాలి.



'సప్తాశ్వములు గల ఓ సప్తమీ! నీవు సకలభూతాలకు, లోకాలకు జననివి. సూర్యునికి తల్లి వైన నీకు నమస్కారం' అని పై శ్లోక అర్థం.

జిల్లేడు ఆకులను అర్కపత్రాలని పిలుస్తారు. అర్కుడు అంటే సూర్యుడు. ఏడు జిల్లేడు ఆకులు సప్తాశ్వాలకు చిహ్నాలు. ఏడేడు జన్మలలో చేసిన ఏడు పాపాలను కడిగేందుకు ఈ స్నానం. ఈ ఏడు పాపాలు ఏవి అంటే 1)ఈ జన్మలో చేసింది 2)జన్మాంతరంలో చేసింది 3)మనసు ద్వారా చేసింది 4)మాట ద్వారా చేసింది 5)శరీరం ద్వారా చేసింది 6)తెలిసి చేసింది 7)తెలియక చేసినవి. ఇలా మొత్తం ఏడు పాపాలు. వీటిని పోగొట్టుకొనుటకు రథసప్తమి రోజున జిల్లేడు ఆకులతో స్నానం చేయాలి. ఇవి దొరకనిచో, చిక్కుడు ఆకులను నెత్తిపై, భుజాలపై పెట్టుకుని స్నానం చేయాలి.

సూర్యుడి ఏడు గుర్రాలు ఏడు వారాలకు, ఏడు వర్ణాలకు, ఏడు ధాన్యాలకు ప్రతీకలు. సప్తమీ తిథికి అందుకే అంతటి ప్రాధాన్యత. చిక్కుడు కాయలో కూడ ఏడు గింజలు ఉంటాయి. ఈ కాలంలో చిక్కుడు, విశేషంగా లభిస్తాయి కూడా.

## అర్ఘ్య ప్రధానం

రథసప్తమి రోజున సూర్యభగవానునికి అర్ఘ్యం ఇవ్వాలి. ఒకరాగి పాత్రను తీసుకుని అందులో రక్తచందనం, అక్షతలు, ఎర్రని పూలు, మందార, గన్నేరు వంటి పూలను అందులో వేసి, సూర్యనామాలను చెప్తూ, సూర్యునికి ఎదురుగా నిలబడి అర్ఘ్యం ఇవ్వాలి.


## తర్పణం

రథసప్తమి రోజున మరణించిన వారికి తర్పణాలు విడవడం వల్ల పుణ్యలోకాలు సంప్రాప్తిస్తాయని శాస్త్రవచనం.

రథసప్తమి రోజున సూర్యుని ప్రార్థించడం, సూర్యారాధన మిక్కిలి శ్రేయస్కరం. ఆదిత్యహృదయం, సూర్యస్తోత్రాలను పఠించాలి.

జపాకుసుమ సంకాశం। కాశ్యపేయం మహాద్యుతిం।
తమోరిం సర్వపాపఘ్నం। ప్రణతోఽస్మి దివాకరం॥

అనే మంత్రాన్ని ఏడువేలసార్లు జపించాలి. ఇలా చేస్తే వివిధదోషఫలితం తొలగుతుంది. అలాగే ఈ రోజున బ్రాహ్మణులకు తమ శక్తి కొలది దానధర్మాలు చేస్తే సర్వపాపాలు తొలగి,



విశేషమైన ఫలితాలు పొందుతారని పురాణాలు, శాస్త్రాలలో చెప్పబడింది. ఈ విధంగా రథసప్తమి రోజున చేసే స్నాన, అర్ఘ్య, తర్పణ, జపదానాదుల వల్ల సర్వపాపాల నివారణ జరిగి, ఆయురారోగ్యవృద్ధి కలుగుతుంది.

## రథసప్తమి వ్రతకథ

రథసప్తమి పర్వదినం రోజున చేసే సూర్యారాధన వల్ల తేజస్సు, ఆరోగ్యం పొందడం అనేది జరుగుతుంది. ఈ రోజున చేసే వ్రతకథ భవిష్యపురాణంలో శ్రీకృష్ణుడు ధర్మరాజుకు ఉపదేశించాడు.

పూర్వం కాంభోజదేశాన్ని పాలించే యశోధర్ముడనే రాజుకు చాలా కాలం వరకు సంతానం కలగలేదు. వారు చేసిన అనేక పూజలు, వ్రతాలు, నోములు, హోమాలు, దాన ధర్మాల ఫలితంగా వృద్ధాప్యంలో వారికి మగసంతానం కలుగు తుంది. ఆ కుమారుడు ఎప్పుడూ ఏదో ఒక రోగంతో బాధ పడుతూనే ఉండేవాడు. రాజు బ్రాహ్మణోత్తములను, గురువులను సంప్రదించి తన కుమారునికి ఈ దురవస్థ తొలగించుటకు మార్గం చెప్పమన్నాడు.

అందుకు వారు అతని జాతకము పరిశీలించి, "ఓ రాజా! ఈ బిడ్డ గత జన్మలో పరమలోభి, దానధర్మములు చేయకుండా జీవించాడు. కానీ, ఎవరో రథసప్తమి వ్రతం చేస్తుండగా చూసి నాడు కాబట్టి, ఆ పుణ్యవశాన మీ కుమారుడుగా జన్మించాడు. పూర్వజన్మకృతమైన లోభత్వం వల్ల ఈ జన్మలో ఈ విధంగా రోగ పీడితుడు అయ్యాడు. మళ్లీ, మీరు అతనిచే రథసప్తమి వ్రతం ఆచరింప చేస్తే, సర్వబాధలు తొలగి, చక్రవర్తిత్వం సంప్రాప్తి స్తుంది" అని తెలిపారు. ఆ వ్రత విధానాన్ని అనుగ్రహించమని రాజు వారిని కోరగా, వారు ఇలా సెలవిచ్చారు.

'మాఘశుద్ధ షష్ఠి రోజున స్నానాదులు పూర్తి చేసుకుని, దైవపూజ చేసి, సూర్యాలయానికి వెళ్లి సూర్యారాధన చేయాలి. బంధువులతో కలిసి నూనె లేని పదార్థాలతో భోజనం చేయాలి. రాత్రి ఉపవాసం చేసి, కటికనేలపై శయనించాలి. మరునాడు సప్తమీరోజు ఉదయాన్నే స్నానాదులు ముగించుకొని, రథ నిర్మాణం చేసి, అందులో సూర్యవిగ్రహస్థాపన చేయాలి. పసుపు, కుంకుమ, అక్షతలు, ఎర్రనిపుష్పాలతో అర్చించాలి. క్షీరాన్నం నివేదించాలి. రాత్రి జాగారం చేసి, సూర్యస్తోత్రపఠనం చేయాలి. అష్టమిరోజు ఉదయం స్నానానంతరం బ్రాహ్మణులకు దానం ఇవ్వాలి. రెండు ఎర్రని వస్త్రాలను, రెండు ఎర్రని గోవు లను దానం ఇవ్వాలి. ఇలా చేస్తే మీ కుమారుడు ఆరోగ్యవంతుడై తేజోమూర్తి అవుతాడు. అపూర్వమైన బలపరాక్రమవంతుడై, సమస్తభోగాలను అనుభవిస్తూ, చక్రవర్తిగా రాజ్యపాలన చేస్తాడు." అని చెప్పడంతో రాజు కుమారునిచే ఈ రథసప్తమి వ్రతం చేయించడంతో కుమారుడు ఆయురారోగ్యవంతుడై, చక్రవర్తిగా పేరు ప్రఖ్యాతులు గడించాడు.

ఈ విధంగా ప్రతి నిత్యమూ సూర్యభగవానుణ్ణి ప్రార్థిస్తూ, విశేషించి రథసప్తమి రోజున వివిధపూజాదికాలు నిర్వహించడం వల్ల సూర్యనారాయణుని అనుగ్రహం కలుగుతుంది.



# భాగవతంలో వివిధ స్తోత్రాలు

- శ్రీ కె.వి.సుందరాచార్యులు

భాగవత పురాణం దశవిధ లక్షణ లక్షితమైన మహాపురాణం. దీనిలో పన్నెండు స్కంధాలున్నాయి. మొదటిస్కంధం శ్రీమద్భాగవతాన్ని శ్రవణం చేయటానికి, శ్రీకృష్ణపరమాత్మ సాన్నిధ్యాన్ని పొందటానికి ఎటువంటి అధికారాన్ని కలిగి ఉండాలో తెలిపేది. పరీక్షిత్తుచరిత్ర అతని వైరాగ్యాన్ని, భగవత్కథా శ్రవణాసక్తిని తెలుపటం ద్వారా అధికారి స్వరూపాన్ని వివరించింది. రెండవ స్కంధంలో శ్రీశుకమహర్షి, భగవద్ధ్యానమే ముఖ్యోపాయమని తెలుపుతూ స్వామినెట్లా భావన చేయాలో ధ్యానించాలో విశదంగా తెలియజేశాడు. అందువల్ల ఇది సాధన స్కంధమైంది. మూడు నుండి పన్నెండు స్కంధాలవరకు మహాపురాణ దశవిధ లక్షణాలు క్రమంగా వివరించనైనవి.

విష్ణుసహస్రనామస్తోత్రంలో వ్యాసమహర్షి 'స్తవ్యః- స్తవప్రియః- స్తోత్రం- స్తుతః- స్తోతా' అని అయిదునామాలు పేర్కొన్నాడు. స్తుతింపదగినవాడు- స్తోత్రప్రియుడు- స్తోత్రరూపుడు- ఇంతకుముందే ఎందరి చేతనో స్తుతింపబడిన వాడు- తనను స్తుతించే వారిని తానే స్తుతించేవాడు అని ఆ నామాలకు అర్థం.

'కలౌ సంకీర్తనం హరేః', 'తతోఽపి హరికీర్తనం' అనే వాక్యాలు భగవంతుడు ప్రసన్నుడు కావడానికి, అనుగ్రహించటానికి కలియుగంలో యజ్ఞయాగాలు, ధ్యానం తపోయోగాలు అవసరం లేదని నామసంకీర్తనమే హరికి ప్రియమని తెలుపుతున్నాయి. అందువల్ల భగవన్నుతి రూపాలైన స్తోత్రాలు అనేకంగా వెలువడినాయి. వెలువడుతున్నాయి. ఆస్తికులైన ప్రతి భారతీయుడు నిత్యం ఇష్టదేవతా స్తుతి చేస్తూనే ఉన్నాడు.

ఇక భాగవతం పన్నెండు స్కంధాల్లోను 32 స్తుతులున్నాయి.

ప్రథమస్కంధంలో కుంతీకృత శ్రీకృష్ణస్తుతి, భీష్మాచార్యకృత శ్రీకృష్ణస్తవం అనేవి రెండు స్తోత్రాలున్నాయి. ఉత్తరాగర్భంలోని పిండాన్ని అశ్వత్థామ ప్రయోగించిన అపాండవాస్త్రం నశింపచేయపోగా, శ్రీకృష్ణుడు సుదర్శనాన్ని అడ్డు పెట్టి అశ్వత్థామ నుండి ఉత్తరాగర్భాన్ని రక్షించినాడు. అపుడు కుంతీదేవి శ్రీకృష్ణుణ్ణి కృతజ్ఞతాపూర్వకంగా స్తుతించటం ఇరవైఆరు శ్లోకాల్లో ఉంది. ఈ స్తుతిలో తమని కాపాడిన క్షణాలు జ్ఞాపకం చేస్తూ చెప్పిన శ్లోకాలిట్లా ఉన్నాయి.

యథా హృశీకేశ ఖలేన దేవకీ కంసేన రుద్ధాతిచిరం శుచార్పితా।
విమోచితాహం చ సహాత్మజా విభో త్వయైవనాథేన ముహుర్విపద్గణాత్॥

శ్రీకృష్ణుని స్తుతిస్తూ ఖలుడైన కంసుడు దేవకిని చాలకాలం బంధించగా విడిపించావు. అనేక ఆపదలనుండి నన్ను నా సంతానాన్ని రక్షించావు. విషాన్నం వల్ల భీముణ్ణి, లాక్షాగృహ దహనంలో మమ్ములను, అసత్సభలో ద్రౌపదిని, మహారథికుల అస్త్రాల వల్ల అర్జునుడు మొదలైన వారిని, ఇపుడు అశ్వత్థామాస్త్రం వల్ల మా వంశాన్ని రక్షించావు సుమా!

విపదః సంతునః శశ్వత్ తత్ర తత్ర జగద్గురోః।
భవతో దర్శనం యత్స్యాదపునర్భవ దర్శనమ్॥

భీష్ముడు అంపశయ్యపై ఉన్నపుడు ధర్మరాజాదులు వచ్చి వివిధ ధర్మాలు వివరించమని ప్రార్థించారు. భీష్ముడు వివిధ ధర్మాలను వివరించి ఉత్తరాయణకాలం సమీపించగా శ్రీకృష్ణుని స్తుతించి అంతిమశ్వాసను వదిలాడు. ఆ స్తుతి పదకొండు శ్లోకాల్లో శ్రీకృష్ణానుబంధాన్ని ఇట్లా పేర్కొన్నాడు.

త్రిభువన కమనం తమాల వర్ణం
రవికరగౌరవరాంబరం దధానే।
వపురలక కులావృతాననాబ్జం
విజయసఖే రతిరస్తు మేఽనవద్యా॥

ముల్లోకాలను ఆకర్షించే తమాలవర్ణం సూర్యకిరణాల వంటి గౌరవర్ణాంబరాన్ని ధరించినవాడు, ముంగురు లావరించిన ముఖంగల విజయుని సఖుడు కృష్ణుని యందు నా కోరిక అనవద్యమై నిలుచుగాక.

మునిగణ నృపవర్య సంకులేన్తః
సదసి యుధిష్ఠిర రాజసూయ ఏషామ్ ॥
అర్హణ ముపపేద ఈక్షణీయో
మమ దృశి గోచర ఏష ఆవిరాత్మా ॥

మునులు రాజులతో నిండిన ధర్మజ రాజసూయాధ్వరంలో అగ్రపూజనంది చూడనైన ఈ కృష్ణుడు ఆత్మకు శాంతి చేకూర్చుగాక. కురుక్షేత్ర యుద్ధరంగంలోని కృష్ణుని, రాజసూయయాగంలో గౌరవాన్ని పొందిన కృష్ణుని మనోవాక్ దృష్టి వృత్తులలో స్మరించి అంతిమ శ్వాస నొదిలినాడు తత్త్వవేత్త అయిన భీష్ముడు.

విష్ణువు నాభికమలంలో ఉద్భవించిన బ్రహ్మ విష్ణువును స్తుతించటం ఇరవై అయిదు శ్లోకాల్లో ఉంది. అందులో...




సోఽహం సమస్త జగతాం సుహృదేక ఆత్మా
సత్వేన యన్మృడయతే భగవాన్ భగేన।
తేనైవ మే దృశ మనుస్పృశతాద్యథాహం
స్రక్ష్యామి పూర్వవదిదం ప్రణత ప్రియోఽసౌ ॥

స్వాయంభువ మనువు యజ్ఞాచరణంతో ప్రజలకు ప్రజాపతికి సేవ చేయతలచినాడు. కాని భూమి రసాతలంలో మునిగి ఉంది. దాన్నుద్ధరించటం ఎలా అని బ్రహ్మ ధ్యానమగ్నుడు కాగా, అతని నాసికనుండి అంగుష్ఠ మాత్రుడైన వరాహమవతరించి క్షణంలో గజప్రమాణంలో వృద్ధి చెందినాడు. యజ్ఞపురుషుడైన భగవంతుడు బ్రహ్మ- ఋషులను సంతోషపెడ్తూ నీటిలో మునిగి భూమిని పైకి తెచ్చినాడు. ఆ వరాహమూర్తిని ఋషులు స్తుతించటం పన్నెండు శ్లోకాల్లో ఉంది.

జితం జితం తేఽజిత యజ్ఞభావన
త్రయీం తనుం స్వాం పరిధున్వతే నమః।
యద్రోమ గర్తేషు నిలిల్యురధ్వరా
స్తస్మై నమః కారణ సూకరాయ॥

ధ్రువోపాఖ్యానంలో నారదోపదేశంతో ధ్రువుడు తపస్సు చేయగా విష్ణువు ప్రత్యక్షమై వరం కోరమన్నాడు. బాలుడైన ధ్రువుడు విష్ణువుకు సాగిలపడి ఏమీ చెప్పలేకపోగా విష్ణువు అతని హృదయం తెలుసుకొని తన శంఖాన్ని ధ్రువుని కపోలానికి తాకించాడు. దాంతో ధ్రువుడు పరమాత్మ నిర్ణయం తెలిసి అతని నిట్లా స్తుతించాడు.

యోన్తః ప్రవిశ్య మమవాచమిమం ప్రసుప్తాం
సంజీవ యత్యఖిల శక్తిధరః స్వధామ్నా।
అన్యాంశ్చ హస్త చరణ శ్రవణ త్వగాదీన్
ప్రాణాన్నమో భగవతే పురుషాయ తుభ్యమ్॥

అంటూ పదకొండు గద్యల్లో భగవంతునికి తమ బాధలు వివరించి...

సప్తమస్కంధంలో హిరణ్యకశిపువధానంతరం బ్రహ్మాది దేవతలు నృసింహావతారాన్ని స్తుతించటం, తర్వాత ప్రహ్లాదుడు భగవంతుణ్ణి స్తుతించటం వర్ణితాలు.

అష్టమస్కంధంలో గజేంద్రుడు భగవంతుణ్ణి స్తుతించటం ఉంది. గజేంద్రుడు సర్వశక్తులు వ్యర్థంకాగా విష్ణువును ప్రార్థించిన విధం ఇట్లా ఉంది.

యస్మిన్నిదం యతశ్చేదం యేనేదం య ఇదం స్వయమ్ ।
యోఽస్మాత్ పరస్మాచ్చ పరస్తం ప్రపద్యే స్వయమ్భువమ్ ॥

'భాగవతము తెలిసిపలుకుట కష్టంబు శూలికైన తమ్మిచూలికైన' అన్న మహాభక్త కవి పోతన చెప్పినమాట యథార్థం. 'సర్వం విష్ణుమయం జగత్' కదా!

శ్రియః కాంతాయ కల్యాణ నిధయే నిధయేర్థినామ్।
శ్రీవేంకట నివాసాయ శ్రీనివాసాయ మఙ్గలమ్ ॥

# తిరుమలేశుని 'భక్తుల' వృత్తాంతాలు

- డా॥ సి. లలితారాణి

తిరుమలక్షేత్రానికి నాలుగువిధాల గొప్పతనం ఏర్పడింది. వరాహస్వామి 1)ఈ పర్వతాన్ని శ్రీవైకుంఠం నుంచి భూలోకానికి తెప్పించడం. 2)ఇందులో స్వామి పుష్కరిణి ఉండటం. 3)మహామహిమాన్వితాలైన తీర్థాలెన్నో ఇందులో ఉండటం. 4)అలాగే సాక్షాత్తు భగవంతుడు శ్రీవైకుంఠాన్ని వదలి స్వయంవ్యక్తమూర్తిగా ఈ పర్వతంలో అవతరించడం వలన.

స్వామి పుష్కరిణీ స్నాన మహిమ వరాహపురాణంలో ఇలా అభివర్ణింపబడింది-

స్వామి పుష్కరిణీ స్నానం సద్గురోః పాదసేవనమ్।
ఏకాదశి వ్రతం చాపి త్రయ మత్యన్త దుర్లభమ్॥

దుర్లభం మానుషం జన్మ దుర్లభం తత్ర జీవనమ్।
స్వామి పుష్కరిణీ స్నానం త్రయ మత్యన్త దుర్లభమ్॥

వేంకటాచలంతోనూ శ్రీవేంకటేశ్వరునితోను సంబంధం కల భక్తుల వృత్తాంతాలు వేంకటాచల మాహాత్మ్యంలో ఎన్నో అభివర్ణింపబడ్డాయి. అందులో ముఖ్యంగా స్వామిపుష్కరిణిలో ఇతర తీర్థాల్లో స్నానమాచరించడం వల్ల.

## శంఖణ మహారాజు

రాజ్యభ్రష్టుడైన శంఖణుని వృత్తాంతం వరాహ పురాణంలో ఇలా పేర్కొనబడింది.

పూర్వం చంద్రవంశంలో శంఖణుడనే మహారాజుండేవాడు. అతను కొంత కాలానికి శత్రువుల చేత పరాజితుడై భార్యలతో, మంత్రులతో దేశబహిష్కృతుడైనాడు. తరువాత అతడు దక్షిణానగల సేతువును దర్శించి, సువర్ణముఖరీ తీరానికి వచ్చి స్నానం చేసి తన దైన్యానికి దుఃఖిస్తుండగా అశరీరవాణి ఇలా పలికింది.

"ఈ ప్రాంతానికి ఉత్తరంలో వేంకటాద్రి అనే క్షేత్రం ఉంది. అక్కడ శ్రియఃపతి శ్రీనివాసుడై ఉన్నాడు. ఆయన సన్నిధిలో స్వామి పుష్కరిణి ఉంది. అందులో నీవు మూడు కాలాల్లోను స్నానం చేస్తే తిరిగి నీరాజ్యం నీకు లభిస్తుంది."

ఆ రాజు అశరీరవాణి నిర్దేశం ప్రకారం వేంకటాచలానికి చేరి నిత్యం స్వామి పుష్కరిణిలో స్నానం చేస్తూ ఆరునెలలు గడిపాడు. ఒక రోజు కోటి సూర్యప్రభాభాసురమైన ఒక దివ్య విమానం అతని ముందు నిలిచింది. ఆ విమానంలో పరాత్పరుడైన భగవంతుడు శ్రీ, భూ, నీళలతో కలసి ప్రత్యక్షమైనాడు. శంఖణుడు వారిని స్తుతించగా, స్వామి ఇలా అన్నాడు-



"ఓ రాజా! నీకు పూర్వపు స్వామిత్వం మరలా లభిస్తుంది. ఇది అంతా నీకు స్వామి పుష్కరిణిపై గల భక్తికి ఫలమే". తరువాత సామంతులు శంఖణుని రాజ్యాన్ని అతనికి అప్పగించారు. శంఖణుడు పోగొట్టుకున్న రాజ్యాన్ని పొంది సుఖంగా పరిపాలించాడు.

## దశరథ మహారాజు

వరాహపురాణం దశరథుని వృత్తాంతాన్ని కూడా ఇలా వివరిస్తున్నది. అయోధ్యను రాజధానిగా చేసికొని ధర్మబద్ధముగా పరిపాలన సాగిస్తున్న దశరథుడు చాలాకాలందాకా సంతానం లేక గురువైన వశిష్ఠుని కారణాన్ని వివరించమని కోరాడు.



పుత్రప్రాప్తికి విరోధియైన పాపమేదో ఉన్నట్లు తోస్తున్నది. దక్షిణ దేశంలో సువర్ణముఖరీ తీరంలో గల వేంకటాచలానికి వెళ్లి శ్రీనివాసునిసేవించి రమ్మని వశిష్ఠుడు అదేశించాడు.

దశరథుడు మార్గంలో ఉన్న సమస్తతీర్థాలలోను స్నానం చేసి వేంకటాద్రిని చేరి అక్కడ సుందరమైన స్వామిపుష్కరిణిని చూచి, అక్కడ కొంతకాలం తపస్సు చేస్తూ ఉన్నాడు. ఒకరోజు శ్రీనివాసుడు దివ్యవిమానంలో ఆవిర్భవించి దశరథునికి వర ప్రదానం చేశాడు. అందువల్లనే ఆయనకు పుత్రసంతానం కలిగిందని తెలుస్తున్నది.

## వృద్ధ బ్రాహ్మణ వృత్తాంతం

వేంకటాచలంలో ఒకప్పుడు శ్రీనివాసుడు, బాలుని రూపంలో సంచరిస్తున్నాడు. ఇంతలో ఒక వృద్ధుడు ఆ ప్రదేశానికి కౌండిన్యుడనే తన పుత్రుణ్ణి వెతుక్కొంటూ వచ్చి "కౌండిన్యా!" అని పిలిచాడు, శ్రీనివాసుడు 'ఇక్కడ కౌండిన్యుడు కాదు గదా మానవమాత్రులెవ్వరు' లేరని చెప్పాడు. అప్పుడు ఆ వృద్ధుడు "సుదూరంలో ఉన్న ఆశ్రమానికి నేనెట్లు వెళ్ళగలను? శ్రౌతక్రియలను ఆచరించడానికి అశక్తుడనైన నన్ను ఆ బ్రహ్మదేవుడు ఎందుకు బ్రతికించాడు?" అని దుఃఖపడ్డాడు.

అప్పుడు శ్రీనివాసుడా వృద్ధునితో ఇలా అన్నాడు–




"ఓ..! వృద్ధ బ్రాహ్మణుడా! నీకు కండ్లు కనబడటం లేదు. శరీరం శిథిలమైంది. అయినా ఇంకా ఎందుకు బ్రతకాలని అనుకొంటున్నావు? నిజంగా నీవు వైదికక్రియలను చెయ్యటానికి జీవించ వలెననుకొంటున్నావా?" అన్నాడు. దానికి ఆ వృద్ధుడు "నాకు జీవితం పై ఏ ఆశా లేదు, నేను యజ్ఞాలను ఆచరించకపోవటం చేత దేవతలకు ఋణపడి ఉన్నాను. అందువల్లనే ఈ శరీరం విడవడానికి ఇష్టపడటం లేదు" దన్నాడు.

శ్రీనివాసుడు అతనిని చేయి పట్టుకొని కొంతదూరం నడిపించి ఒక తీర్థంలో స్నానం చేయించాడు. అందులో స్నానం చేసి లేచేసరికి ఆ వృద్ధుడు పదహారు సంవత్సరాలవాడైనాడు. వృద్ధుడు ఇక్కడ స్నానం చేసి కుమారుడై నాడు కాబట్టి దీనికి **'కుమారధార'** అనే ప్రసిద్ధి కలిగింది.

## కుమారస్వామి

పద్మపురాణం కుమారస్వామి వృత్తాంతాన్నిలా వివరిస్తున్నది. శంకరుడు కుమారస్వామిని సేనాధిపతిగా నియమించాడు. దాన్ని నిర్వహించలేక ఆయన సేనాధిపత్యాన్ని చక్కగా నిర్వహించాలని కుమారధారాతీర్థంలో మూడు కాలాల్లోను స్నానం చేస్తూ విష్ణువును అర్చిస్తూ తపస్సు చేశాడు.



అతని తపస్సుకు మెచ్చి విష్ణువు ప్రత్యక్షమై 'శక్తి' అనే ఆయుధాన్ని ఇచ్చాడు. కుమారస్వామి తపస్సు చేసిన ప్రాంతంలో ప్రవహించటం చేత దీనికి 'కుమారధార' అని ప్రసిద్ధి ఏర్పడిందని ఈ పురాణం వివరిస్తున్నది.

## పాండవ వృత్తాంతము

ఒకప్పుడు శ్రీకృష్ణుని ఆజ్ఞానుసారం పాండవులు వేంకటాచలానికి వచ్చి అక్కడ ఒక పుణ్యతీర్థంలో స్నానం చేస్తూ



ఒక సంవత్సర కాలం తపస్సు చేసారు. ఒకనాడు ధర్మరాజుకు ఒక 'స్వప్నం వచ్చింది. అందులో "మీ పాపాలు నశించిపోయి నాయి. మీకు యుద్ధంలో విజయం కలిగి "మీరాజ్యం మీకు తిరిగి లభిస్తుంది" అని అశరీరవాణి పలికింది.


పాండవులు అక్కడ స్నానం చేసి తపస్సు చేయడం చేత అది **'పాండవ తీర్థమని'** ప్రసిద్ధి చెందింది.

## దురాచార వృత్తాంతం

కావేరీతీరంలో దురాచారుడనే బ్రాహ్మణుడుండేవాడు. అతను మహాపాతకులతో కలసి ఉండటంచేత బ్రాహ్మణత్వం నశించిపోయింది. సకలదోష భూతుడవటంచేత ఆ దురా చారుణ్ణి ఒక భేతాళుడు పట్టుకొన్నాడు. భేతాళ బాధితుడై అతను అన్ని దేశాలు తిరుగుతూ దైవయోగంవల్ల వేంకటాద్రిచేరి అక్కడ ఉన్న **'జాబాలితీర్థం'**లో స్నానం చేసేటప్పటికి భేతాళుడతణ్ణి వదలిపెట్టాడు. భేతాళుడికి కూడా భేతాళత్వం నశించిపోయింది. ఈ తీర్థస్నానమహిమ చేత అతనికి విష్ణులోకం లభించింది.

## దృఢమతి వృత్తాంతం

హిమాలయాలకు ప్రక్కన బ్రహ్మాశ్రమం ఉంది. ఒకప్పుడు దృఢమతి అనే వాడు ఆ ఆశ్రమానికి వచ్చాడు. అక్కడ కులపతికి యజ్ఞం చేయడానికి అనుమతి నివ్వమని అడిగాడు. ఆ కులపతి నీవు యాగం చేయవద్దు, కొంతకాలం శుశ్రూష చేయమన్నాడు. తరువాత దృఢమతి నిరాశపడి అక్కడ నుంచి కొంతదూరం వెళ్లాడు. అక్కడ సుమతి అనే విప్రుని ఆశ్రమం కనపడింది. సుమతితో దృఢమతికి స్నేహమేర్పడింది. సుమతి దృఢమతికి హవ్య కవ్య శ్రాద్ధ ప్రక్రియ కూడా నేర్పాడు. దృఢమతి చేత పోషింపబడు సుమతిని, మరణానంతరం యమభటులు నరకానికి తీసుకు వెళ్లారు. అక్కడ అతడు సంవత్సరములు నరకయాతనలను అనుభవించి తిరిగి గాడిదగా, పందిగా, కుక్కగా అనేక నీచ జన్మలెత్తాడు. తరువాత ఉత్తమజన్మల నందాడు.



ఒకనాడు అడవిలో వెడుతుండగా అతన్ని బ్రహ్మరాక్షసి పట్టుకొన్నది. అతని తండ్రి అగస్త్యుణ్ణి ప్రార్థించగా, అగస్త్యుడు అతని పూర్వవృత్తాంతాన్ని వివరించి, వేంకటాచలంలో ఉన్న స్వామిపుష్కరిణిలో స్నానం చేయించమన్నాడు. అతడలాగే చేయగా బ్రహ్మరాక్షసి విడచి పెట్టింది. అలాగే దృఢమతికూడ పాపనాశన తీర్థాన్ని పైన చల్లుకొన్న వెంటనే దివ్యదేహాన్ని పొంది విమానంలో స్వర్గానికి వెళ్లాడు.


## పుణ్యశీల వృత్తాంతం

పూర్వం పుణ్యశీలుడనే బ్రాహ్మణుడు గోదావరీ తీరంలో ఉండేవాడు. అతడు ఒకప్పుడు శ్రోత్రియుడైన బిడ్డలులేని బ్రాహ్మణుణ్ణి నియోగించి పితృశ్రాద్ధం ఆచరించాడు. తరువాత అతనికి గాడిద ముఖం ఏర్పడింది. దానికి కారణాన్ని అగస్త్యుణ్ణి అడగ్గా, శ్రాద్ధకర్మలో బిడ్డలు లేనివాణ్ణి నియోగించినందువల్ల ఇలా జరిగిం దని, నీవు వేంకటాచలంలో ఉన్న **'ఆకాశగంగా'** తీర్థంలో స్నానం చేస్తే ఈ రూపం తొలగిపోతుందన్నాడు. అతడలాగే చేసి గాడిద ముఖాన్ని పోగొట్టుకున్నాడు.

## ఆకాశరాజు వృత్తాంతం

ఈ కలియుగంలో పాండ్యకన్యయైన మనోరమకు, మిత్రవర్మకు కలిగిన సత్సంతానమే ఆకాశరాజు. అతని భార్య

ధరణీదేవి. ఆకాశరాజు యజ్ఞంకోసం యాగశాలను దున్నుతుండగా అతనికి పద్మావతిదేవి లభించిందని, తరువాత వసుధనుడనే పుత్రుడు కూడా కలిగాడని వేంకటాచల మాహాత్మ్యం పేర్కొన్నది.



ఆకాశరాజు పద్మావతీదేవి ఇష్టాన్ననుసరించి వేంకటపతి శ్రీనివాసునకు ఆమెనిచ్చి వివాహం చేశాడు. అంత్య ఘడియల్లో శ్రీనివాసుడు ఆకాశరాజుకు సాయుజ్యాన్నిచ్చాడు.

## వసువృత్తాంతం

వసువు అనేవాడు నిషాదుడు. అతడు విష్ణుభక్తి పరాయణుడై నైవేద్యాలను తేనెతో కలిపి శ్రీమహావిష్ణువుకు అర్పిస్తుండేవాడు. అతనికి చిత్రవతి అనే భార్య, వీరుడనే కుమారుడు ఉన్నారు. వసువు చిత్రవతులు తేనెను తీసుకు రావడానికి అడవికి వెడుతూ కుమారుని ఇంటి దగ్గర ఉంచారు. వీరుడు నైవేద్యాలను వండి భక్తితో స్వామికి పెట్టగా, శ్రీనివాసుడు అతని భక్తికి సంతసించి వాటిని భక్షించాడు. వసువు- చిత్రవతులు దీనిని విని, కుమారుడైన వీరుడు అసత్యమాడుతున్నాడని అతనిని కత్తితో చంపబోగా శ్రీనివాసుడు ఇలా అన్నాడు. 'నీకంటె నీకుమారుడు భక్తుడు. అందుకే అతనికి ప్రత్యక్షమైనానని, నీకు పుష్కరిణీతీరంలోనే కనపడతాను అతనికి అంతట' కనపడతాను అని పేర్కొన్నాడు.

## రంగదాస వృత్తాంతం

తొండమానుని పూర్వజన్మ రంగదాసు. ఇతడు బాల్యంలోనే వేంకటాద్రిని చేరి శ్రీనివాసమూర్తి చుట్టూ రాతిగోడలను కట్టి, దేవాలయానికి ప్రక్కన బావినొక దానిని త్రవ్వి, తోటలను పెంచి పుష్పాలతో స్వామిని అర్చించేవాడు. ఒకనాడు రంగదాసు స్నానసమయంలో సరస్సులో జలక్రీడ లాడుతున్న గంధర్వుని అతని భార్యలను చూసి మైమరచి పూలను కోయడంలో ఆలస్యముచేసి స్వామి ముందు తలవంచుకొన్నాడు.

అప్పుడు శ్రీవేంకటేశ్వరుడు నీవు కూడా రాబోయే జన్మలో గంధర్వరాజు వలె మహారాజుగా పుట్టి, నాకు విమానాన్ని నిర్మించి ఎంతో కైంకర్యం చేయగలవని చెప్పాడు. ఇలా రంగదాసు నూరుసంవత్సరాలు స్వామికి సేవచేసి తిరిగి తొండమానుడుగా జన్మించాడని శ్రీవేంకటాచలమాహాత్మ్యం ద్వారా తెలుస్తున్నది.

## తొండమాన్ వృత్తాంతం

శ్రీవేంకటేశ్వరునికి కైంకర్యం చేసిన రాజులలో తొండమాన్ చక్రవర్తి సుప్రసిద్ధుడు. పూర్వజన్మలో రంగదాసే తొండమానునిగా చంద్రవంశంలో జన్మించాడు. ఇతడు పాండ్యరాజు కూతురు పద్మను వివాహమాడి నారాయణపురం రాజధానిగా రాజ్యం చేసేవాడు. రేణుకాదేవిని తిరుమలలో ఆరాధించి ఆమె అనుగ్రహంతో శ్రీనివాసుని నివాసాన్ని కనుక్కొన్నాడు. వేంకటాద్రిలో మొట్టమొదట శ్రీనివాసునికి ఆలయగోపుర ప్రాకారములను నిర్మించి మహోత్సవాన్ని తొండమానుడే నిర్వహించాడు. తరువాత ఇంకొక రూపాన్ని ధరించి సారూప్యమోక్షాన్ని పొందినట్లు పురాణాలు తెలియజేస్తున్నాయి.

## భీమ వృత్తాంతం

భీముడనే కుమ్మరిభక్తుడు ప్రతి నిత్యం- శ్రీనివాసుని మట్టి పద్మాలతో ఆరాధిస్తూ ఉండేవాడు. ఒకనాడు శ్రీనివాసుడు తొండమానునికి ఈ విషయాన్ని చెప్పాడు. అది విని తొండమానుడు భీముని దర్శించడానికి ఆయన ఇంటికి వెళ్ళాడు. శ్రీనివాసుడు అక్కడ ప్రత్యక్షమై అతనికి, అతని భార్య తమాలినికి సాయుజ్యాన్నిచ్చాడు.

## వకుళ మాలికా వృత్తాంతం

వరాహస్వామి శ్రీనివాసునికి పాకాది కైంకర్యం కోసం వకుళమాలికను నియోగించాడు.

శ్రీకృష్ణావతారంలో కాంచలేని శ్రీనివాసుని కల్యాణాన్ని యశోద వకుళమాతగా జన్మించి జరిపించింది.

ఇలా వేంకటాచలంలో ఎందరో భక్తులు తమ కష్టాలను పోగొట్టుకొని స్వామిసేవలో తమ జీవితాన్ని చరితార్థం చేసుకొన్నారని పురాణాలు వివరిస్తున్నాయి.

# తిరుమల శ్రీనివాసుని సప్తవాహన వైభవం

- డా॥ జి. లక్ష్మీనారాయణ




శ్రీ తిరుమలేశునికీ, రథసప్తమికీ అవినాభావ సంబంధ మున్నది. శ్రీస్వామివారికీ, సూర్యునికీ సప్తసంఖ్య ఇష్టమైనది. శ్రీవారు ఏడుకొండలపై ఉండి భక్తుల్ని కాపాడుతున్నాడు. సూర్యుడు ఏడుగుఱ్ఱాలపై పయనిస్తూ, పైనున్న ఏడులోకా లనూ, క్రిందనున్న ఏడులోకాలను తనకాంతి కిరణాలతో చైతన్య వంతం చేస్తున్నాడు. ఇద్దరూ చీకట్లను పోగొట్టేవారు, పాప పరిహారకులు. శ్రీభూదేవీ సమేతుడు స్వామి, ఛాయాసంజ్ఞా సమేతుడు రవి. సర్వలోకసంరక్షణము, సంచారము ఇర్వురి యందును సమానము. స్వామి వేంకట నారాయణుడు. రవి సూర్యనారాయణుడు. శ్రీవారిరథమూ హిరణ్మయమే! సూర్యుని రథమూ హిరణ్మయమే! ఇలా అన్నింటనూ సౌమ్యమున్నందున శ్రీవారి విశేషోత్సవాలలో **'రథసప్తమి'** ఒక విశిష్టస్థానాన్ని అలం కరించుకొన్నది.

ప్రతిసంవత్సరం మాఘశుద్ధసప్తమి **"సూర్యజయంతి"** నాడు తిరుమలలో **"రథసప్తమి"** పేరుతో ఉత్సవం జరుగుతుంది. ఆ రోజు శ్రీవారు సూర్యోదయం నుండి, సూర్యాస్తమయం వరకు ఏడువాహనాల్లో విహరిస్తారు. 1)సూర్యప్రభవాహనం, 2)చిన్న శేషవాహనం, 3)గరుడవాహనం, 4)హనుమద్వాహనం, 5)కల్ప వృక్షవాహనం, 6)సర్వభూపాలవాహనం, 7)చంద్రప్రభవాహనం. మధ్యాహ్నం 'చక్రత్తాళ్వార్' (సుదర్శనచక్రం) వారికి వరాహ స్వామి సన్నిధిలో చక్రస్నానం జరుగుతుంది. ఎన్నడూ లేని విధంగా ఒకేరోజు ఏడువాహనాల్లో, ఏడుమార్లు వివిధ అలం కారాలతో, దివ్యశోభలతో శ్రీవారు ఉత్సవమూర్తిగా భక్తులకు












దర్శనమివ్వడం రథసప్తమినాడు మాత్రమే జరిగే విశేష విశిష్ట మహోత్సవం. కనుకనే రథసప్తమీ ఉత్సవాన్ని 'అర్ధబ్రహ్మోత్సవమనీ', 'ఏకదిన (ఒకరోజు) బ్రహ్మోత్సవమనీ' భక్తులు భక్తిప్రపత్తుల్తో కీర్తిస్తారు.

## సప్తపర్యాయ ఉత్సవాలు - కొన్ని విశిష్టతలు

సూర్యప్రభ, చిన్నశేష, గరుడ, హనుమద్ వాహనాలపై శ్రీమలయప్పస్వామివారొక్కరే ఉత్సవానికి వస్తారు. (శ్రీవారి ఉత్సవమూర్తిని మలయప్పస్వామి అంటారు) మొదట సూర్యప్రభవాహనంపై సూర్యోదయవేళ– శ్రీవారు వాయవ్యమూలకు విచ్చేసి, ఉదయభాను కిరణాలు తనపై ప్రసరిస్తుండగా, అఖండగోవిందనామ కీర్తనలతో వేంకటాచలం ప్రతిధ్వనిస్తుండగా హారతి గైకొని, భక్తుల్ని కరుణిస్తారు. పిదప శేష, గరుడ, హనుమద్వాహనాలపై మలయప్పస్వామి వారొక్కరే ఉత్సవానికి వస్తారు. మధ్యాహ్నం చక్రత్తాళ్వార్ ఒక్కరే శ్రీవరాహస్వామి వారి సన్నిధిలో చక్రస్నానం చేస్తారు. తరువాత ఉభయ నాంచారులతో శ్రీమలయప్ప స్వామివారు కల్పవృక్ష, సర్వభూపాల వాహనాలపై ఉత్సవానికి వస్తారు. ఏడవదైన చంద్రప్రభవాహనంపై సాయంకాలం– స్వామివారొక్కరే (ఉదయం వలె) ఉత్సవకైంకర్యం గైకొంటారు.

ఉదయం సూర్యప్రభతో ప్రారంభమై, సాయంకాలం చంద్రప్రభతో రథసప్తమినాటి ఏడుమార్లు ఉత్సవం పూర్తి అవుతుంది. సూర్యచంద్రులిద్దరూ శ్రీవారినేత్రాలేకదా!

హృదయోల్లాసంతో ఉదయం శ్రీస్వామివారు ఒంటరిగానేవచ్చి, తన ఏకచక్రరథత్వాన్నీ, ఏకచ్ఛత్రాధిపత్యాన్నీ ప్రకటిస్తూ, చతుర్విధ భక్తులకు, చతుర్విధపురుషార్థాలనూ, చతుర్విధ మోక్షాలనూ ప్రసాదిస్తారు. కనుకనే దేవేరులను పిల్చుకరారు కాబోలు! సూర్యుడు తన కుడినేత్రం, శేషుడు తనశయ్య, గరుడుడు తన సంచార వాహనం. హనుమంతుడు రామావతారంలో తనను వహించినవాడు. చంద్రుడు తన ఎడమనేత్రం. ఈయైదు వాహనసేవలూ ఒక్క మారైనా స్వామి తానే ప్రత్యేకంగా ఉపయోగించుకోవడం న్యాయమేకదా!


కల్పవృక్ష, సర్వభూపాలవాహనాలు ఉభయనాంచారులకూ, తనకూ సమానమే కనుక దేవీద్వయంతో విచ్చేసి, సర్వ భక్తులకూ కల్పవృక్షమై, కైంకర్యపరుల సర్వమనోరథాలను సఫలంచేసి, అనుగ్రహించి, దేవేరులను మందిరానికి పంపి, సాయంకాలం ఏకాంతంగా ఆనందనిలయాన్ని ప్రవేశించి, దేవేరులతో ఇష్టాగోష్ఠితో ఆనందంగా విశ్రాంతి గైకొంటారు శ్రీవారు మలయప్పమూర్తియై.

శ్రీరామచంద్రుడే నిత్యమూ సూర్యారాధకుడు కాగా ఇక సామాన్యులస్థితి చెప్పనేల? సూర్యుడు త్రిమూర్త్యాత్మక స్వరూపుడు. సూర్యుడు నెలకొక్కరూపాన్ని పొందుతూ ప్రకృతిని రక్షిస్తున్నాడు. కర్మసాక్షియై సకలజీవులకర్మలను గమనిస్తున్నాడు. అందరి బుద్ధులను నడిపిస్తున్నాడు. వర్షాన్ని అనుగ్రహిస్తున్నాడు. మానవ శరీరరూప నిర్మాణానికి కారణమైన వైవస్వత మనుతత్త్వానికి కారణమైనవాడు. ఇంతటి ప్రభావసంపన్నుడైన సూర్యభగవానుని జయంతియైన "రథసప్తమి", మనలో శాంతి సంతోషాలు కల్గించాలని ప్రార్థిద్దాం.









*గత సంచిక తరువాయి భాగం.....*

## అన్నమయ్య - పురందరదాసు



అన్నమయ్యకు వేంకటేశ్వరస్వామి లాగా, పురందర దాసుకు పాండురంగ విట్ఠలుడు ఉపాస్యదైవం. ఈయన వ్యాసరాయల శిష్యుడు. హరిదాస సంప్రదాయావలంబకుడు. కన్నడంలో పురందర విట్ఠలముద్రతో సుమారు 5 లక్షల సంకీర్తనలు ఇతను రాసిట్లు చెబుతారు.

అటువంటి పురందరదాసు అన్నమాచార్యులగాన ప్రాశస్త్యాన్ని, సంకీర్తనా వైభవాన్ని తెలుసుకున్నాడు. అన్నమా చార్యుల సంకీర్తనల ప్రభవాన్ని గురించి విన్న తరువాత అన్న మయ్యను సాక్షాత్తూ శ్రీహరి అంశగా భావించి, దర్శించాలను కున్నాడు. తిరుమలకు వచ్చి స్వామిని, స్వామి భక్తుడిని దర్శించాడు. అన్నమయ్య కూడా పురందరదాసును సాక్షాత్తూ పాండురంగవిట్ఠలుడిగా భావించాడు.



## అన్నమయ్య రచనలు

అన్నమయ్య 32 వేల సంకీర్తనలు రచించి వేంకటే శాంకితము చేశాడు. వాటిలో కొన్ని యోగమార్గానికి చెంది నవి. ఇంకొన్ని శృంగారస్ఫోర కాలు. మరికొన్ని వైరాగ్య దాయికాలు. ఈ సంకీర్తన లతో పాటు ద్విపదప్రబంధ రూపంలో రామాయణాన్ని, వేంకటాచలమహాత్మ్యం అనే సంస్కృత కావ్యాన్ని, శృంగార మంజరిలతో పాటు 12 శతకాలను (లభించేది వేంకటే శ్వర శతకం మాత్రమే) రచించాడు.

## తాళ్లపాక తిమ్మక్క

అన్నమాచార్యుల మొదటి భార్య తాళ్లపాక తిరుమలాంబ. ఈవిడకు తిరుమలమ్మ, తిరుమలక్క, తిమ్మక్క అని కూడా నామాంతరాలు ఉన్నాయి. తొలితెలుగు కవయిత్రి తాళ్లపాక తిమ్మక్క. ఈవిడ రాసిన ఏకైక గ్రంథం సుభద్రా కల్యాణము. 1163 పాదాలతో రాసిన ద్విపద కావ్యం ఇది. ఈ గ్రంథం రాశిలో తక్కువైనా వాసిలో తక్కువ కాదు. ఈ సుభద్రా కల్యాణానికి ఆధారం మహాభారతం.

తేటతేట తెలుగు పలుకులతో ఈ కావ్యాన్ని రాసింది. "అమర అహోబళం వెంకటాద్రి వరుస నాపై కంచి వరదుల గొలిచె" అంటూ మూలంలో లేని తిరుమల సందర్భ నాన్ని అర్జునుని చేత చేయించింది. తద్వారా శ్రీవేంకటేశ్వరునిపై



గల భక్తిని ప్రకటించుకుంది. సుభద్రపాత్రను తీర్చిదిద్దిన విధానం, ఉట్టిపడే తెలుగుదనం మొదలైన విషయాలలో తిమ్మక్క కవన నైపుణ్యాన్ని తరువాతి తరంవారైన చేమకూర వేంకటకవి వంటివారు అనుసరించారు.

## అన్నమయ్య సంతతి

తన సంకీర్తనలతో తిరుమల శ్రీవేంకటేశ్వరుడిని మెప్పించిన అన్నమయ్య, శ్రీనివాసుడి ఆశీర్వాదంతో తనంతటి వారైన ఇద్దరు కొడుకులను కన్నాడు. వారు నరసయాచార్యుడు, తిరుమలాచార్యుడు. వీరిరువురు భక్తిలోనూ, సాహిత్యసృజన లోనూ అన్నమయ్య వారసులే.




పెదతిరుమలయ్యగా ప్రసిద్ధిపొందిన తిరుమలాచార్యుడు తన తండ్రి అన్నమయ్య ఆనతి ప్రకారం రోజుకో సంకీర్తన రాసి స్వామికి సమర్పించేవాడని ప్రతీతి. శృంగార, ఆధ్యాత్మ సంకీర్తనలు, వేంకటేశ్వర వచనాలు, శృంగార దండకం, చక్ర వాళ మంజరి, వేంకటేశ్వరోదాహరణం, నీతి సీసశతకం, శ్రీవేంకటేశ్వరప్రభాతస్తవం వంటి గ్రంథాలు రాసి స్వామి సేవలో తరించాడు.

ఈయన తిరుమల వేంకటేశ్వరునికి విశిష్టమైన సేవలు చేసినట్లు శాసనాధారాల వల్ల తెలుస్తున్నది. ఈయన కుమారులు చిన్నతిరుమలయ్య, పెదతిరువేంగళనాథుడు, తిరువేంగళనాథుడు (చిన్నన్న), కోనేటి తిరువేంగళనాథుడు కూడా తాతగారైన అన్నమాచార్యులు, తండ్రిగారైన తిరుమలా చార్యుల మార్గంలోనే తిరుమల వేంకటనాథునికి సాహితీసేవ చేశారు.

అన్నమయ్య మునిమనుమడు చినతిరుమలయ్య కుమారుడైన తిరువేంగళప్ప, అన్నమయ్య కుమార్తె తిరుమాలంబ కుమారుడైన రేవణూరి వేంకటార్యుడు వీరు కూడా తమ తాత, ముత్తాతల వలె శ్రీవేంకటేశ్వరుని కృపావలబ్ధమైన సంగీత సాహిత్యపదార్చనలతో స్వామిని సేవించారు. తరించారు.

ఇలా చిన్నబీజం పెద్ద వటవృక్షమైనట్లు ఒక్క అన్న మయ్యతో మొదలైన శ్రీనివాసుని సాహిత్య పదార్చన, సంకీర్తనా యజ్ఞం దాదాపు అన్నమయ్య తరువాత అయిదు తరాలవరకూ కొనసాగింది. వీరి సాహిత్యసేవకు శ్రీవేంకటేశుడు ఆనంద డోలికలలో తేలియాడాడు. అంతటి ధన్యత్వాన్ని పొంది కేవలం తాళ్లపాక వంశాన్నే కాకుండా ప్రపంచాన్నంతటినీ ధన్యులను జేశారు ఈ తాళ్ళపాక కవులు.

ఇంతటి సంకీర్తనా విరాడ్రూపానికి మూలకారకుడైన అన్నమయ్య 95 సంవత్సరాల పరిపూర్ణ జీవితాన్ని గడిపి దుందుభి నామసంవత్సర ఫాల్గుణ బహుళ ద్వాదశి నాడు (1503 ఫిబ్రవరి 23)న తన ఆరాధ్యదైవమైన శ్రీవేంకటేశ్వ రునిలో ఐక్యమయ్యాడు.



పదకవితాపితామహుడు, సంకీర్తనాచార్యుడు, పంచమా గమ సార్వభౌముడు, ద్రవిడాగమ సార్వభౌముడువంటి బిరుదు లను పొందిన అన్నమయ్యచరిత్ర తిరుమల చరిత్రలో ఎప్పటికీ చెరిగిపోని ఒక విశిష్ట అధ్యాయం.

సమాప్తం

# అష్టాక్షర మహామంత్ర మాహాత్మ్యము




– డా॥ పెన్మెత్స వెంకటరాజు

శ్రీమహావిష్ణు మహామంత్రమండలము లలో *'ఓం నమో నారాయణాయ'* అను అష్టాక్షర మహామంత్రము విష్ణుభక్తులకు ముక్తిదాయకము. ఈ అష్టాక్షర మహామంత్రమును జపించిన యెడల జననమరణాత్మకమయిన సంసార బంధము నుండి మనుష్యుడు ముక్తిని పొందును.

ప్రహ్లాద నారద పరాశర పుండరీక
వ్యాసాంబరీష శుక శౌనక భీష్మదాల్భ్యాన్ ।
రుక్మాంగదార్జున వసిష్ఠ విభీషణాదీన్
పుణ్యానిమాన్ పరమభాగవతాన్ స్మరామి ॥

ప్రహ్లాదుడు నారదుడు పరాశరుడు పుండరీకుడు వ్యాసుడు అంబరీషుడు శుకుడు శౌనకుడు భీష్ముడు దాల్భ్యుడు రుక్మాంగదుడు అర్జునుడు వశిష్టుడు విభీషణుడు మొదలగువారు పరమ భాగవతశిఖామణులు. వీరు నారాయణ అష్టాక్షర మహామంత్రమును నిత్యము జపించి పరమభాగవతులుగా ప్రసిద్ధిచెంది, నారాయణ సాన్నిధ్యమును పొందిరి. ఇట్టి పరమభాగవతులను స్మరించుట కూడ ముక్తిదాయకము.

మానవుల హృదయకమలమధ్యమున శంఖచక్రగదాధరుడయిన నారాయణుడున్నాడు. ఆయనను ఏకాగ్రమైన మనస్సుతో ధ్యానించి ఈ అష్టాక్షరమహామంత్రమును జపించవలెను.

ఈ అష్టాక్షర మహామంత్రమునకు స్వయముగా నారాయణుడే ఋషి. ఛందము దేవీ గాయత్రి. పరమాత్మా దేవత. ఏకాంత ప్రదేశమున సుఖాసనమున కూర్చొని నిర్మలనిశ్చల చిత్తమున శ్రీమహావిష్ణు స్వరూపమును ఉంచి అష్టాక్షర మహామంత్రమును జపించవలెను.

*'ఓం నమో నారాయణాయ'* అను అష్టాక్షర మహామంత్రమునందలి – *'ఓం'* కారము శుక్లవర్ణము కలది. *'న'* కారము రక్త వర్ణము కలది. *'మ'* కారము కృష్ణవర్ణము కలది. *'న'* కారము రక్త వర్ణము కలది. *'ర'* కారము కుంకుమ వర్ణము కలది. *'య'* కారము పీత వర్ణము కలది. *'ణ'* కారము అంజన వర్ణము కలది. *'య'* కారము బహు వర్ణములు కలది. ఈ మహామంత్రము సర్వార్థ సాధకము.

అష్టాక్షరమహామంత్రము అష్టమూర్త్యాత్మకము. 'అష్టాక్షరం అష్టమూర్తిర్భవతి ప్రథమరూపః పృథివీ రూపో భవతి. ద్వితీయమాపోభవతి. తృతీయస్తేజోభవతి. చతుర్థోవాయుర్భవతి. పంచమీ ఆకాశోభవతి. షష్ఠశ్చంద్రమా భవతి. సప్తమః సూర్యోభవతి. అష్టమోయజమానః.'

మొదటి అక్షరము పృథివి. రెండవ అక్షరము జల రూపము. మూడవ అక్షరము అగ్నిరూపము. నాలుగవ అక్షరము వాయు రూపము. ఐదవ అక్షరము ఆకాశరూపము. ఆరవ అక్షరము చంద్రస్వరూపము. ఏడవ అక్షరము సూర్య రూపము. ఎనిమిదవ అక్షరము యజమాన రూపము. ఈ విధముగా అష్టాక్షర మహామంత్రము అష్టమూర్త్యాత్మకము అగుచున్నది.

భూమిరాపస్తథా తేజో వాయుర్వ్యోమ చ చంద్రమాః
సూర్యః పుమాంస్తథా చేతి మూర్తయశ్చాష్టకీర్తితాః
(నారాయణోపనిషత్తు)

ఈ కనిపించు- వినిపించు సమస్త జగత్తు యొక్క లోపల బయట అంతటా నారాయణుడు వ్యాపించి ఉన్నాడు.

అనగా పరబ్రహ్మ- పరంజ్యోతి- పరతత్త్వ- పరమాత్మ శబ్దములు బోధించు ఏ పరమాత్మ కలడో ఆయన అంతటా వ్యాపించి ఉన్నాడనుట నారాయణ శబ్దమునకు అర్థము. అనగా నారాయణ శబ్దము-పరమాత్మ యొక్క సర్వ వ్యాపకత్వమును బోధించుచున్నది.

వైదిక సంప్రదాయమున నారాయణ వాసుదేవ విష్ణు అను మూడు నామములు పరమాత్మ యొక్క సర్వవ్యాపకత్వ బోధకములు. 'వ్యాప్నోతీతి విష్ణుః' అని వ్యుత్పత్తి 'విశ్వవ్యాపనశీల త్వాద్విష్ణురిత్యుచ్యతే బుధైః'



అష్టాక్షరశ్చ యో మంత్రో ద్వాదశాక్షర ఏవ చ
షడక్షరశ్చ యో మంత్రో విష్ణోరమిత తేజసః
ఏతే మంత్రాః ప్రధానస్తు వైదికాః ప్రణవైర్యుతాః ।

అష్టాక్షర మహామంత్రమయిన "ఓం నమో నారాయణాయ", ద్వాదశాక్షర మంత్రమయిన "ఓం నమో భగవతే వాసుదేవాయ". షడక్షర మంత్రమయిన- ఓం విష్ణవే నమః. ఈ మూడు మహామంత్రములు వైదికములు అయిన వైష్ణవ మంత్రములు. (పారమాత్మకోపనిషత్తు)

వాసుదేవ నామము కూడా శ్రీమహావిష్ణువు యొక్క సర్వవ్యాపకత్వమును బోధించుచున్నది. వాసనాత్ వాసుదేవస్య వాసితం తే జగత్రయమ్-సర్వభూత నివాసోసి వాసుదేవ నమోస్తుతే. (విష్ణుసహస్రనామము)

నారాయణం నమస్కృత్య నరం చైవ నరోత్తమమ్ ।
దేవీం సరస్వతీం చైవ తతో జయ ముదీరయేత్ ॥

ఇది మహాభారత ప్రారంభమున వ్యాసభగవానుడు చేసిన ప్రార్థన. ఇందు మొట్టమొదట ప్రయోగించిన నారాయణ నామమునకు శ్రీనీలకంఠ దీక్షితులు చేసిన వ్యాఖ్యానము అమితామోదావహము.

నారాయణమితి సరోవిద్యావచ్ఛిన్నం చైతన్యం జీవః
తేన విషయీకృతే అనవచ్ఛిన్న చైతన్యరూపే, బ్రహ్మణి శుక్తౌ
రజతవత్ కల్పితం చరాచరం అప్ శబ్దవాచ్యం నారం తదేవ
అయనం శక్తీదమంశస్య రజతమివ ప్రవేశస్థానం యస్య సః నారాయణః

నరః అనగా అవిద్యతో కూడిన చైతన్య రూపమయిన జీవి. ముత్యపుచిప్పయందు కప్పబడి వెండి వలే పరబ్రహ్మ యందు కల్పింపబడిన ఈ చరాచర జగత్తు అపో శబ్దవాచ్య మయిన నారము. ఇట్టి నారమునందు. శయనించినవాడు లేక-నారము శయనముగా కలవాడు నారాయణుడు. అనగా జీవ చైతన్యము శయనముగా సర్వము వ్యాపించియున్న పరబ్రహ్మ పరంజ్యోతి పరతత్త్వ రూపమైన పరమాత్మయే నారాయణ శబ్దవాచ్యుడు.

ఇట్టి అష్టాక్షర మహామంత్రమును స్మరించినంత మాత్రమున జననమరణాత్మక సంసారబంధము నుండి మానవుడు విముక్తుడగును.


క్రోధం శత్రువుతో సమానం

# దేవుని కడప
# శ్రీ లక్ష్మి వేంకటేశ్వరస్వామివారి
# బ్రహ్మోత్సవాలు

**2021 ఫిబ్రవరి**
**13 నుండి 21 వరకు**



**12-02-2021 శుక్రవారం**
పగలు: దీక్షా తిరుమంజనం
రాత్రి: సేనాధిపతి ఉత్సవం, అంకురార్పణం

**13-02-2021 శనివారం**
పగలు: తిరుచ్చి, ధ్వజారోహణం
రాత్రి: చంద్రప్రభవాహనం

**14-02-2021 ఆదివారం**
పగలు: సూర్యప్రభవాహనం
రాత్రి: పెద్దశేష వాహనం

**15-02-2021 సోమవారం**
పగలు: చిన్నశేషవాహనం
రాత్రి: సింహవాహనం

**16-02-2021 మంగళవారం**
పగలు: కల్పవృక్షవాహనం
రాత్రి: హనుమంత వాహనం

**17-02-2021 బుధవారం**
పగలు: ముత్యపుపందిరివాహనం
రాత్రి: గరుడవాహనం

**18-02-2021 గురువారం**
పగలు: కల్యాణోత్సవం
రాత్రి: గజవాహనం

**19-02-2021 శుక్రవారం**
పగలు: రథోత్సవం
రాత్రి: ధూళి ఉత్సవం

**20-02-2021 శనివారం**
పగలు: సర్వభూపాలవాహనం
రాత్రి: అశ్వవాహనం

**21-02-2021 ఆదివారం**
పగలు: వసంతోత్సవం, చక్రస్నానం
రాత్రి: ధ్వజావరోహణం, హంసవాహనం

తిరుమల తిరుపతి దేవస్థానములు

# శ్రీనివాసమంగాపురం
# శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామివారి
# బ్రహ్మోత్సవాలు



**2021 మార్చి**
**02 నుండి 10 వరకు**

**01-03-2021 సోమవారం**
రాత్రి: సేనాధిపతి ఉత్సవం, అంకురార్పణం

**02-03-2021 మంగళవారం**
పగలు: తిరుచ్చి ఉత్సవం, ధ్వజారోహణం
రాత్రి: పెద్దశేష వాహనం

**03-03-2021 బుధవారం**
పగలు: చిన్నశేషవాహనం
రాత్రి: హంసవాహనం

**04-03-2021 గురువారం**
పగలు: సింహవాహనం
రాత్రి: ముత్యపుపందిరి వాహనం

**05-03-2021 శుక్రవారం**
పగలు: కల్పవృక్షవాహనం
రాత్రి: సర్వభూపాలవాహనం

**06-03-2021 శనివారం**
పగలు: పల్లకీలో మోహినీ అవతారోత్సవం
రాత్రి: గరుడవాహనం

**07-03-2021 ఆదివారం**
పగలు: హనుమద్వాహనం, సా॥ వసంతోత్సవం
రాత్రి: గజవాహనం

**08-03-2021 సోమవారం**
పగలు: సూర్యప్రభవాహనం
రాత్రి: చంద్రప్రభవాహనం

**09-03-2021 మంగళవారం**
పగలు: రథోత్సవం
రాత్రి: అశ్వవాహనం

**10-03-2021 బుధవారం**
పగలు: పల్లకీ ఉత్సవం, తిరుచ్చి ఉత్సవం, చక్రస్నానం
రాత్రి: తిరుచ్చి ఉత్సవం, ధ్వజావరోహణం

తిరుమల తిరుపతి దేవస్థానములు

# తిరుపతి
# శ్రీ కపిలేశ్వరస్వామివారి బ్రహ్మోత్సవాలు



**2021 మార్చి 04 నుండి 13 వరకు**

**03-03-2021 బుధవారం**
రాత్రి: మూషిక వాహనంపై వినాయక స్వామి అంకురార్పణం

**04-03-2021 గురువారం**
పగలు: పల్లకీ ఉత్సవం, ధ్వజారోహణం
రాత్రి: హంసవాహనం

**05-03-2021 శుక్రవారం**
పగలు: సూర్యప్రభవాహనం
రాత్రి: చంద్రప్రభవాహనం

**06-03-2021 శనివారం**
పగలు: భూతవాహనం
రాత్రి: సింహవాహనం

**07-03-2021 ఆదివారం**
పగలు: మకరవాహనం
రాత్రి: శేషవాహనం

**08-03-2021 సోమవారం**
పగలు: అధికార నందివాహనం
రాత్రి: తిరుచ్చి ఉత్సవం

**09-03-2021 మంగళవారం**
పగలు: వ్యాఘ్రవాహనం
రాత్రి: గజవాహనం

**10-03-2021 బుధవారం**
పగలు: కల్పవృక్షవాహనం
రాత్రి: తిరుచ్చి ఉత్సవం

**11-03-2021 గురువారం**
పగలు: రథోత్సవం
రాత్రి: నందివాహనం, మహాశివరాత్రి

**12-03-2021 శుక్రవారం**
పగలు: పురుషామృగ వాహనం
రాత్రి: కల్యాణోత్సవం, అశ్వవాహనం

**13-03-2021 శనివారం**
పగలు: సూర్యప్రభవాహనంలో నటరాజస్వామి, త్రిశూలస్నానం
రాత్రి: ధ్వజావరోహణం, రావణాసుర వాహనం



# తిరుపతి
# శ్రీ కోదండరామస్వామివారి బ్రహ్మోత్సవాలు

**2021 మార్చి 13 నుండి 21 వరకు**

**12-03-2021 శుక్రవారం**
రాత్రి: సేనాధిపతి ఉత్సవం, అంకురార్పణం

**13-03-2021 శనివారం**
పగలు: తిరుచ్చి ఉత్సవం, ధ్వజారోహణం
రాత్రి: పెద్దశేష వాహనం

**14-03-2021 ఆదివారం**
పగలు: చిన్నశేష వాహనం
రాత్రి: హంసవాహనం

**15-03-2021 సోమవారం**
పగలు: సింహ వాహనం
రాత్రి: ముత్యపుపందిరి వాహనం

**16-03-2021 మంగళవారం**
పగలు: కల్పవృక్ష వాహనం
రాత్రి: సర్వభూపాల వాహనం

**17-03-2021 బుధవారం**
పగలు: పల్లకీలో మోహినీ అవతారోత్సవం
రాత్రి: గరుడవాహనం

**18-03-2021 గురువారం**
పగలు: హనుమద్వాహనం
రాత్రి: సా॥ వసంతోత్సవం, గజవాహనం

**19-03-2021 శుక్రవారం**
పగలు: సూర్యప్రభ వాహనం
రాత్రి: చంద్రప్రభ వాహనం

**20-03-2021 శనివారం**
పగలు: రథోత్సవం
రాత్రి: అశ్వవాహనం

**21-03-2021 ఆదివారం**
పగలు: చక్రస్నానం
రాత్రి: తిరుచ్చి ఉత్సవం, ధ్వజావరోహణం

# శ్రీమద్భగవద్గీత



3

విద్వాన్, డా॥ ఈ.జి. హేమంత కుమార్

## 3వ - అధ్యాయం (కర్మయోగం)

### అధ్యాయ నామౌచిత్యం

'కర్మ' అంటే పని, కార్యం, విధ్యుక్త ధర్మం. కరణాలతో చేసే అన్ని క్రియలు కర్మయందు అంతర్భూతాలే. వేదంలో కర్మకాండ, ఉపాసనాకాండ, జ్ఞానకాండ అని మూడు విభాగాలున్నాయి. సకామకర్మ వలన మనుజులు బంధింపబడతారు. నిష్కామకర్మ వల్ల విముక్తులౌతారు. ఉపాసనతో ఏకాగ్రత కల్గుతుంది. ఆత్మజ్ఞానంతో మోక్షం లభిస్తుంది. ఈ అధ్యాయంలో కర్మస్వరూపం వేదాంతదృష్టితో వివరింపబడింది.

ఎవడైతే మనస్సుతో ఇంద్రియాలన్నింటినీ అణగ తొక్కి నిష్కామబుద్ధితో కర్మ నాచరిస్తాడో వాడే ఉత్తముడంటూ–

యస్త్వింద్రియాణి మనసా నియమ్యారభతేఽర్జున ।
కర్మేంద్రియైః కర్మ యోగ మసక్త స్స విశిష్యతే ॥ 7

అని భగవానుల వారి మాట. లోకంలో కర్మచేయకుండా ఏ జీవి ఉండలేడు. నియతమైన కర్మల్ని ఫలాపేక్ష లేకుండా ఈశ్వరార్పణ బుద్ధితో చెయ్యాలి. గీత మొదటి అధ్యాయం కర్మయోగాన్ని బోధించినా ఈ అధ్యాయంలో కర్మ సన్న్యాసం విశేషించి చెప్పబడటం వల్ల ఇది కర్మయోగమైంది.

జనకాదులు కర్మచేతనే సిద్ధిపొందినారని చెబుతూ అనాసక్తితో కర్మల్ని చేసేవారికి తప్పక పరమపదం కలుగుతుంది అని కృష్ణుడిలా బోధించాడు.

తస్మాదసక్తః సతతం కార్యం కర్మ సమాచర ।
అసక్తో హ్యాచరన్కర్మ పరమాప్నోతి పూరుషః ॥ 19

ఈ ప్రకారంగా కర్మయోగం ఎంతవరకు చేస్తుందాలో ఈ అధ్యాయంలో నిరూపింపబడింది. ఏ కర్మ ఏ లాగున చేయాలో, ఎట్లా చేస్తే ఇహపరాల్లో సౌఖ్యం కలుగుతుందో, ఆయా కర్మల్ని మనుజులెందుకు ఆచరించాలో, ఆచరించకుంటే కలిగే అనర్థాలేమిటో, ఆచరిస్తే కలిగే మేలేమిటో, ఏ కర్మ బంధాన్ని కలిగిస్తుందో, ఏ కర్మ ముక్తికి దారి తీస్తుందో విపులంగా వివరింపబడి కర్మయోగం అనే పేరుకు భావ్యమై ఒప్పుతూ ఉంది. ఈ అధ్యాయ పారాయణం వల్ల చనిపోయిన జీవుల యొక్క ప్రేతత్వం పోకుండా ఉన్నట్లయితే అట్టివారి ప్రేతత్వం నశిస్తుంది.

### అర్జును దడుగుతున్నాడు

కృష్ణా! నీ వింతవరకు చెప్పిందాన్ని బట్టి చూస్తే జ్ఞానయోగమే శ్రేష్ఠమని తోస్తున్నది. మరైతే మారణరూపమైన సంగ్రామం అనే కర్మరంగంలోకి నన్నెందుకు ప్రేరేపిస్తున్నావు? నీ మాటలు నన్ను సందిగ్ధంలో పడేస్తున్నాయి. ఏది శ్రేయస్కరం? ఏది హానికరం? జ్ఞానమార్గమా? కర్మమార్గమా? దేన్ననుసరిస్తే మేలు కలుగుతుందో నిశ్చయించి చెప్పమన్నా డర్జునుడు.

### శ్రీకృష్ణు డంటున్నాడు

అర్జునా! లోకంలో కర్మయోగం, జ్ఞానయోగం రెండున్ను అనుష్ఠింప తగినవే. ఎవరి సంస్కారం ఎట్లా ఉంటుందో వారు దాన్ని ఆచరిస్తారు. నిష్కామంగా, బ్రహ్మార్పణ బుద్ధితో కర్మచేస్తేనే చిత్తశుద్ధి కలుగుతుంది. చిత్తశుద్ధి వల్ల జ్ఞానం ఉదయిస్తుంది. జ్ఞానం చేత మోక్షం లభిస్తుంది. ఈ విశ్వంలో ప్రకృతి బద్ధుడైన మానవుడు ప్రతిక్షణం ఏదో ఒకపనిచేస్తూనే ఉంటాడు.

న హి కశ్చిత్ క్షణమపి జాతు తిష్ఠత్యకర్మకృత్ ।
కార్యతే హ్యవశః కర్మ సర్వః ప్రకృతిజైర్గుణైః ॥ 5

ప్రకృతి గుణాలు మనచేత కర్మల్ని చేయించి తీరతాయి. అది ప్రకృతియొక్క స్వభావం. కర్మచేయకుండా ఎవరు కూడా

ఒక్కక్షణం ఉండలేరు. కనుక ఏ పనీ చేయకుండా ఉండటం కన్నా ఏదో ఒక పని చేయడం మంచిది. శరీరయాత్ర కోసర మైనా కర్మచేసి తీరాల్సిందే. ఏదో ఒక పనిచేయడం కంటే కర్తవ్యబుద్ధితో– కోరికలు లేకుండా, భగవత్ప్రీతి కలిగించే కర్మల నాచరిస్తే అదే ఒక మహాయజ్ఞం. కాబట్టి అర్జునా! అహం కారాన్ని వదలి, కర్తృత్వాన్ని విడిచి పెట్టి ఈశ్వరార్పణ బుద్ధితో ప్రయోజనాపేక్ష లేకుండా కర్మచేసి పరమాత్మను పొందు.

అంతేకాదు కౌంతేయ! మానవుడై పుట్టినవాడు యజ్ఞ కర్మ విధిగా నిర్వర్తించాలి. ప్రజాపతి బ్రహ్మ ప్రజల్ను సృష్టించి నపుడే యజ్ఞాన్ని కూడా సృష్టించి మానవులారా! ఈ యజ్ఞమే కామధేనువులాగా మీ కిష్టమైన వస్తువుల్నిచ్చి మిమ్మల్ని కాపాడు తుంది. "మీకంటే దేవతలు శ్రేష్ఠులు. దేవతలు మీరు పరస్పర శ్రేయోభిలాషులై ఒకరి కొకరు చేదోడు వాదోడుగా జీవించండి. పూజలతో దేవతలను మెప్పించండి" అని చెప్పాడు. వారిచ్చిన సంపదలో కొంతైనా వారికి నివేదింపనివాడు దొంగ. వారికి నివేదించి భుజించేవాడు సకల పాపాలనుండి విడువబడుతాడు అని కూడా బోధించాడు.

ఇష్టాన్ భోగాన్ హి వో దేవా దాస్యన్తే యజ్ఞభావితాః ।
తైర్దత్తా న ప్రదాయైభ్యో యో భుంక్తే స్తేన ఏవ సః ॥ 12

అర్జునా! ప్రాణికోటి పుట్టుకకు కారణం అన్నం. అన్నం వర్షం వల్ల లభిస్తుంది. ఆ వర్షం యజ్ఞం వలన కురుస్తుంది. ఆ యజ్ఞం ధనసంపాదన వల్ల కలుగుతుంది. ఆ సంపాదన శరీరం వలన కలుగుతూ ఉంది. ఆ శరీరం ఆత్మ వల్ల కలుగు తుంది. కనుక అన్నం వలన ప్రాణి– ప్రాణి వల్ల అన్నం అనే చక్రం తిరుగుతూ ఉంది. ఇదే సంసారచక్రం– జగచ్చక్రం అని అంటారు. దీన్ని అనుసరించాల్సిందే. అంటే కర్మను చేసి తీరా ల్సిందే. కర్మచేస్తేనే చిత్తశుద్ధి కలుగుతుంది. దానిమూలాన్నే రాగద్వేషాలు నశిస్తాయి.

అప్పుడు జ్ఞానయోగం అనుష్ఠించడానికి అర్హత కల్గు తుంది. జ్ఞానులయిన జనకమహారాజువంటి రాజర్షులు కూడా నిష్కామకర్మయోగాన్నే అనుష్ఠించారు. వేయేల? ముల్లోకాల్లో నేను చేయాల్సిన కర్తవ్యమంటూ ఏదీ లేకున్నా లోకక్షేమం కోసం నేను కర్మలను చేస్తూనే ఉన్నాను. ఎందుకోసం? నేనే కర్మలను చేయకపోతే 'కృష్ణుడే చేయని' కర్మ మనకేల? అని జనులుకూడా కర్మలను వదలుకొని సోమరులవుతారు. చెడి పోతారు. వారి కటువంటి బుద్ధి పుట్టకుండా ఉండటానికి నేను కర్మలను చేస్తున్నాను.

శ్రేయాన్ స్వధర్మో విగుణః పరధర్మాత్స్వనుష్ఠితాత్ ।
స్వధర్మే నిధనం శ్రేయః పరధర్మో భయావహః ॥ 35

అర్జునా! నీ ధర్మాన్ని నువ్వు ఆచరించు. పరధర్మాన్ని ఇంతకంటే చక్కగా నిర్వహించగల్గినా దానికి దూరంగా ఉండు. నీ ధర్మనిర్వహణలో మరణించినా మేలే. పరధర్మం భయంకర మైంది– అని అంటూండగానే సందేహనివారణకై ఇలా అడుగు తున్నాడు అర్జునుడు.

కృష్ణా! మానవులు పాపమాచరించటానికి హేతువేమి? పాపమని తెలిసినప్పటికీ ఎందుకు చేస్తున్నారు? ఏ శక్తి వారిని ప్రేరేపిస్తున్నది? పాపం చేయకుండా ఉండే మార్గం లేదా?

ఆ మాటలు విని గీతాచార్యుడు ఇలా అంటున్నాడు.

అర్జునా! మానవుడు పూర్వజన్మలో చేసిన పాప కర్మల వల్ల రజోగుణం వృద్ధిచెంది, కామక్రోధాది వాసనల్ని జీవునిలో పుట్టిస్తాయి. వాటి ప్రేరణతో జీవుడు పాపాచారాల్ను చేస్తాడు. కామం, క్రోధం– ఈ రెండే అన్ని పాపాలకు మూలకారణం. అగ్నిని పొగకప్పినట్లు, అద్దానికి దుమ్ముపట్టినట్లు, గర్భమం దున్న పిండాన్ని మావి ఆవరించినట్లు, కామాది దుర్గుణాలు జ్ఞానాన్ని కప్పివేస్తున్నాయి.

ధూమేనావ్రియతే వహ్ని ర్యథాఽఽదర్శో మలేన చ।
యథోల్బేనావృతో గర్భః తథా తేనేద మావృతమ్ ॥ 38

ఆవృతం జ్ఞానమేతేన జ్ఞానినో నిత్యవైరిణా ।
కామరూపేణ కౌన్తేయ దుష్పూరేణానలేన చ ॥ 39

ఈ కామం ఎన్నటికీ తీరని దాహం. ఇది జ్ఞానిని పతితున్ని చేస్తుంది. కనుక అర్జునా! ఈ కామక్రోధాలను పారద్రోలి తన నిజస్వరూపాన్ని తెల్సుకొని, ఇంద్రియాలకు లొంగకుండా మనసును బుద్ధి అధీనంలో ఉంచి జీవుడు సంసార సముద్రం దాటాలి. కామాన్ని కర్మయోగం వల్లనే "జయింప శక్యం" అని తెలుసుకో అన్నాడు కృష్ణపరమాత్మ.

శ్రీకృష్ణార్పణమస్తు.

# శ్రీలక్ష్మీనారసింహస్వామి క్షేత్రం, అంతర్వేది

- డా॥ చల్లా సత్యవాణి

మన దేవాలయాలు

'సీతాయా గంగాయా స్సాగరస్యచ
తయోర్మధ్య గతా భూమీ'రంతర్వేదీ' తి విశ్రుతా'

ఆంధ్రప్రాంతంలోని నారసింహక్షేత్రాలలో అంతర్వేది క్షేత్రం ప్రత్యేక ప్రాశస్త్యం సంతరించుకోవడానికి గల కారణం ఇది సాగరసంగమ స్థితమైనది. సహజంగా సంగమ క్షేత్రాలు శివక్షేత్రాలుగా ప్రసిద్ధి చెందాయి. అయితే ఈ అంతర్వేది అలాకాకుండా ప్రధాన వైష్ణవక్షేత్రంగా విరాజిల్లడం విశేషం. బ్రహ్మపురాణాంతర్గత గౌతమ మాహాత్మ్యం అధ్యాయంలో వాసిష్ఠా గౌతమీ సాగర సంగమమాహాత్మ్యం 'అంతర్వేది పుణ్యక్షేత్రం' గురించిన వివరాలు తెలుస్తున్నాయి. ఇక్కడి క్షేత్రపాలకుడు పార్వతీ సమేత నీలకంఠేశ్వరులు. మూలమూర్తి శ్రీలక్ష్మీనరసింహ స్వామి, అమ్మవారు శ్రీరాజ్యలక్ష్మి తాయారు, పూజావిధానం వైఖానస ఆగమసిద్ధాంతం.

## స్థల పురాణం

'అంతర్వేది మాహాత్మ్యం' పురాణ గాథననుసరించి చూస్తే గోహత్యా పాపవిమోచనము కొరకు గంగాది సర్వ తీర్థాలతో తుల్యమైన పవిత్ర గోదావరీ నదిని గౌతముడు గోష్పాద క్షేత్రమైన కొవ్వూరునకు తీసుకొని రాగా, సప్తమహర్షులు ఆ నదిని ఏడు పాయలుగా విభజించి, సాగరమున సంగమింపజేసిరి. సప్త ఋషులలో ప్రధానుడైన బ్రహ్మర్షి వసిష్ఠుడు అరుంధతీ సమేతుడై గౌతమీ గోదావరీ శాఖను సముద్ర సంగమింపజేసి ఈ తీరంలోనే ఆశ్రమాన్ని ఏర్పరచుకుని తాను గావించిన శివాపచార నివారణార్థం అంతర్వేది క్షేత్రము (వసిష్ఠునిచే కొని తేబడిన నదీ శాఖకు సముద్రానికి మధ్యగల ప్రదేశం)నందు యజ్ఞశాలగా చేసి వేదోక్తంగా మహారుద్రయాగంజేసి పార్వతి నీలకంఠేశ్వరుల విగ్రహాలను ప్రతిష్ఠించి, నిష్కృతి పొందిన ప్రాంతం గనుక ఇది 'అంతర్వేది'గా పేరొచ్చింది.

అంతర్వేది నారసింహక్షేత్రంగా ప్రాధాన్యత సంతరించుకోవడానికి గల కారణాలు పరిశీలిస్తే, పూర్వము హిరణ్యాక్షుని కుమారుడైన రత్నలోచనుడు ఈశ్వర కటాక్షము కోరి వసిష్ఠా గౌతమీ గోదావరినదీ తీరంలో రాతి చూర్ణములు భక్షిస్తూ పదివేల సంవత్సరాలు ఘోరతపస్సు చేయగా నీలకంఠుడు ప్రత్యక్షమై వరము కోరుకోమనగా, రత్నలోచనుడు ఈ విధంగా కోరాడు.

'యుద్ధసమయంలో తన దేహమునుండి స్రవించిన రక్త బిందువులు భూమిపై పడి ఎన్ని ఇసుక రేణువులు రక్తంతో తడుస్తాయో అన్ని సంఖ్యలలో బలపరాక్రమములుగల వీరులైన రాక్షసులుద్భవించి యుద్ధకాలంలో తనకు సహకరించి అనంతరం తనదేహంలో విలీనమగునట్లు' వరం కోరగా భోళా శంకరుడు 'తథాస్తు' అని అంతర్ధానం చెందాడు.

అది మొదలు శివ వర బలగర్వితుడైన రత్నలోచనుడు యుక్తాయుక్తములు విస్మరించి, ఆ ప్రాంతంలో యజ్ఞయాగాది క్రతువులను ధ్వంసంచేస్తూ, బ్రాహ్మణ గోహత్యలు జేస్తూ, వేదాధ్యయనములను అవరోధిస్తూ, లోకకంటకుడయి సంచరించేవాడు. తపోబల సంపన్నుడైన విశ్వామిత్రుని ప్రేరణతో రత్నలోచనుడు వసిష్ఠ ఆశ్రమంపై దండెత్తి, వశిష్ఠుని నూరుగురి పుత్రులను వధించగా విషయం తెలిసిన వశిష్ఠుడు భార్య అరుంధతిని ఓదార్చుతూ, శ్రీహరిని ధ్యానించగా స్వామి శ్రీదేవి, భూదేవి సమేతుడైన నారసింహ దివ్యమంగళ విగ్రహంగా ప్రత్యక్షమై వసిష్ఠుని అభీష్టంమేరకు రత్నలోచనుని సంహరించెను. లోకకంటకుడైన దానవాధముని సంహరించి



లోకకల్యాణం గావించిన ఈ క్షేత్రం 'వసిష్ఠాగౌతమీ గోదావరి నది' అనే పేరుతో ప్రఖ్యాతమై, ముల్లోక వాసులకు పవిత్ర క్షేత్రంగా విరాజిల్లుతుందని వసిష్ఠుని ఆశీర్వదించగా, వసిష్ఠుని అభీష్టం మేరకు తాను ఈ క్షేత్రంలో వసించి లోకరక్షణ గావింతునని, తనను ప్రతిష్ఠించుటకు సన్నద్ధుడవు కమ్మని స్వామి అంతర్ధానమయ్యెను.

శ్రీలక్ష్మీనరసింహ ప్రతిష్ఠా కార్యక్రమమునకు శంకరుడు, సూర్యచంద్రులు, దేవేంద్రాదులు, అష్టదిక్పాలకులు, దేవదుందుభులు మ్రోగిస్తుండగా, గంధర్వుల గానంతో, కిన్నెరలు నృత్య మాడుతుండగా మహర్షులు సామగానాలు సల్పుతున్న సమయంలో శ్రీలక్ష్మీనరసింహ స్వామివారిని నవరత్నఖచితమైన దివ్యసింహాసనంపై వసిష్ఠమహర్షి ప్రతిష్ఠించెనని పురాణగాథ.

## క్షేత్ర ప్రాశస్త్యం

అంతర్వేది క్షేత్రంలోని విశేషస్థలాలలో సముద్రము, సాగర సంగమము, వశిష్ఠగౌతమీనది గురించి ముందుగానే వర్ణించడమైనది. మిగిలినది చక్రతీర్థం.

## చక్రతీర్థం

లోకకంటకుడైన రత్నలోచనుని సంహరించిన పిమ్మట స్వామి చక్రాయుధమును కడిగిన తీర్థమును చక్రతీర్థమని ప్రసిద్ధి కెక్కినది. ఇందు స్నానమాచరించిన వారికి సకలదోషనివారణ కలిగి పుణ్యలోకము సంప్రాప్తించునని ప్రతీతి.

## క్షేత్ర సందర్శన చేసిన మహానుభావులు

అంతర్వేది పుణ్యక్షేత్రాన్ని ఎందరో పురాణపురుషులు దర్శించి తరించినట్లు పురాణాల ద్వారా తెలియుచున్నది.

త్రేతాయుగంలో శ్రీరామచంద్రులు, సీతమ్మవారు, లక్ష్మణ, హనుమత్ సహితంగా తన గురువైన విశ్వామిత్రుని ఆశ్రమానికి వచ్చి కౌశిక సాగరసంగమయమున శివలింగ ప్రతిష్ఠ గావించి, తమ వంశగురువగు వశిష్ఠాశ్రమమునకు అంతర్వేది క్షేత్రానికి వేంచేసి, సాగరసంగమంలో స్నానమాచరించి దానధర్మాలు చేసి నీలకంఠుని సేవించి, శ్రీలక్ష్మీనరసింహస్వామిని దర్శించి, మూడు అహోరాత్రులు అంతర్వేదిలో నివసించెనని స్థలపురాణములో తెలియుచున్నది.

ప్రధాన ప్రవేశ ముఖద్వారగోపురంనుంచి ఆలయం లోనికి ప్రవేశించగానే బలిపీఠం, ధ్వజస్తంభందాటి బేడా మండపంలో ప్రవేశిస్తాము. స్వామివారికి ముందుగా ప్రదక్షిణం చేసి ప్రాకారదేవతల ఆశీర్వాదాలు పొందాలి.

ఆలయ ప్రవేశద్వారం నుండి బేడామండపంలో ప్రవేశించిన భక్తులు ఉత్తరంవైపుకి మళ్ళి ప్రదక్షిణ ప్రారంభిస్తుంటే ముందుగా ప్రాకారదేవతలను తూర్పు ముఖంగా వేంచేసిన తాయారుఅమ్మవారిని దర్శించి దీవెనలు పొందాలి.

అచటి నుండి ఉత్తరద్వారం దాటి దక్షిణాభిముఖంగా ఉన్న రంగనాయకస్వామిని దర్శించి, ముందుకు నడిచి పశ్చిమాభిముఖంగా ఉన్న సంతానగోపాల స్వామిని దర్శించాక ముందుకి నడిస్తే తూర్పు ద్వారం వస్తుంది.

అదిదాటి ముందుకి వెళ్ళి కేశవస్వామి సన్నిధిలో స్వామి వారి ఆశీస్సులు పొంది దక్షిణంవైపుకు వెళ్ళాలి. ముందుగా



వచ్చేది స్వామివారి వంటశాల, తదనంతరం ఆళ్వార్ల సన్నిధి, తరువాత చతుర్ముఖ ఆంజనేయస్వామిని దర్శించి దక్షిణద్వారం దాటి నైఋతిమూల తూర్పుముఖంగా వేంచేసిన శ్రీరాజ్యలక్ష్మి తాయారు అమ్మవారి సన్నిధిలో ఆశీర్వాదం పొంది ఆలయ ముఖమండపంలో ప్రవేశించాలి.

ఆలయముఖమండపంలో దక్షిణంవైపు యాగశాల, ఉత్తరంవైపు విఖనసాచార్య స్వామివారిని దర్శించుకుని రంగ మండపంలో ఉత్తరదిశలో గరుడాళ్వారు, దక్షిణంలో ఆంజనేయ స్వామిని దర్శించాలి.

## ఉత్సవాలు

అంతర్వేదిలో వెలసిన శ్రీలక్ష్మీనరసింహస్వామివారికి ప్రతీరోజు అభిషేకం జరగడం విశేషం. నిత్యాభిషేకం జరిగే అతికొద్ది వైష్ణవాలయాల్లో అదొక ఆలయం. అంతర్వేది క్షేత్రంలో కొలువైన శ్రీరాజ్యలక్ష్మి సమేత శ్రీలక్ష్మీనరసింహస్వామివారి బ్రహ్మోత్సవాలు ప్రతి సంవత్సరం మాఘమాసంలో శుక్లపక్ష సప్తమి మొదలు పౌర్ణమి వరకు కన్నుల పండుగగా జరుగు తాయి.

కల్యాణోత్సవాలలో భాగమే మాఘ శుద్ధఏకాదశి (భీష్మ ఏకాదశి)నాడు స్వామివారి రథోత్సవము వేడుకరోజు అంతర్వేది తీర్థంగా ప్రసిద్ధిచెందినది.

మాఘ శుద్ధసప్తమి (రథసప్తమి) మొదలు బహుళ పాడ్యమివరకూ పదిరోజులపాటు జరిగే ఉత్సవాలలో స్వామి వారికి గరుడోత్సవం, గ్రామోత్సవము, శుద్ధదశమినాడు రాత్రి కల్యాణోత్సవము, అదేరోజు రాత్రి వేదస్వస్తితో సదస్సు, ఏకాదశి రోజున రథయాత్ర, పౌర్ణమినాడురాత్రి ధ్వజావరోహణం ప్రధాన ఉత్సవఘట్టాలు. మాఘ బహుళ పాడ్యమినాడు సాయంత్రం గ్రామోత్సవానంతరం తిరుమంజనం, పుష్పయాగంతో ఉత్సవాలు ముగుస్తాయి.

పౌర్ణమినాడు పుష్పక వాహనంపై ఊరేగి శ్రీవారి 'చక్రవారి' సముద్రస్నానం ఒక ప్రత్యేకత సంతరించుకుంది. స్వామివారికి జరిగే చక్రస్నానం సందర్భంగా అసంఖ్యాకభక్తులు కూడా స్నానం అచరించి తరిస్తారు.



దీనివల్ల సర్వరోగాలు, పాపాలు నశిస్తాయని, ఆయు రారోగ్య, అష్టైశ్వర్యాలు సిద్ధిస్తాయని భక్తుల ప్రగాఢ విశ్వాసం.

## క్షేత్ర మాహాత్యం

అంతర్వేది క్షేత్రంలో వేంచేసిన శ్రీలక్ష్మీనరసింహస్వామిని దర్శించవచ్చిన భక్తులకు, ఆటంకముల వల్ల రాలేని వారికి, దర్శించాలని మనస్సులో అనుకున్న వారికి సమానమైన ముక్తిని ప్రసాదించే ఈ స్వామి మాహాత్మ్యము వర్ణనాతీతము.

ఈ క్షేత్రంలో స్వామిని దర్శించినవారికి సకలఅభీష్టాలు సిద్ధిస్తాయంటారు. ఈ క్షేత్రమాహాత్మ్యంలో నిగూఢంగా తెలియ వచ్చినదేమనగా ఈ క్షేత్రం చుట్టూ రెండు మైళ్ళ పరిసర ప్రాంతమంతయును విశేషమాహాత్మ్యముతో నిండుకొని, 'నార సింహక్షేత్రమని' 'ముక్తి క్షేత్రమని' ప్రసిద్ధి గాంచినది.

ఇంత మహోన్నతమైన వైభవాన్ని సంతరించుకుని భూతలవైకుంఠంగా ప్రసిద్ధిచెందిన అంతర్వేదిక్షేత్రము అంతరా లకు అతీతంగా, ద్వైత, విశిష్టాద్వైత, శాక్తేయుల సహితముగా అపురూప సమష్టి, పవిత్రయాత్రాస్థలంగా సమైక్యతతో సేవి స్తున్న సంగమక్షేత్రం దర్శించి భక్తులు తరించగలరు.

గృహలక్ష్మి

# అష్టలక్ష్ములు మిమ్మల్ని ఆశీర్వదిస్తారు

- శ్రీమతి ఎ.లక్ష్మి

ఈ సృష్టిలో ప్రతిదానికి ఓ లక్షణం ఉంది. ఆ లక్షణాలే ఉనికినీ, పోషణను ఇస్తాయి. ప్రతి వస్తువుకు దాని స్వాభావిక లక్షణమే దాని ఐశ్వర్యం.

ఈ ప్రపంచమనే సముద్రం నుండి ధనధాన్యాదుల కోసం మనలోని సుగుణాలు, (దేవతలు), దుర్గుణాలు (రాక్షసులు) చేస్తున్న మథనమే క్షీరసాగరమథనం, ఆ మథనంలో ఎన్నో చేదు అనుభవాలు (హాలాహలం) ఎదురవుతుంటాయి. ఆ సమయంలో భగవంతుని శరణుని కోరే మనలను ఆయన హాలాహలం మింగే శివుని రూపంలో వచ్చి అనుగ్రహిస్తుంటాడు. ఇలా ఆ తల్లి అనుగ్రహానికి ఎంతో సాధన, శ్రమ అవసరం. అయితే ఆ తల్లి తన నామజపం చేసినంత మాత్రానికే కటాక్షిస్తానని చెప్పింది.


మన్నామస్మరతాం లోకే దుర్లభం నాస్తి చింతితమ్
దదామి సర్వమిష్టార్థం లక్ష్మీతి స్మరతాం ధ్రువమ్
- స్కాందపురాణం

అంటే, "నామజపం చేసేవారికి అసాధ్యమైనదంటూ ఏమీ లేదు, 'లక్ష్మీ' అనే నామాన్ని జపించేవారికి, వారు కోరుకున్నవన్నీ ప్రసాదిస్తాను" అని అర్థం. సర్వసంపదలకు అధిష్ఠాతృ దేవత, శాంతం, ఇంద్రియ నిగ్రహం, సర్వ మంగళరూపిణి, లోభం, మోహం, కామం, రోషం, అహం కారం, మదం వంటి గుణా లేమీ లేని చల్లని తల్లి, తన బిడ్డలను కేవలం నామ జపంతోనే కరుణించగలనని చెబుతుంది. ఆ తల్లి నామాన్ని జపించలేని కడు పేదలను కూడా కాపాడే చల్లని తల్లి లక్ష్మీదేవి.

ఆ సర్వాంతర్యామికి ప్రాణసమానురాలైన ఆ 'తల్లి' వైకుంఠంలో మహాలక్ష్మిగా విష్ణుసేవా పరాయణురాలు, గృహాలలో గృహలక్ష్మి, స్వర్గంలో స్వర్గలక్ష్మి, రాజ్యాలలో రాజ్యలక్ష్మి సర్వప్రాణులలో వెలుగొందే తేజోరూపం లక్ష్మీ రూపమే. పుణ్యవంతులలో కీర్తిగా, రాజులలో ప్రభగా, వ్యాపా రులలో వాణిజ్యరూపంగా ఉండే ఆ తల్లి అన్నిచోట్లా దయా రూపిణే.

ఆ తల్లిని అష్టలక్ష్మీ రూపాలతో పూజించే సంప్రదాయం మనది. ఆ తల్లి రూపాలు అనంతమైనప్పటికీ ఆ తల్లి రూపాలను 1)ఆదిలక్ష్మి 2)విద్యాలక్ష్మి, 3)ధనలక్ష్మి, 4)ధాన్యలక్ష్మి, 5)ధైర్యలక్ష్మి, 6)గజలక్ష్మి, 7)విజయలక్ష్మి 8)సంతానలక్ష్మి అంటూ ఎనిమిది రూపాలుగా పూజిస్తుంటాం.

**ఆదిలక్ష్మి:** లక్ష్మీ మూర్తులలో ప్రధానమైన పరాశక్తిరూపంగా ఆదిలక్ష్మిని వ్యవహరిస్తుంటారు, సర్వవ్యాప్తమై, అన్నిరకాలైన ఐశ్వర్యరూపిణిగా ఆ తల్లి సాక్షాత్కరిస్తుంది. పద్మంతో కూడిన





విద్యతో సమానమైన అలంకారం లేదు

అభయముద్ర, వరదముద్ర, మంగళకర మైన ఉత్తమ సాముద్రిక లక్షణాలతో ఆ తల్లి దర్శన మిస్తుంటుంది. అందుకే ఈ లక్ష్మీ రూపాన్ని ఆదిలక్ష్మి అంటారు.

**విద్యాలక్ష్మి:** ఈ లక్ష్మిని ఐశ్వర్యలక్ష్మి అనికూడా అంటారు. అభయ, వరద ముద్రలతో, మరో రెండు చేతులలో పద్మాలతో విద్యాలక్ష్మి దర్శనమిస్తుంటుంది.

బుద్ధి, జ్ఞానాలతో పాటూ, ఈ తల్లి సమస్తవిద్యలను ప్రసాదిస్తుంది.

**ధనలక్ష్మి:** అభయవరముద్రలతో, రెండు తామరలతో, మిగి లిన నాలుగు చేతులలో విల్లు, సువర్ణకలశం, కమలం, శంఖ చక్రాలతో దర్శనమిచ్చే ధనలక్ష్మి సద్యోగాలనిచ్చే ధనానికి అధిష్ఠాన దేవత.

గోధనం, భూధనం అంటూ సమస్తసంపదలు ఈ తల్లి ప్రసాదాలు.

**ధాన్యలక్ష్మి:** అభయ, వరదముద్రలతో, రెండు తామర పువ్వులు గద, చెరకుగడ, సస్యం, అరటిగెలను చేతులతో ధరించి దర్శనమిచ్చే ఈ తల్లి సమస్త సస్యప్రదాయిని.

సమస్త భూత కోటికి ఆధారం అన్నం, ఆ అన్నాన్ని అధిష్టించిన దేవత ధాన్యలక్ష్మి స్వాహా, స్వధా రూపిణిగా పితృ దేవతలకు కూడ అన్నాన్ని అందిస్తున్న ఆ తల్లి కరుణ లేనిదే జీవజాలం లేదు. ఈ భూప్రపంచంలోని సమస్త సస్య, అరణ్య, నదీ నదాలు ఆ తల్లికి ప్రతిరూపాలే.

**ధైర్యలక్ష్మి:** ఈ తల్లినే వరలక్ష్మి అని కూడ కొలుస్తుంటారు. ఏ పని చేయాలన్నా ధైర్యం అత్యంతావశ్యకం. ఒక పని చేయాలని అనుకున్న తర్వాత చివరి దాకా, దాన్ని సఫలం చేసుకునేందుకు, తప్పనిసరిగా కావల్సింది ధైర్యం. ఆ ధైర్య గుణానికి అధిష్ఠాన దేవి ధైర్యలక్ష్మి.

**గజలక్ష్మి:** అభయ, వరద ముద్రలలో రెండు తామర పువ్వులతో దర్శనమిచ్చే గజలక్ష్మి, మనయింటిని, సంపదలతో నింపే కరుణామయి.

కొలనులో పద్మంపై ఆసీనురాలై ఏనుగుల చేత అభిషే కించబడుతూ దర్శనమిచ్చే ఈ తల్లి ప్రతిరూపాన్ని గృహ ద్వారానికి పైన ఉంచితే, ఆ ఇల్లు అష్టైశ్వర్యాలతో కళకళ లాడుతుందని శాస్త్రం.

**విజయలక్ష్మి:** అభయవరముద్రలు, తామరపువ్వు, శంఖ చక్రాలు, డాలుతో దర్శనమిస్తున్న ఈ తల్లి, మనం అనుకున్న రంగాలలో విజయాన్ని అనుగ్రహిస్తుంది. ప్రతి ఒక్కరి లక్ష్యం విజయమే.

**సంతానలక్ష్మి:** ఒడిలో బిడ్డతో, అభయ ముద్రతో, కత్తి, డాలు, రెండు కలశాలతో సాక్షాత్కరించే సంతానలక్ష్మి కరుణ లేకపోతే ఈ సృష్టికి మనుగడే లేదు. అందుకే అందరూ ఆ తల్లి కరుణ కోసం ప్రార్థిస్తుంటారు.


మానవజాతి మనుగడకు ప్రధానమైన సంపదలుగా, ఈ ఎనిమిదిలక్ష్ములను శాస్త్రం అందించింది. ఆ అష్టలక్ష్ముల అనుగ్రహం మనందరికీ లభించుగాక.









భాగవత కథాసాగరం

# త్రిపురాసుర సంహారము

- డా॥ వైష్ణవాంఘ్రి సేవకదాస్

భాగవత శ్రేష్ఠుడైన ప్రహ్లాదుని చరితాన్ని, హిరణ్య కశిపుని వధను, నృసింహుని లీలలను వర్ణించిన నారదముని వాటిని శ్రద్ధగా వినేవాడు చింతారహితమైన భగవద్ధామానికి నిశ్చయంగా చేరుకుంటాడని చెప్పారు. తరువాత ఆయన ప్రహ్లాద చరితాన్ని అత్యంత శ్రద్ధతో వినుచున్న ధర్మరాజును ప్రోత్సాహ పరుస్తూ-

"ధర్మరాజా! దేవదేవుడైన శ్రీకృష్ణుడు సామాన్య మానవునిలాగా మీ ఇంట్లో వసించే కారణంగా మీరు (పాండవులు) ఎంతో భాగ్యవంతులు. ఈ విషయం గురించి చక్కగా తెలుసును కాబట్టే మహామునులు, ఋషులు మీ ఇంటికి ఎల్లప్పుడు వస్తుంటారు. సాధువుల దివ్యానంద సుఖహేతువైన శ్రీకృష్ణుడే మీకు పరమ మిత్రుడు, హితైషి, చుట్టము, ఆత్మ అయి యున్నాడు. నిజానికి ఆతడు మీకు ఆరాధ్యుడే అయినప్పటికిని ఒకప్పుడు ఆ దేవ దేవుడు మీకు సేవకునిగా, మరొక్కపుడు గురువుగా వర్తిస్తూ ఉంటాడు. బ్రహ్మరుద్రాది మహనీయులే శ్రీకృష్ణతత్త్వాన్ని పూర్తిగా, యుక్తముగా వర్ణింపలేరు. మౌన ధ్యాన భక్తివైరాగ్యయుక్తులైన మహామునులచే భక్తరక్షకునిగా అర్చింపబడే ఆ దేవ దేవుడు మీ యెడ ప్రసన్నుడగు గాక!" అని పలికాడు.

ఈ నారద ధర్మరాజ సంవాదము సాక్షాత్తుగా శ్రీకృష్ణుని సన్నిధిలోనే జరిగింది. ధర్మరాజు శ్రీకృష్ణునికి అగ్రపూజ చేసిన అద్భుతమైన సందర్భములో జరిగిన సంవాద వివరాలు ఇలా ఉన్నాయి. ఈ సంవాదము శ్రీమద్భాగవతములోని సప్తమ స్కంధములో చర్చించబడింది.

మాయావియైన మయదానవుడు శివుని యశస్సును తగ్గించగా ఆ పరిస్థితిలో శ్రీకృష్ణుడే మహాదేవుని రక్షించాడని నారదముని చెప్పారు. ఆ విషయం గురించి ధర్మరాజు కుతూహలాన్ని కనబరచగా నారదుడు త్రిపురాసుర సంహార విషయాన్ని వివరించారు.

కృష్ణకరుణచే శక్తి సంపన్నులైన దేవతలు దానవులను ఓడించగా వారు మయదానవుని ఆశ్రయించారు. అపుడు మయుడు స్వర్ణ, రజత, లోహ నిర్మితాలైన మూడుపురాలను నిర్మించి ఇచ్చాడు.

అవి అసాధారణ వస్తు సామగ్రిని కలిగినవై విమానాలను పోలి ఉన్నాయి. త్రిపురాలను పొందిన అసురులు బలోన్మత్తులై తిరిగి ముల్లోకాలను ధ్వంసం చేయడం మొదలు పెట్టారు. త్రిపుర ప్రభావం వలన అసురులు దేవతలకు అగోచరులయ్యారు. అనూహ్యంగా కలిగిన విపత్తుకు చింతాగ్రస్తులైన దేవతలు శివుని దగ్గరకు వెళ్ళి తమ కష్టాలను వివరించారు. తమను దయతో కాపాడమని ప్రార్థించారు.

అపుడు పరమ శక్తిమంతుడైన శివుడు వారికి అభయమిచ్చి అసురులు వసించియున్న త్రిపురాలపై బాణవర్షాన్ని కురిపించాడు. శివుని బాణాలకు త్రిపురాలు కప్పబడిపోయాయి. అందులోని అసురులు అసువులు కోల్పోయారు. తన శక్తికే సవాలుగా పరిణమించిన ఈ పరిస్థితిని చూసిన మయదానవుడు ప్రాణాలు కోల్పోయిన అసురులందరినీ తాను నిర్మించిన అమృతకూపంలో పడేసాడు.

అమృతస్పర్శ కలగగానే అసురులందరు పునర్జీవితులయ్యారు. అమృత ప్రభావంతో వారు వజ్రాయుధానికైనా చెదరని దేహాలతో బయటకు వచ్చారు. దానితో శివుడు చింతామనస్కుడయ్యాడు. అది చూసిన విష్ణుభగవానుడు మయదానవుడు సృష్టించిన ఉత్పాతాన్ని ఆపటానికి ఉపాయాన్ని ఆలోచించాడు.

ఆ ఉపాయం ప్రకారం విష్ణువు గోరూపాన్ని దాల్చాడు, బ్రహ్మ గోవత్సరూపాన్ని దాల్చాడు. ఇద్దరు కలిసి త్రిపురాలలో ప్రవేశించగా విష్ణువు అమృతకూపంలోని అమృతాన్ని పూర్తిగా త్రాగేసాడు. అసురులు గోవత్సాన్ని, గోవును చూసినప్పటికిని భగవన్మాయచే మోహితులై వాటి కార్యాన్ని ఆపలేదు. ఆవు దూడలు అమృతాన్ని త్రాగేసాయని మయుడు వినగానే విధిని ఎవ్వరూ తప్పించలేరని అసురులతో అన్నాడు.

అపుడు దేవదేవుడైన శ్రీకృష్ణుడు స్వశక్తి ద్వారా రథము, సారథి, ధ్వజము, అశ్వములు, గజములు,



స్పర్ధతోనే విద్య వర్ధిల్లుతుంది

ధనుర్బాణములు, కవచమువంటి సమస్తాన్నీ శివునికి సమకూర్చాడు. ఆ విధముగా సకలసన్నద్ధుడైన శివుడు దానవులతో పోరాడడానికి సన్నద్ధుడై బాణాలను సంధించి మధ్యాహ్నవేళ త్రిపురాలను దగ్ధం చేసాడు.

అపుడు దేవతలు, ఋషులు, పితృదేవతలు, సిద్ధగణము, ఇతర మహనీయులు జయజయధ్వనులు చేసి శివుని పై పుష్పవృష్టి కురిపించారు. అప్సరసలు ఆనందంతో నృత్యం చేసారు.

ఆ విధంగా త్రిపురాలను నశింపజేసి శివుడు త్రిపురారిగా ప్రసిద్ధి చెందాడు. తరువాత అతడు బ్రహ్మాది దేవతలచే పూజితుడై తన లోకానికి వెళ్ళిపోయాడు. శ్రీకృష్ణుడు కావించిన అద్భుతమైన లీలలను ప్రామాణికుల నుండి వినడము వలన ఎల్లరు పునీతులౌతారని నారదముని ధర్మరాజుతో పలికారు.

ప్రహ్లాదుని వృత్తాంతాన్ని, త్రిపుర నాశాన్ని నారదుని ద్వారా వినిన ధర్మరాజు ఆ మహనీయుని ద్వారా మానవుని సాధారణ ధర్మాన్ని, వర్ణాశ్రమ ధర్మాలను కూడా వినాలనుకున్నాడు. నారదముని మానవులకు పరమగురువని ధర్మరాజుకు తెలుసు. మానవులకు భక్తియోగాన్ని నేర్పడం కొరకే నారదముని భక్తి సూత్రాలను పొందుపరిచారు. నిజానికి మానవుడు

## వైకుంఠపాళి
## :: 61 - సమాధానాలు ::

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| | 1 శృం | 2 గ | | 3 ద | శ | 4 కం | ఠు | డు |
| 5 ఆ | | య | | ర్శ | | ద | | |
| 6 ము | క్తి | | 7 దా | న | ము | | 8 బ్ర | హ్మ |
| క్త | | 9 క | | ము | | 10 ప్రా | | |
| 11 మా | రీ | చు | డు | | 12 స | ప్త | గి | 13 రి |
| ల్య | | డు | | 14 జ | | ము | | క్క |
| 15 ద | త్త | | 16 అ | మ | ల | | 17 క | ల |
| | | | | ద | | | | తే |
| 18 మా | ద్రి | | 19 అ | గ్ని | సం | భ | వు | డు |

ధర్మము గురించి, పరిపూర్ణ జీవితము గురించి నారదముని యొక్క గురుశిష్యపరంపరలోనే ఉపదేశాలను పొందాలి. ధర్మరాజు జిజ్ఞాసను చూసి ఆనందించిన నారదముని తొలుత సర్వజీవరక్షకుడైన శ్రీకృష్ణునకు నమస్కరించి తాను నారాయణుని నుండి వినినట్టి సనాతన ధర్మాన్ని వివరించడము మొదలుపెట్టారు.

దేవదేవుడైన శ్రీహరియే సమస్త వేదజ్ఞానసారము, సమస్త ధర్మమూలము, పరమప్రామాణికులకు స్మృతియైయున్నాడు. దీనినే ధర్మముగా స్వీకరించాలి. దీని ఆధారంగానే మనస్సు, ఆత్మ, దేహముతో పాటు సమస్తము సంతుష్టి చెందుతుంది. సత్యము, దయ, తపస్సు (ప్రత్యేక దినాలలో ఉపవసించడము), రోజుకు రెండుసార్లు స్నానము చేయడము, ఓర్పు, మంచిచెడు విచక్షణ, మనోనిగ్రహము, ఇంద్రియ నిగ్రహము, అహింస, బ్రహ్మచర్యము, దానము, శాస్త్రాధ్యయనము, సరళత, సంతోషము, సాధుజన సేవ, అనవసరమైన వ్యాపకాలను నెమ్మదిగా వదలి పెట్టడము, అవసరమైన కార్యాల వ్యర్థతను గమనించడము, మౌనంగా గంభీరంగా ఉండడము, వ్యర్థ ప్రసంగము చేయకపోవడము, ఆత్మానాత్మ వివేకము, జీవులందరికీ (మానవులకు, జంతువులకు కూడా) సమానంగా ఆహారాన్ని ఇవ్వడము, ప్రతిజీవుని (ముఖ్యంగా మానవుని) భగవదంశగా చూడడము, భగవత్కర్మలను వినడము, కీర్తించడము, స్మరించడము, సేవ, అర్చనము, వందనము, దాస్యము, సఖ్యము, ఆత్మనివేదనమనేవి మానవులు అనుసరింపవలసిన ధర్మాలు. ఈ లక్షణాలను కలిగిన మానవుడు దేవదేవుని ప్రసన్నుని చేయగలుగుతాడు.

భర్తను సేవించడము, అనుకూలవతిగా ఉండడము, భర్త యొక్క బంధుమిత్రుల పట్లను అనుకూలముగా ఉండడము, భర్త చేసే వ్రతాలను అనుసరించడము అనే నాలుగు నియమాలను పతివ్రతయైన స్త్రీ పాటించాలి. సాధ్వియైన స్త్రీ లోభము లేనిదై అన్ని పరిస్థితులలో సంతుష్టురాలై ఉండాలి. గృహకలాపాలను దక్షతతో నెరవేర్చగలిగి ఉండాలి. సత్యము, ప్రియమునైన వాక్కులు పలికేదిగా ఉండాలి, సావధానురాలిగా ఉండాలి, శుచి శుభ్రత కలిగి ఉండాలి. లక్ష్మీ దేవిలాగా భర్తను సేవించిన వనిత భక్తుడైన భర్తతోపాటు వైకుంఠానికి వెళ్ళి నిత్యసుఖి అవుతుందని నారదముని వర్ణించారు.





# అద్భుతమైన తృప్తి

శ్రీమతి సి.వి.సులోచనాకృష్ణ

నాకు ఊహ తెలిసినప్పటినుండి శ్రీవేంకటేశ్వరస్వామి అంటే చాలా ఇష్టం. ఎందుకంటే, మా అమ్మగారు ఎప్పుడూ వేంకటేశ్వరునికి శనివారం ఉపవాసాలు చేస్తూ, భక్తితో ప్రార్థించేది. కనుక, నాకు కూడా ఆపద్బాంధవుడు, పరంధాముడు, కల్పతరువు అయిన శ్రీవేంకటేశ్వరునిపై అధికమైన భక్తి కలదు.

ఒకసారి నేనూ, మావారు కాలినడకన తిరుమల వెళ్లాలని అనంతపురంలోనే కంకణం కట్టించుకుని బయలుదేరాము. ఎంతో ప్రయాసతో నేను నడవలేకపోయినా మేము ఆ వెంకన్న కృపతో సురక్షితంగా తిరుమల చేరాము. దారిలోనే నాకు, తీవ్రంగా జ్వరం వచ్చింది. కాలినడక భక్తులకు తొందరగా దర్శనం అవుతుందని అనుకున్నాము. దారిపొడవునా, శ్రీనివాసుని తలచుకుంటూ, ఎలాగోలా దర్శనమయ్యింది అని అనిపించుకున్నాము. కానీ, మనసులో ఏదో వెలితి, ఎక్కడో అశాంతి. తెల్లవారితే, మళ్లీ కంకణం కట్టించుకున్న దర్శనం కూడా ఉంది. ఉదయం సమయంలో రమ్మని చెప్పారు. అప్పటికీ నాకు జ్వరం తగ్గలేదు. డాక్టరు దగ్గరకు వెళ్లదామంటే సమయం లేదు. అలాగే వెళ్లాము. ఈసారి కూడా దర్శనం అంతంత మాత్రమే అయ్యింది. సాయంత్రానికంతా బయటకి వచ్చేశాము. నాకు జ్వరం వచ్చినదానికన్నా, రెండుసార్లు వెళ్లినా తృప్తిగా దర్శించుకోలేకపోయామే అన్న బాధ విపరీతమై, విరక్తితో ఏడ్చేస్తున్నాను. మావారు ఎంత ప్రాప్తమో అంత అని వేదాంతం చెబుతున్నారు. తెల్లవారితే మాకు తిరుగు ప్రయాణం.

మూడవరోజు తెల్లవారింది. ఆశ్చర్యం నాకు పూర్తిగా జ్వరం తగ్గింది. కానీ, మదిలో మాత్రం దర్శనం బాగా జరుగలేదని, అసంతృప్తి మాత్రం అలాగే ఉండిపోయింది. మేము ఆలయ ప్రాంగణంలో నడిచివస్తూంటే చూశాను, అక్కడ ఒక పెద్ద నిలువెత్తు శ్రీవేంకటేశ్వరుని విగ్రహం ఉంది. అక్కడ భక్తులంతా సామూహికంగా స్వామి సంకీర్తనలు మైమరచిపోయి పాడుతున్నారు. వారు తమతో పాటు నాకు కూడా ఆ స్వామిని గురించి గానం చేసే అవకాశం ఇచ్చారు. అప్పుడు నాకు కలిగిన ఆనందం ఆ మూలవిరాట్టుని దర్శించుకున్నా, అంత ఆనందం కలగదేమో! శ్రీమన్నారాయణుని సజలనయనాలతో నిజంగానే అద్భుతంగా దర్శించుకున్నాను. నాకు ఇప్పుడు శ్రీవేంకటేశ్వరుని బాగా దర్శించుకోలేదనే అసంతృప్తి ఇక లేదు. నేను శ్రీవేంకటేశ్వరుని కోరినట్లుగా ఆయన గర్వంగా చెప్పుకునే రీతిలో నా కోరికను తీర్చిన సర్వేశ్వరుడు, సర్వాంతర్యామి కాక మరెవరు? అతడే నిరాకారుడు, నిశ్చలుడు, సకలప్రాణికోటి సంరక్షకుడు అయిన శ్రీవేంకటేశ్వరస్వామే!! అందుకే, అందరూ ఆ గోవిందుని నామాన్ని నిత్యం స్మరించినట్లయితే, అలౌకికమైన అనుభూతిని పొందుతారు. అటువంటి అద్భుతమైన తృప్తితో మేము తిరుగుప్రయాణమై, క్షేమంగా ఇల్లు చేరాము.



"వేంకటాద్రి సమంస్థానం బ్రహ్మాండే నాస్తి కించన
వేంకటేశ సమో దేవో నభూతో న భవిష్యతి"

బ్రహ్మాండంలో వేంకటాద్రికి సమమైన పుణ్యక్షేత్రం లేదు. శ్రీవేంకటేశ్వరునికి సమానమైన దేవదేవుడు ఇదివరలో లేడు, భవిష్యత్తులో ఉండబోడు.

మహిమాన్వితమైన శ్రీవేంకటేశ్వరస్వామి వెలసిన తిరుమల క్షేత్రం ఎందరో మహాభక్తుల సేవలందుకున్నది. విభిన్న భాషలలో విభిన్న ప్రక్రియలలో తిరుమల క్షేత్రం తిరుమలేశుని వైభవం వర్ణింపబడింది.

ఆంధ్రవాఙ్మయంలో పదసాహిత్యం వలె కన్నడభాషలో కూడా హరిదాస వాఙ్మయం అత్యంత జనాదరణ మందు కొన్నది. హరిదాస వాఙ్మయంలో విఖ్యాతులైన శ్రీపాద రాయలు, వ్యాసరాయలు, పురందరదాసు, దానసాహిత్యామృతాన్ని పంచిపెట్టిన మహానుభావులు. ఈ త్రిమూర్తులు సప్తశైలక్షేత్రంలో కొంతకాలం ఉండి ఏడుకొండల స్వామి మహిమను తనివితీర గానం చేశారు.

ఈ త్రిమూర్తులలో పురందరదాసుల స్థానం విశిష్ట మైనది. పూర్వాశ్రమంలో నవకోటి నారాయణుడుగా వుండిన శ్రీనివాసనాయక, వైరాగ్య నిధిగా మారాడు. తన సంపద నంతా దానంచేసి హరికి దాసుడయ్యాడు.

"ఆదద్దెల్లా ఒళితే ఆయితు, నమ్మ శ్రీధరన సేవగే సాధన సంపత్తాయితు" అంటూ పరమార్థ జీవితాన్ని ప్రారంభించాడు. సర్వాంతర్యామి అయిన ఆ పరమాత్ముని దర్శిస్తూ ఎన్నో యాత్రలు చేశాడు. తన యాత్రలో తిరుపతి పుణ్యక్షేత్రాన్ని కూడా సందర్శించాడు. ఆ శ్రీపతి వైభవాన్ని మహత్త్వాన్ని వర్ణిస్తూ ఎన్నో కీర్తనలు రచించాడు.

శేషాద్రిలో స్వామిపుష్కరిణి మొదలగు పుణ్యతీర్థాలలో మునిగి తిరువేంకటపతిని, దర్శించిన ఈ మాయాశరీరంలో జీవుడు వుండి కూడా ప్రయోజనం లేదు అన్న భావంతో 'ఉరగాద్రి చంద్రపుష్కరిణి మొదలైన పరిపరితీర్థములలో మునిగి మునిగి తిరువెంగళప్ప శ్రీపురందరవిఠలన పొడలరియన కపట తనువినలి ఈ జీవ విద్దు ఫలవేను' అన్నాడు. స్వామి దర్శనం లభించిన తరువాత ఆనందపార వశ్యంతో –

"కండె కండె స్వామియ బేడికొండె
కండె తిరుపతి వేంకటేశన

# శ్రీవేంకటేశ్వర వైభవం-పురందరదాసులు

– కీ॥శే॥ జానమద్ది హనుమచ్ఛాస్త్రి

కరుణాత్మక సార్వభౌమన
కామితార్థగళీవ దేవన
కరుణనిధి ఎందెనిసి మెరెవవన " అని స్తుతించాడు.

*"నంబిదె నిన్న పాదవ, వెంకటరమణ నంబిదె అని వేడుకొన్నాడు– నంబిదె – నమ్మితి తిరుపతి వెంకటరమణ, నినగేతకె బారదు కరుణ నంబిదె నిన్నయ చరణ పరిపాలిస బేకో కరుణ"* అన్న కీర్తనలో వేంకటేశ్వర వైభవాన్ని అడుగడుగునా వర్ణిస్తూ ఆ దైవాన్ని దర్శించటానికి కాశీ, రామేశ్వరం నుంచి కూడా భక్తులు వస్తారని, అలా వచ్చే హరిదాసులతో కలిసి నడిచి కొండ ఎక్కడంలో ఎంతో ఆనందం ఉందన్నాడు.

పాపవినాశనంలో స్నానం చేసి హరిపాదోదకాన్ని పానం చేస్తే కోపతాపాలు తొలగి పోతాయంటూ "పాప వినాశన స్నాన హరిపాదోదకవే పాన కోపతాపగళు నిధాన, నమ్మ పురందర విఠలన ధ్యాన" అన్నాడు. ఇదే కీర్తనలో ఒకచోట 'అళగిరి' యిందలి బందా స్వామి అన్న పంక్తిలో 'అళగిరి' అన్నది కడప జిల్లాకు దగ్గరగా వున్న 'పుష్పగిరి' క్షేత్రమని సాంకేతికంగా వర్ణించాడు.

హరిదాసుడు హరికి దాసుడే కాని ఎప్పటికీ నర దాసుడు కాదని చెబుతూ ––

'వెంకటరమణ వేదాంత నిన్నయపాద
పంకజ, కండమేలె మంకు మానవర బేడిసువుదు
ఉచితవే, శంఖ చక్రాంకితనె' అన్నాడు.

*'పంకజ ముఖియరెల్లరు బందు లక్ష్మీ వేంకటరమణ నిగె ఆరుతి ఎత్తిరే'* అని తాను నమ్మిన దైవానికి నీరాజన మిచ్చాడు. తన భక్తులను బ్రోవడానికి కైవల్యాన్ని వదలి శేషాద్రి మందిరం చేరాడని వర్ణించే కీర్తనలో ఒకచోట స్వామి తీర్థది ఉదిసుతిదె సిరి మహిళె' అనడంలో స్వామి పుష్కరిణిలో లక్ష్మి

కనిపిస్తుందన్న భావం ఉంది. కాని స్థల పురాణం ప్రకారం దిగువ తిరుపతిలోని పద్మసరోవరంలో అలమేలు మంగలా కనిపించిందని చెబుతారు.

జ్ఞానోపార్జనలో అరిషడ్వర్గాలను, పంచభేదాలను జయించాలని, అలా కానివాడిని శ్రీనివాసుడు అనుగ్రహించ డని తెలియజేశారు. కామక్రోధ లోభాది దురాత్మక ఆ మహారిపుగళ జయిసదలె, భేద పంచకవు జగది అభేదన మాధవ నలి నీ తిళియదనెలె' అన్నాడు. భేదపంచకమంటే 1)జీవుడికి జడానికి, 2)జీవుడికీ జీవుడికీ, 3)జీవుడికీ దేవుడికీ, 4)జడానికీ దైవానికీ, 5)జడానికీ జడానికీ గల భేదమేనని ద్వైత వేదాంతం చెబుతుంది.

తనలోని చెడును తొలగించి, మంచిని పెంచి జన్మ రాహిత్యాన్ని ప్రసాదించమని సదా సన్నిధిలో వుండనివ్వమని ఆర్తిగా వేదుకుంటూ –



'కిటిగట్టిద కబ్బిణక్కె పుటవ హాకిసో
ఉత్కృష్ట బంగారదొళు ఎన్న సేరిసో
బట్టిగె ఉంగురవ మాడి ఎన్న ధరిసో
బహు జన్మంగళ ఎనగె బిడిసో, దయ పాలిసో' అన్నాడు.

(తుప్పుపట్టిన ఇనుమును పుటం పెట్టి మేలిమి బంగారంలో నన్ను చేర్చుకో).

లోకారాధ్యుడైన శ్రీనివాసునికి సుప్రభాతం పలుకుతూ–

'ఏళయ్య బెళగాయితు
ఏళు నారాయణనె
ఏళు లక్ష్మీరమణ
ఏళు శ్రీగిరి యొడయ వెంకటేశ
దాసరెల్లరు బందు ధూళి దర్శనగొందు".

కొండలరాయుడైన శ్రీవేంకటేశ్వరుని పురందరదాసుల వారు ఆపాద మస్తకం వర్ణిస్తూ –

"బందు నిందిహ నోడి – భూతలది వేంకట
ఇందిరెయ ఒడగూడి – ఒప్పువ నిరంతర
పొంది భజనెయమాడి – ఆనంద బేడి
త్రిదశ పూజిత త్రిభువనేశ".

పురందరదాసులవారు శ్రీవేంకటేశ్వరస్వామిని భవరోగ విముక్తుడుగా వర్ణించారు.

వైద్య బందనోడి వేంకటనెంబ
వైద్య బందనోడి
వైద్య బందను వేద వేద్య నోడీగలె
శ్రీదేవీ రమణను శ్రీనివాసునెంబ.

పరమపావనుడైన తిరుమలేశుని పాదారవిందములకు దండప్రణామాలు అర్పిస్తూ దాసులవారు–

'శరణు వెంకటరమణ నిన్న
చరణవ నంబిదె నాను
కరుణాసాగర కామిత ఫలవీవ
శరణ భక్తర కావ గరుడవాహన దేవ".

శ్రీనివాసునిలో పురందర విఠలుని దర్శించి కీర్తించిన మహాభక్తుడు పురందరదాసు అభయప్రదాతగా నుతులందుకొన్న శ్రీవేంకటేశ్వరుని పట్ల అచంచలమైన విశ్వాసంతో గుణగానం చేశారు–

'నీనిరలు నమగేతర భయవో
సనకాదిగళ ప్రియ తిరువెంగళయ్య.

ఈ కీర్తనలో మనస్సు చంచలమైనది. వక్రమార్గంలో పరుగు తీయటం గమనింపదగును. పురందరదాసు మనస్సును శ్రీనివాసునితో సంలీన మొనర్చవలసినదిగా వేడుకొంటూ–

"ఎన్న మనద డొంక తిద్దిసో శ్రీనివాస
ఎన్న మనద డొంక తిద్దిసో
ఎన్న మనద డొంక తిద్ది నిన్న చరణదల్లి సేరిసో
నిన్న సేవకనాద మేలె ఇన్ను సంశయవేకె కృష్ణ..."

మరొక కీర్తనలో..
నారాయణతే నమోనమో భవ
నారద సన్నుత నమో నమో!

అన్న సంస్కృత కీర్తనలో నారాయణుడు నారద సన్నుతుడు, ఆదిదేవుడు, ఆగమశాస్త్ర పూజితుడు, యాదవ కులదీపకుడు, సుందరరూపుడు, వేదాలను ఉద్ధరించినవాడు శ్రీవేంకటేశ్వరుడేనని స్తుతించాడు.

భక్తుడు దైవం ఎదుట తాను చేసిన తప్పులను ఒప్పు కొని పశ్చాత్తాప పడతాడు. అలా తప్పులను ఒప్పుకుంటూ

సతిసుతరిగె సంసారబలెగె అతి మతిహీననాగి సిక్కి ఆసెగళిగె
మితికాశెనయా ఎన్నపాపగళిగె ముందె గతియావుదయ్య
హరియ ప్రదక్షిణ మాడదల్లి నరహరియ పాదకె నాబీళలిల్ల
అతిథి బందరె మనగె నా గతియిల్ల కూడదు ఎందె,

అంటూ కుమిలిపోయాడు.

ప్రహ్లాదుని, ధృవుని, ద్రౌపది, అహల్యను, పిడికెడు అటుకులు సమర్పించిన కుచేలుని కాపాడావు. మహాపాపి యైన అజామిళుని కాపాడావు. వాడు నీకు మేనల్లుడా? అని నిక్కచ్చిగా ప్రశ్నిస్తూ నన్నుకూడా నీవే కాపాడు అని ప్రార్థిస్తూ–

'నానేను మాడిదెనో వెంకటరాయ నీనెన్న కాయబేకో మానాపమానవు భారవు నిన్నదే ఎంబ విశ్వాసవిదె', 'వేంకటా చలనిలయం వైకుంఠ పురవాసం' కీర్తనలో విష్ణుమూర్తిని సన్నుతించాడు.

కలలో కనిపించిన స్వామిని తనలోనికి ఆహ్వానిస్తూ వెంకటరమణనె బారో శేషాచలవాసనే బారో పంకజనాభ పరమపవిత్ర శంకరమిత్రనె బారో అన్నాడు. అలా అనడంలో శివకేశవుల మధ్య ఎలాంటి అంతరం లేదన్నాడు.

'వేంకటేశ' అన్న మంత్రం నాలుగువేదాల సమన్వయం అంటూ 'వెంకటేశ నిన్న నామకే మొదలు నాల్కు అక్షరగళ నోడో బింకవాద నాల్కువేదశాస్త్ర పురాణగళు అదరింద' అని కీర్తించాడు.

'నోడు నోడు వెంకటేశ నోడు నోటవ అవ ఆడు ఆటవ బేటెగాగి దొరటుబంద ప్రఖ్యాతన' అన్న కీర్తనలో పద్మావతీ కల్యాణాన్ని వివరించాడు. ఇలా ఎన్నో, ఎన్నెన్నో కీర్తనలు రచించిన పురందరదాసు–

'ధరయొళధిక వేంకటాచలగె స్థిరవారి పుష్కరణిలి నెలిసిహగె, పరతత్వ శ్రీపురందర విఠలగె వర వేంకట శ్రీనివాసనిగె మంగళం' అని భక్తిపూర్ణ హృదయంతో మంగళం పలికాడు.

తిరువేంకటేశ్వరుని ఆలయంలో పురందరదాసు అన్న మయ్యను దర్శించాడు. ఆయన సంకీర్తనను విన్న పురందర దాసు సంతోషంతో 'శ్రీవేంకటేశ్వరుని దర్శించినంత ఆనందంగా ఉంది' అన్నాడు.

అన్నమయ్య కోరికమేరకు తాను కూడా కన్నడ కీర్తనలను ఆలాపించాడు, ఈ కీర్తనలలో పాండురంగ విఠలుని దర్శనం పొందిన అన్నమయ్య పరవశించాడు. అన్నమయ్య సంకీర్తనల లాగే పురందరదాసు కీర్తనలు కూడా, రక్కస తంగడి యుద్ధం, తరువాత 'హంపి' శిథిలమైనప్పుడు కాలగర్భంలో కలిసి పోయాయి.

రామభక్తుడైన త్యాగయ్య తన తండ్రి రామబ్రహ్మం ద్వారా పురందరదాసు కీర్తనలు నేర్చుకున్నారు. ఎంతో స్ఫూర్తి పొందారు.

వేలాది కీర్తనలు పాడిన పురందరదాసు –
'ధరెయొకధిక వేంకటాచలగె స్థిరవారి పుష్కరిణియలి నెలసిహగె పరతత్వ శ్రీపురందర విఠలగె వర వేంకట శ్రీనివాసనిగె మంగళం'

'వినావేంకటేశం ననాథో ననాథ!' అంటూ పురందర విఠలుని శ్రీవేంకటేశ్వరుని అద్వైత భావంతో స్తుతించిన సంకీర్తనా చార్యుడు శ్రీపురందరదాసు.

# భీష్మైకాదశి

- శ్రీ ఎమ్.రామ్‌ప్రసాద్

"ప్రహ్లాద నారద పరాశర పుండరీక
వ్యాసాంబరీష శుకశౌనక భీష్మదాల్భ్యాన్
రుక్మాంగదార్జున వసిష్ఠ విభీషణాదీన్పుణ్యా
నిమాన్పరమ భాగవతాన్ స్మరామి"

నిత్యస్తవనీయులైన భాగవతోత్తములలో భీష్ముడు ఒకడు. పితృవాక్య పరిపాలకుడిగా శ్రీరాముడు కీర్తింపబడినట్లే భీష్ముడు కూడా పితృవాక్య పరిపాలకుడిగా స్మరించుకోదగినవాడు.

ప్రభాసుడనే ఒక వసువు భీష్ముడిగా గంగాశంతనులకు జన్మించాడు. గంగా శంతనుల షరతు ప్రకారం గంగ తనకు పుట్టిన బిడ్డలనందరినీ గంగపాలు చేస్తూ ఉండగా శంతనుడు భీష్ముడిని మాత్రం పడవేయనీయకుండా అడ్డుకున్నాడు. భీష్ముడు సకలవేదశాస్త్రాలను, అస్త్రవిద్యను, ఆత్మ విజ్ఞానాన్ని క్షుణ్ణంగా నేర్చుకుని పాండిత్యాన్ని గడించాడు. శంతనుడు భీష్ముణ్ణి యువరాజుగా పట్టాభిషిక్తుణ్ణి చేశాడు.

ఒకసారి శంతనుడు దాశరాజు పుత్రిక సత్యవతిని వివాహమాడ గోరాడు. దాశరాజు సత్యవతికి పుట్టిన బిడ్డలకు రాజయ్యే అర్హత ఉండదనే కారణంతో నిరాకరించాడు. చింతాక్రాంతుడైన శంతనుని ద్వారా విషయం తెలుసుకుని భీష్ముడు దాశరాజును అర్థించాడు. దాశరాజు భీష్ముడికి కలిగిన సంతానం సత్యవతి కుమారులకు అడ్డువస్తారేమోనని అనుమానించాడు. భీష్ముడు శంతనుని ఒప్పించడానికి తాను ఆజన్మాంతం వివాహమాడనని శపథం చేశాడు.

భీష్ముడి అసలు పేరు దేవవ్రతుడు. ఈ భీషణమైన ప్రతిజ్ఞవల్ల భీష్ముడైనాడు. ఆ ప్రకారంగానే మాటకు కట్టుబడి బ్రహ్మచర్యాన్ని పాటించాడు.

తరువాత రాజు కావడానికి అవకాశాలుండీ చక్కని పర్యవేక్షణతో రాజ్యాన్ని ముందుకు నడిపాడు కానీ ప్రలోభపడలేదు. భీష్మపితామహుడిగా మన్ననలందుకున్నాడు.

కౌరవపక్షంలో ఉన్నా న్యాయపక్షపాతి. కౌరవులకు పాండవుల గొప్పదనాన్ని గురించి ఎన్నో విధాల నచ్చచెప్పాడు. సూచనలు చేశాడు. హెచ్చరించాడు. అయినా దుర్యోధనుడు పెడచెవిన పెట్టాడు.

ద్రౌపదీ మానసంరక్షణ విషయంలో, శ్రీకృష్ణరాయబార ఘట్టంలో భీష్ముడు తలవంచుకొని కూర్చోవడానికి కారణం అసమర్థత కాదు, ఉదాసీనతా కాదు. ఒక్క బాణంతో తునాతునకలు చేయగల సమర్థుడు భీష్ముడు. కానీ, రాజాజ్ఞను ధిక్కరించడం ధర్మంకాదు. ధర్మసూక్ష్మ



మెరిగిన భీష్ముడు ఒకవేళ రాజాజ్ఞను ఉల్లంఘిస్తే ప్రజలకు కూడా రాజుపైన గౌరవం ఉండకుండాపోతుంది. అందు వల్ల సంయమనంతో నిగ్రహించుకున్నాడు రాజనీతిజ్ఞుడైన భీష్ముడు.

కృష్ణార్జునులు నరనారాయణులని ఎరిగినవాడు. తన మరణ రహస్యాన్ని ధర్మరాజుకు తెలిపి వారిపట్లగల వాత్సల్యాన్ని చూపాడు. అర్జునుని శరాలు నొప్పించినా అతని బాణ ప్రయోగ వైచిత్రికి ఆనందించాడే కానీ ఆక్షేపించలేదు.

కురుక్షేత్ర సంగ్రామంలో పదిరోజులలో భీష్ముడు రోజుకి పదివేలమంది సైనికులను హతమార్చాడు. భీష్ముడి రౌద్రాకారము, విజృంభణ, వాసుదేవునే వణికేలా చేశాయి. లాభంలేదని సుదర్శన చక్రం ధరించి భీష్ముడి పైకి ఉరికాడు. అప్పుడు భీష్ముడు దేవాదిదేవా! నీ చేతులలో మరణించడం కన్నా అదృష్టం మరేముంది? అని ముకుళిత హస్తాలతో అంటాడు.

శరీరమంతా గుచ్చుకున్న శరాలతో నేలపై ఒరగబోతున్న స్థితిలో భీష్ముడికి అర్జునుని చేత అంపశయ్యను సిద్ధం చేయించాడు. భీష్ముని కోరికపై బాణం వేసి అర్జునుడు గంగను తెప్పించాడు.

శ్రీకృష్ణుడు అంపశయ్య దగ్గరకు వచ్చినపుడు శరీరం స్వాధీనంలో లేదని, వంగి నమస్కరించలేననీ వినయంగా విన్నవించుకున్నాడు.

పరమాత్ముడు భీష్ముడికి ఆకలిదప్పులు లేకుండా రక్షణ కల్పించాడు. భీష్ముడికి ఉన్న వరం ప్రకారం ఆయనకు స్వచ్ఛంద మరణాన్ని పొందేవీలుంది. దేవతలను సంతృప్తిపరిచేందుకోసం ఉత్తరాయణం వచ్చేంత వరకు వేచి ఉన్నాడు.

అంపశయ్యమీద ఉన్న భీష్ముడి దగ్గరకు కలత చెంది ఉన్న ధర్మరాజుకు ధర్మాలు ఉపదేశించమని తీసుకువచ్చాడు శ్రీకృష్ణుడు. భీష్ముడు ధర్మరాజుకి అనేక నీతులు చెప్పాడు. లౌకిక, ఆధ్యాత్మిక విషయాలలో భీష్ముడు చెప్పని నీతివాక్యమే లేదు. మహిమోపేతమైన విష్ణుసహస్రనామాన్ని ఉపదేశించాడు. భీష్మాచార్యుడు మాఘశుద్ధ ఏకాదశికి ముందుగా వచ్చే అష్టమినాడు పరమపదాన్ని పొందాడు.

అందుచేతనే, ఆ మహామహుని పేరుమీద మాఘ శుద్ధ ఏకాదశిని భీష్మైకాదశిగా పిలుస్తున్నారు. ఆనాడు విష్ణువును పూజించడం, విష్ణుసహస్రనామపారాయణం చేయడం శ్రేయస్కరం. అష్టమినాడు భీష్ముని ఉద్దేశించి శ్రాద్ధ క్రియ జరిపినవారికి సంతతి కలుగుతుంది. తర్పణాలు మాత్రం నిత్యంగా (విధిగా) చెప్పబడినాయి. తర్పణలర్పించిన వారికి సంవత్సరంలో చేసిన పాపాలన్నీ నశిస్తాయని ధర్మ సింధువు ద్వారా తెలుస్తున్నది.



పాఠం-04

# సంస్కృతం నేర్చుకుందాం..!!

రచన- మహామహోపాధ్యాయ కాశీ కృష్ణాచార్య

నిర్వహణ- మహామహోపాధ్యాయ సముద్రాల లక్ష్మణయ్య

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| एते | = | వీరు | अद्य | = | ఇవ్వేళ | आसन् | = | ఉండిరి |
| के | = | ఎవరు? | एकदा | = | ఒకప్పుడు | आस्त | = | మీరుంటిరి |
| सर्वे | = | అందరు | सर्वदा | = | ఎల్లప్పుడు | आस्म | = | ఉంటిమి |

అ) ఈ క్రింది వాటిని తెలుగులోకి అనువాదం చేయండి?

01) एते अद्य कुत्रासन्?
02) ते एकदा तत्रासन्।
03) यूयं सर्वदा अत्रास्त।
04) वयं कदा अत्रास्म?
05) तत्र के आसन्?
06) सर्वे तत्रासन्।
07) ते के?
08) वयं अद्य तत्र स्मः।
09) त्वम् अत्र नासीः।
10) बत! अहम् अत्रासम्।

ఆ) ఈ క్రింది వాటిని సంస్కృతంలోకి అనువాదం చేయండి?

01) మీరెవరు?
02) మేమిక్కడనుంటిమి.
03) ఇవ్వేళ వాడక్కడనున్నాడు.
04) నీవక్కడ లేవా?
05) మేమందరము అక్కడనుంటిమి.
06) మీరందరు అక్కడనుంటిరా?
07) ఎవరివ్వేళ అక్కడనున్నారు?
08) వారు, వీరు, మేము అక్కడనుంటిమి.
09) మీరెప్పుడు అక్కడనుంటిరి?
10) మేమివ్వేళ అక్కడనుంటిమి.

అ) జవాబులు

01) వీళ్ళు ఈ రోజు ఎక్కడ ఉండిరి?
02) వాళ్ళు ఒకప్పుడు అక్కడ ఉండిరి.
03) మీరు ఎల్లప్పుడూ ఇక్కడ ఉంటిరి.
04) మేము ఎప్పుడు ఇక్కడ ఉంటిమి?
05) అక్కడ ఎవ్వరు ఉండిరి?
06) అందరూ అక్కడ ఉండిరి.
07) వాళ్ళు ఎవ్వరు?
08) మేము ఈ రోజు అక్కడ ఉన్నాము.
09) నువ్వు ఇక్కడ లేకుంటివి.
10) అయ్యో! నేను ఇక్కడ ఉంటిని.

ఆ) జవాబులు

01) यूयं के?
02) वयं अत्र आस्म।
03) अद्य सः तत्रास्ति।
04) किं त्वं तत्र नासीः?
05) वयं सर्वे तत्र आस्म।
06) यूयं सर्वे किं तत्र आस्त?
07) के अद्य तत्र सन्ति?
08) ते, एते, वयं तत्र आस्म।
09) यूयं कदा तत्र आस्त?
10) वयं अद्य तत्र आस्म।

బాలప్రబోధం

# 'అహంకారం'

## ప్రమాదకరమైన అవలక్షణం

- శ్రీ కె.మల్లికార్జున

మానవుల్ని అతఃపాతాళంలోకి తోసేసే ప్రమాదకరమైన అవలక్షణం 'అహంకారం'. ఈ అహంకార బీజం మనోక్షేత్రంలో మొలకెత్తిందంటే అది విషవృక్షమై మానవుణ్ణి సర్వనాశనం చేస్తుంది. చరిత్ర హీనుణ్ణి చేస్తుంది.

అహంకారి తన జీవితాన్నే కాదు, తన చుట్టూ ఉన్న సాటి మానవుల జీవితాన్నీ భ్రష్టు పట్టిస్తాడు. జాతికీ, దేశానికీ ద్రోహం చేస్తాడు. సత్యం, ప్రేమ, అహింస, కరుణ అనే సద్గుణాల్ని పూర్తిగా విస్మరిస్తాడు.

'నేను, నాది' అన్న అహం మనసులో ప్రవేశిస్తే, మర్యాద పట్టించుకోడు. మంచిమాటల్ని పెడచెవిన పెడతాడు. ఎవ్వరి హితవును వినడు. మంచిని కనడు, తాను పట్టిన కుందేటికి మూడే కాళ్లని మూర్ఖపు వాదనలు చేస్తూంటాడు. మంచిచెడుల విచక్షణను కోల్పోతాడు. బాంధవ్యం, అనుబంధం, మైత్రి, సత్సాంగత్యం అన్నీ వదిలేస్తాడు. అన్ని అనర్థాలకు ప్రధాన హేతువు ఈ అహంకారమే!

అహంకారానికి అందుకు కారణభూతమైనవి ప్రధానంగా 'యౌవనం, ధనం, అధికారం, అజ్ఞానం' - అనే నాలుగు లక్షణాలని విజ్ఞులు చెబుతారు.

**1)** యువరక్తంవేడిగా వాడిగా శరీరంలో ప్రవహిస్తున్నప్పుడు సహజసిద్ధంగానే శారీరక శక్తి విజృంభించి మానవుని వివేకాన్ని కప్పేస్తూ ఉంటుంది. ఫలితంగా అతనెవ్వరినీ లెక్కచేయ్యడు. ఎదురుదెబ్బ తినేవరకూ అహంకారంతో



ప్రవర్తిస్తూంటాడు. పెద్దలముందు తలవంచడు. గౌరవించడు, తన దూకుడుకు కళ్లెం పడేవరకు కన్నూ మిన్నూ కానకుండా హూంకరిస్తూంటాడు. అందరినీ తూలనాడుతూ అవమానిస్తూంటాడు. హింసిస్తూంటాడు.

**2)** సుఖజీవితానికి ధనసంపద అవసరమే. ధనమే జీవితం కారాదు. 'ధనం మూల మిదం జగత్' అని నమ్మే వ్యక్తి 'ధర్మమూల మిదం జగత్' అని ముందుగా విశ్వసించాలి.



అలా కాకుండా అధర్మమార్గంలో అక్రమ ధనార్జన చేసిన వాడిని అహంకారమే నిలువునా ఆవరిస్తుంది. అలా నడమంత్రపు సిరి కనుక వచ్చిందంటే ఆ మనిషికెవ్వడూ కనబడడు. జగత్తంతా ఇది తప్పని వారిస్తున్నా, హెచ్చరిస్తున్నా లక్ష్య పెట్టడు. అన్యాయంగా అవసరాన్ని మించి ఆర్జించిన సంపద అతణ్ణి అధోగతిపాలు చేస్తుంది.

"అహంకారానికి మూలమై సంపద ఏమాత్రం సుఖ శాంతుల్నివ్వదు. సమాజానికి ఉపయోగపడదు. అటువంటి అన్యాయార్జిత విత్తంగల తండ్రి కుమారుడిని చూసినా భయ పడుతూనే ఉంటాడు"- అంటాడు ఆదిశంకరులు.

'ధర్మమూల మిదం జగత్' అని ముందుగా అందరూ విశ్వసించాలి

**3)** అధికారం అందలమెక్కించగానే మానవుడి అహం కారానికి పట్టపగ్గాలుండవు. అధికారమనే పదునైన ఆయుధం మంచికీ, చెడుకీ కూడా ఉపయోగపడుతుంది.




అధికారి తన మాటకు చేతకు తిరుగులేదనుకున్నప్పుడు, ఏ మాత్రం అహంకారం మనసులో విషపు చుక్కలా ప్రవేశించినా అధికారం అధఃపతనం కావడానికి మూలమౌతుంది.

**4)** అజ్ఞాని మంచిచెడులు గ్రహించడు. అధ్యయనం, అనుశీలనం చేయడు. జ్ఞానార్జనకై కనీసం యత్నించడు.




ఇతరులు మంచి సూచనలు, సలహాలు చెప్పినా వినడు. తనను తాను తెలుసుకోగలిగేవాడే జ్ఞాని. అటువంటి జ్ఞానికి ఏ కోశానా అహంకారమే ఉండదు.

ఈ నాలుగు అంశాల్లోను 'బుద్ధి' అంకుశంగా పని చేస్తే అహంకారమే దరిచేరదు. పూర్వజన్మ సంస్కారాలు, సత్సాం



గత్యం సాత్త్వికాహార నియతి, వేదపురాణాధ్యయనం వల్ల బుద్ధిసక్రమమై, మానవుణ్ణి సక్రమమార్గంలో నడిపిస్తుంది. ప్రేమ, పరోపకారబుద్ధి, సహనం వంటి సద్గుణాలతో జీవితాన్ని సుసంపన్నం చేస్తుంది. అహంకారం మనసులో నాటుకుందంటే ఎప్పటికైనా ఎవరికైనా అపకార కారకమే, అనర్థదాయకమే. ఆచరణకంటే ఆలోచన గొప్పది. మనసు కంటే బుద్ధి గొప్పది. అటువంటి బుద్ధిని గౌరవించి, అది చూపే మార్గదర్శకత్వాన్ని ఎన్నటికీ దహించదు.

అహంకారం వల్లనే రావణుడు, దుర్యోధనుడు, హిరణ్యకశిపుడు, విశ్వామిత్రుడువంటి వారెందరో పతనమై అపఖ్యాతి పాలైపోయారు. అహంకారంవల్ల విద్వేషం, విద్వేషంవల్ల క్రోధం, క్రోధంవల్ల విశృంఖలత్వం, విశృంఖలత్వంవల్ల వినాశనం సంభవిస్తాయి. ఇలాంటి పరిణామాలు సమాజానికిశ్రేయస్కరం కావు. ఆధ్యాత్మిక పురోగతికి అహంకారం పెద్ద అవరోధం. ఒక్క మనిషిలో తప్ప ప్రకృతిలోని ఏ అణువూ అహంకారంతో లేదు. ఈ నిరహంకార పరోపకార లక్షణమే భారత ధార్మిక సువ్యవస్థకు పునాది. జాతి నవజీవన స్రవంతికి అది పరశువేది.

*ఓం శాంతిః శాంతిః శాంతిః*

ఆయుర్వేదం

# 'దానిమ్మ' లో మెండైన ఔషధగుణాలు

- డా॥ చిట్టిభొట్ల మధుసూదనశర్మ

ఆహారపదార్థంగా వివిధపోషకాల నిలయమైన దానిమ్మ పండును సేవిస్తాం. కాని భగవంతుడు దానిమ్మ ఫలాల్లోనే కాకుండా దానిమ్మ పెచ్చులు, ఆకులు, పూలు, బెరడులాంటి వివిధభాగాలలో అత్యంత శక్తివంతమైన ఔషధపదార్థాలను నిక్షిప్త పరచి మానవాళి ఆరోగ్య పరిరక్షణ కోసం ప్రసాదించాడనే విషయం చాలామందికి తెలియదు. సంస్కృతంలో దాడిమ అని, ఆంగ్లంలో పోమ గ్రనేట్ అని వ్యవహరింపబడే ప్యునికేసి అను వృక్ష కుటుంబానికి చెందిన ఈ దానిమ్మ శాస్త్రీయనామం "ప్యూనికా గ్రానేటం". దానిమ్మలోని ఔషధ గుణాలను ప్రస్తుతం తెలుసుకుందాం...

**పుల్లటి త్రేపులు, కడుపునొప్పి లాంటి సమస్యలకు -** ఎండించిన దానిమ్మ పెచ్చుల చూర్ణం 100 గ్రాములు, పుదీన ఆకుల్ని ఎండించి చేసిన చూర్ణం 25 గ్రాములు, సైంధవ లవణం పొడి 25 గ్రాములు కలిపి ఉంచుకొని రోజూ 2 పూటలా పూటకి 100 మి.లీ. నీటిలో 2 గ్రాముల పొడిని కలిపి సేవిస్తూ ఉండాలి. దీనివల్ల కడుపు ఉబ్బరం, అజీర్తి, వాంతులు కూడా తగ్గుతాయి.

**కిడ్నీ రాళ్ళకు -** 25 గ్రాముల ఉలువలని 250 మి.లీ.ల నీటిలో గంట సేపు నానించి పిదప సన్నమంటపై 125 మి.లీ.ల కషాయం మిగిలేలా మరిగించి, దించి, చల్లార్చి, వడకట్టి రెండు పూటల పూటకు సగం కషాయంలో 2-3 టీ స్పూన్‌ల దానిమ్మ విత్తుల పేస్టు కలిపి సేవించడం వల్ల మూత్ర వ్యవస్థలోని రాళ్ళు అతి త్వరగా కరిగిపోతాయి.

**వివిధ రకాల విరేచనాలు తగ్గేందుకు -** దానిమ్మ పెచ్చుల చూర్ణం 75 గ్రాములు, పంచదార 75 గ్రాములు, జాజికాయలపొడి 2.5 గ్రాములు, ఏలక్కాయల పొడి 2.5 గ్రాములు కలిపి ఉంచుకొని రోజూ 2 లేదా 3 పూటలు పూటకి 2-3 గ్రాముల పొడిని 100 మి.లీ. తియ్యటి మజ్జిగలో కలిపి సేవిస్తూ ఉంటే రక్త, బంక, జిగురు, చీము, నీళ్ళ విరేచనాలు తగ్గిపోతాయి.

**కషాయము-ఉపయోగాలు :** 200 మి.లీ.ల నీటిలో 5 గ్రాముల దానిమ్మ పెచ్చుల చూర్ణం కలిపి 100 మి.లీ. నీరు మిగిలేలా మరిగించి, దించి, చల్లార్చి, వడకట్టాలి. ఇదే దానిమ్మ కషాయం.

**నోరు, ముక్కు, మలద్వారాల నుంచి రక్తస్రావం జరుగుతుంటే :** ఈ కషాయం రెండు పూటల తయారు చేసుకొని త్రాగాలి.

**తెల్లబట్ట :** రోజూ ఒకసారి ఈ కషాయంలో 2 గ్రాముల స్వచ్ఛమైన పసుపుపొడి కలిపి జననేంద్రియాన్ని శుభ్రం చేసుకోవాలి.

**గుదమార్గం జారడం- మలద్వారం మంట :** ఒక టీ స్పూన్ మెంతులను 50 మి.లీ. నీటిలో గంట సేపు నానించి నీళ్ళను వడకట్టి ఈ కషాయంలో కలిపి రోజూ ఒకసారి సేవిస్తూ ఉండాలి.

**దంత ధావన చూర్ణం :** 100 గ్రాముల దానిమ్మ పెచ్చుల చూర్ణంలో 20 గ్రాముల మిరియాల పొడి, 10 గ్రాముల



ఉప్పు కలిపి ఉంచుకొని దంతధావన చూర్ణంగా ఉపయోగిస్తుంటే చిగుళ్ళ వాపు, పోటు, సలుపు, నొప్పి, చిగుళ్ళ నుండి రక్తం కారడం తగ్గి దంతాలు దృఢంగా అవుతాయి.

**కాలిన పుండ్లు, గాయాలకు :** దానిమ్మ ఆకులను నూరి పేస్టులా చేసి పట్టిస్తూ ఉండాలి. ఈ విధంగా చేయడం వల్ల అధికంగా చెమట పట్టడం, గజ్జి, తామర, దురద లాంటి చర్మ రోగాలు కూడా తగ్గుతాయి.

**దగ్గు తగ్గేందుకు :** 50 గ్రాముల దానిమ్మ పెచ్చుల పొడిలో 25 గ్రాముల ఉప్పు కలిపి ఉంచుకొని ఉదయం, సాయంత్రం పూటకు 1-2 గ్రాముల పొడిని తగినంత తేనెతో కలిపి సేవిస్తూ ఉండాలి.

**కడుపు, ప్రేవుల్లో పురుగులకు:** ఉదయం పూట 200 మి.లీ. పాలలో 5-10 గ్రాముల దానిమ్మ ఆకులను చితకకొట్టి వేసి పాలను కొద్దిసేపు మరగించి దించి, చల్లార్చి వడగట్టి మొదట 100 మి.లీ. పాలు త్రాగి రెండు గంటలాగి మరలా 100 మి.లీ. త్రాగాలి. పిదప రెండుగంటల తర్వాత 20-30 మి.లీ.ల ఆముదం సేవించాలి. ఇలా చేయడం వల్ల కడుపు, ప్రేగులు, ఉదరంలోని వివిధ రకాలైన పురుగులు హరిస్తాయి.


**జ్ఞాపకశక్తి పెరిగేందుకు:** రోజూ 100 మి.లీ. దానిమ్మ పళ్ళ రసంలో ఒకట్రెండు టీ స్పూన్ల తేనె కలిపి సేవిస్తుండాలి.

**ముఖం కాంతివంతంగా అయ్యేందుకు :** రోజూ ఒకసారి 3 టీ స్పూన్ల దానిమ్మ పేస్టులో అర టీ స్పూను నిమ్మరసం కలిపి ముఖంపై లేపనం చేసి అర గంటాగి కడిగేస్తుంటే ముఖంపై వచ్చే మచ్చలు, జిడ్డుతనం తగ్గిపోయి ముఖం అందంగా తేజోవంతంగా, సౌందర్యవంతంగా తయారవుతుంది.

దాడిమాష్టక చూర్ణం, దాడిమావ లేహ్యం, దాడిమాదిఘృతం, భాస్కర లవణం మొదలగు ప్రఖ్యాత ఆయుర్వేద ఔషధాల తయారీలో దానిమ్మను ఒక అనుఘటకంగా ఉపయోగిస్తారు.

## 61 వైకుంఠపాళి

**నిర్వహణ** శ్రీ కోగంటి వేంకట అప్పలాచార్యులు



### అడ్డం

1)శమీకుని పుత్రుడు(2); 3)మండోదరి భర్త(5); 6)మోక్షానికి మరో పదం(2); 7)ప్రతిమనిషి త్యాగబుద్ధితో చేయాల్సింది(2); 8)సరస్వతీదేవి భర్త(2); 11)మాయలేడి రూపంలో వచ్చిన రాక్షసుడు(4); 14)తి.తి.దే. మాసపత్రిక(4); 15)హిరణ్యకశిపుని రెండవభార్య(2); 16)లక్ష్మీదేవి(3); 17)స్వప్నం(2); 18) పాండురాజు రెండవభార్య(2); 19)కుమారస్వామి(6)

### నిలువు

2)ఈ పుణ్యక్షేత్రంలో పితృదేవతలకు పిండాలు పెడతారు(2); 3)భక్తులు తిరుమలలో దీనికొరకు గంటల తరబడి క్యూలో ఉంటారు(4); 4)'కందర్పుడు'లో దాగిన ఓ దుంప(2); 5)శ్రీకృష్ణదేవరాయలు రచించిన గ్రంథం(6); 9)మృతసంజీవనికై శుక్రాచార్యుల దగ్గరకు చేరిన శిష్యుడు(3); 10)ఇది లేకపోతే మనకేది దక్కదు(3); 13)వీరికి చంద్రుడు రాజు(5)

జవాబులు ఈ సంచికలోనే ఉన్నాయి. అన్వేషించి... సరిచూసుకోండి.
- ప్రధాన సంపాదకుడు

బాలనీతి


# తొందరపడకు - ముందర చెడకు !

– డా॥ కె.వి.జి.కె.ఆచార్యులు

"సహసా విదధీత సక్రియాం" అని సూక్తి అంటే "తొందరపడి ఏ పనీ చేయవద్దు" అని అలా అని ఉదయం లేచి పళ్ళుతోముకొనటం దగ్గర నుండి రాత్రి పడుకోబోయే దాకా చేసే రోజువారీ పనులన్నీ తీరికగా ఒకటికి రెండు సార్లు ఆలోచించి చేయాలని కాదు.

ప్రధానమైన నిర్ణయాలు తీసుకొనేటప్పుడూ, ముఖ్యమైన కార్యాలు చేపట్టబోయేటప్పుడూ తొందరపడకుండా వెనకాముందూ, మంచీచెడూ ఆలోచించి, అవసరమైతే విజ్ఞుల సలహా తీసుకోవటం కూడా మంచిదని పై సూక్తి తాత్పర్యం.

వివాహం, ఉద్యోగం, వ్యాపారం, గృహనిర్మాణం, విలువైన ఆస్తిపాస్తుల క్రయవిక్రయాలు, పిల్లల చదువు సందెలు



మొదలైన ముఖ్యవిషయాలన్నిటా ఆవేశం, తొందరపాటు నిర్ణయాలు పనికిరావు. ఆవేశంతో అహంకారంతో, తొందరపడి తీసుకున్న నిర్ణయాలు తర్వాత పశ్చాత్తాపం పడేలా చేస్తాయి.

పది తలలతో ఆలోచించే మహామేధావి రావణబ్రహ్మ. సీతాదేవిని చెరపట్టే విషయంలో ఏమాత్రం వెనక ముందులాలోచించకుండా ఆవేశంతో తొందరపడి నిర్ణయం తీసుకొనటమే లంకకు చేటు తెచ్చింది, రాక్షసకులాన్ని నాశనం చేసింది.

ధర్మరాజు జూదంలో తొందరపడి ద్రౌపదిని పణంగా పెట్టడమే మహాభారత యుద్ధానికి కారణమయింది. రావణాసురుడు కానీ, ధర్మరాజు కానీ ఆలోచన లేనివారూ, అసమర్థులూకారు. ఆవేశంతో తొందరపడి నిర్ణయాలు తీసుకొనటమే తరువాతి విపత్కర పరిస్థితులకి కారణమయింది.

అందుకే భర్తృహరి చెప్పిన సూక్తిని చూద్దాం –

సగుణ నిర్గుణ కార్యముల్ సలుపు సుమతి
సేత పరిణతి కడుప్రతీక్షింప దగును,
పరుష కర్మ విపాకంబు ఫలము దనుక
హృదయము దహించు శల్యంబు రీతి జగతి.

మంచిదిగానీ చెడ్డదిగాని ఏదైనా ఒక పని ప్రారంభించే ముందే బుద్ధిమంతుడు దానివల్ల మంచి చెడులు, లాభనష్టాలు, పరిణామం, పర్యవసానం అన్నీ ఆలోచించుకోవాలి. ఆలోచన లేకుండా ఆవేశంతో తొందరపడి చేసిన పనులకు బ్రతికినంతకాలం హృదయశల్యమై బాధించే దుష్ఫలితం మిగులుతుంది.

కాబట్టి ముఖ్యమైన పని ఏదీ ముందు వెనుకలాలోచించకుండా ఆవేశపడి చేయవద్దని భర్తృహరి బోధిస్తునాడు.


**నీతి**


**ఏ పనిని ముందు వెనుకలాలోచించకుండా ఆవేశపడి చేయవద్దు.**


చిత్ర కథ


# ఉత్తమ పుత్రుడు

కథ–డా॥ కంపల్లె రవిచంద్రన్
చిత్రాలు–కె. తులసీప్రసాద్




ఆకాశం నుండి
పూలవాన కురిసింది.
దేవతలు ప్రత్యక్షమై
తండ్రి సంతోషం కోసం
తన సుఖాన్ని, అధికారాన్ని
త్యాగం చేసిన
దేవవ్రతుణ్ణి మెచ్చుకున్నారు.
భీషణమైన ప్రతిజ్ఞ చేశావు
గనుక ఇక మీద నీవు
'భీష్ముడి'గా
పిలువబడతావు.
దాశరాజు
సంతోషంతో
సత్యవతిని శంతనునికి
ఇచ్చి పెళ్లి
చేసేందుకు
అంగీకరించి
ఆమెను,
భీష్ముని వెంట
హస్తినాపురానికి
పంపించాడు.
మహాశయులారా! మంత్రి సామాంతాది పురప్రముఖులారా! ఏకపుత్రుడు పుత్రుడు
లేనివారితో సమానమే! కనుక మహారాజు వారు ఇన్ని సంవత్సరాలకు
పెళ్లాడాలనుకోవడం అందరికీ ఆనందమే!
3


భీష్ముడు
సత్యవతీ శంతనుల
పెళ్లి జరిపించాడు.
నాయనా! ఏ కొడుకూ
తన తండ్రికోసం
ఇంతటి త్యాగం
చేయలేదు.
నీకు స్వచ్ఛంద మరణాన్ని
వరంగా ఇస్తున్నాను.
నమో త్యాగచరిత భీష్మా!
నమో పుణ్యపురుషా!
ఆడిన మాటకు
జీవితాన్ని
అంకితం చేసిన
ఆదర్శజీవి!
అఖిలలోక పురుషా!
నీ చరిత భారతవీరులకు
అనుసరణీయం
'తథాస్తు'
వచ్చే సంచికలో మరో దివ్యలీలా విలాసాన్ని దర్శించి... తరిద్దాం! స్వస్తి!
4



# క్విజ్

నిర్వహణ- శ్రీమతి పద్మజ

1) శ్రీరాముడికి 'బల-అతిబల' విద్యలు బోధించిన గురువు?
   - అ) వసిష్ఠుడు　　ఆ) వామదేవుడు
   - ఇ) విశ్వామిత్రుడు　　ఈ) భరద్వాజుడు

2) తిరుమలలో జరిగే పూజాదుల విధానం?
   - అ) పాంచరాత్ర ఆగమం　　ఆ) వైఖానస ఆగమం
   - ఇ) శైవాగమం　　ఈ) శాక్తేయం

3) తిరుమల ఆలయ విధానాల్ని క్రమబద్ధీకరించిన ఆచార్యులు?
   - అ) రామానుజాచార్యులు　　ఆ) అనంతాళ్వాన్
   - ఇ) వేదాంతదేశికులు　　ఈ) తిరుమలనంబి

4) శ్రీవేంకటేశ్వరస్వామివారు ధరించే చక్రాయుధం పేరు?
   - అ) నందకం　　ఆ) కౌమోదకి
   - ఇ) శార్ఙ్గం　　ఈ) సుదర్శనం

5) శ్రీకృష్ణుడి శంఖం పేరు?
   - అ) పాంచజన్యం　　ఆ) దేవదత్తం
   - ఇ) పౌండ్రకం　　ఈ) అనంతవిజయం

6) వకుళమాత పూర్వజన్మ?
   - అ) యశోద　　ఆ) కౌసల్య
   - ఇ) అదితి　　ఈ) నీళ

7) శ్రీపద్మావతిఅమ్మవారి తల్లి పేరు?
   - అ) కౌసల్య　　ఆ) యశోద
   - ఇ) ధరణీదేవి　　ఈ) దితి

8) శ్రీవారిని సేవించి, తరించి రచనలు చేసిన తెలుగు కవయిత్రి?
   - అ) ఆండాళ్　　ఆ) వెంగమాంబ
   - ఇ) మీరాబాయి　　ఈ) కౌసల్య


9) వైకుంఠంలో జయ, విజయులచే నిలువరించబడ్డ మునులు?
   - అ) సనకసనందాదులు　　ఆ) సూతశౌనకాదులు
   - ఇ) నారదాదులు　　ఈ) కణ్వాదులు

**జవాబులు**


1) ఇ 2) ఆ 3) అ 4) ఈ 5) అ
6) అ 7) ఇ 8) ఆ 9) అ

# చిత్రలేఖనం

ఈ బొమ్మకు రంగులు వేద్దామా...



ప్రక్కనున్న బొమ్మను క్రింది గళ్ళలో గీయండి...





Edited and published on behalf of T.T.Devasthanams by **Prof. K.Rajagopalan,** Ph.D., Chief Editor, T.T.D. and printed at T.T.D. Press by **Sri P.Ramaraju,** M.A., Special Officer (Publications & Press), T.T.D. Press, Tirupati - 517507.







లోకక్షేమం కొరకు కరోనా అంటువ్యాధి నివారణకు, లోకసుభిక్షానికై ఎస్.వి.వేదవిశ్వవిద్యాలయంలో 15-12-2020 నాడు జరిగిన **'ధనప్రద శ్రీమహావిష్ణుయాగం'**లో తి.తి.దే. కార్యనిర్వహణాధికారి డా॥ కే.ఎస్.జవహర్ రెడ్డి, ఐ.ఏ.ఎస్., తి.తి.దే. అదనపు కార్యనిర్వహణాధికారి శ్రీ ఏ.వి.ధర్మారెడ్డి గారలు పాల్గొన్న దృశ్యం



జనవరి 10 నుండి 14 వ తేదీ వరకు శ్రీవారి తిరుమల వసంతమండపంలో **'శ్రీవిష్ణుబిల్వపత్రార్చన'** జరిగిన దృశ్యం



ధనుర్మాసం ముగింపు సందర్భంగా 14-01-2021 నాడు తిరుపతిలో తి.తి.దే. పరిపాలనాభవన క్రీడామైదానంలో వేడుకగా జరిగిన గోదాకల్యాణం. ఈ కార్యక్రమంలో తి.తి.దే. కార్యనిర్వహణాధికారి డా॥ కే.ఎస్.జవహర్ రెడ్డి, ఐ.ఏ.ఎస్., తి.తి.దే. అదనపు కార్యనిర్వహణాధికారి శ్రీ ఏ.వి.ధర్మారెడ్డి, బోర్డు సభ్యురాలు శ్రీమతి వేమిరెడ్డి ప్రశాంతి, ఎం.పి. శ్రీ వేమిరెడ్డి ప్రభాకర రెడ్డి మరియు ఆలయ అధికారులు పాల్గొన్న దృశ్యం




15-01-2021న తిరుమలలో శ్రీవారికి జరిగిన పార్వేట ఉత్సవం. ఇందులో తి.తి.దే. అదనపు కార్యనిర్వహణాధికారి శ్రీ ఏ.వి.ధర్మారెడ్డి గారు మరియు ఇతర ఆలయాధికారులు పాల్గొన్న చిత్రం

# దేవుని కడప

# శ్రీ లక్ష్మీ వేంకటేశ్వరస్వామివారి బ్రహ్మోత్సవాలు

2021 ఫిబ్రవరి
13 నుండి 21 వరకు

